

హైకోర్టును తప్పుదోవ పట్టించాలని చూసిన

3 వ్యక్తికి కోటి జరిమానా

విలువైన ప్రభుత్వ భూమి కొట్టేయాలని కుట్ర

తప్పుడు పత్రాలు, వాస్తవాలు దాచిపెట్టి పిటిషన్లు

ఏప్రిల్ 10లోగా జరిమానా చెల్లించాలని

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ తీర్పు

www.andhrajyothy.com

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 350

బుధవారం | 19-3-2025 | పేజీలు : 14 | వెల (Price) : Rs. 6.50

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా.12:37 తదుపరి షష్ఠి; నక్షత్రం: విశాఖ రా.8.50 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.1:17-3:03; అమృతఘడియలు: ఉ.10.56-12.44; దుర్ముహూర్తం: ఉ.11:58-12:46; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.23, సూర్యాస్తమయం: 6.22

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీసీ బిల్లు ఆమోదం నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు. చిత్రంలో మంత్రులు పొంగులేటి, పొన్నం, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు



లెక్క తప్పంటే నష్టం బీసీలకే

ఏమీ లేని చోట బీసీ జనాభా 56.36 శాతమని తేల్చాం

42 శాతం రిజర్వేషన్ కోసం ఢిల్లీలో కొట్లాడండి

మీ వెంట మేమున్నాం.. బీసీలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

చట్టబద్ధత లేని లెక్కలతో రిజర్వేషన్లు పెంచుకోలేము

కులం ముసుగులో రాజకీయాలు చేసే వారి వలలో పడకండి

అభినందన సభ పెట్టండి.. రాహుల్ గాంధీని పిలుస్తాం

బీసీ సంఘాలతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ బిల్లు విప్లవాత్మకం

కులగణనకు దేశానికే మార్గం చూపిన తెలంగాణ

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ

హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'బీసీ జనాభా లెక్కే లేని చోట.. ఈ జనాభా 56.36 శాతంగా ఉందని లెక్క తేల్చినం. రేపు ఏ పరీక్షకైనా నిలబడేలా కులగణన సర్వే నివేదిక రూపొందించినం. భవిష్యత్తులో అవసరమైతే దీనికి సవరణలూ చేయొచ్చు. కానీ ఈ లెక్కే తప్పు అంటే నష్టపోయేది బీసీలే. చట్టబద్ధత లేని లెక్కలతో రిజర్వేషన్లను పెంచుకోలేం. బీసీ రిజర్వేషన్‌తోపాటు జనగణనలో కులగణనను చేర్చాలని బీసీలు ఢిల్లీలో కొట్లాడితే కాంగ్రెస్ మద్దతుగా ఉంటుంది' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చేసిన రెండు బిల్లులు ఆమోదం పొందిన నేపథ్యంలో అసెంబ్లీ కమిటీహాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో బీసీ సంఘాల

మిగతా 12వ పేజీలో...

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత

13

బిల్లుకు అసెంబ్లీ ఉభయసభల ఆమోదం

ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సభ్యులు

చెప్పాం.. చేసి చూపించాం.. చరిత్రాత్మకం

నా మనసుకు దగ్గరి అంశం

వర్గీకరణ ఉద్యమంలో కన్నుమూసినవారి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసంలో ప్రాధాన్యం: సీఎం

31 ఏళ్ల పోరాటానికి తెరదించిన కాంగ్రెస్ సర్కారు.. గవర్నర్ ఆమోదమే తరువాయి

దళితుల కల సాకారం

వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ

ఎస్సీ వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

అసెంబ్లీలో మంత్రి దామోదర రాజనర్సింహ

చట్టసభల్లో బీసీ మహిళలకు 50% సబ్ కోటా ఇవ్వాల్సిందే

ఢిల్లీలో జరిగిన సెమినార్‌లో తెలుగు ఎంపీలు

₹3.15 లక్షల కోట్ల బడ్జెట్?

క్యాబినెట్ ఆమోదం అనంతరం నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

సాగునీటి రంగానికి భారీగా కేటాయింపులు!

గృహ నిర్మాణ శాఖకు రూ.8-9 వేల కోట్లు

హోంశాఖకు రూ.9 వేల కోట్ల కేటాయింపు

మహిళా, శిశు సంక్షేమానికి 3,700 కోట్లు

ఇందిరా ఆత్మీయ భరోసాకు రూ.350 కోట్లు

రూ.6,000 కోట్లు.. 'రాజీవ్ యువ వికాసం'

మిషన్ భగీరథ పథకానికి రూ.6,000 కోట్లు

రూ.1,525 కోట్లు.. రీజినల్ రింగు రోడ్డుకు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్‌ను బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. శాసనసభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. ఉదయం 11.44 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. శాసన మండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టనున్నారు. దీనికి ముందు.. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి అసెంబ్లీ కమిటీ హాల్-1లో ఉదయం 9.30 గంటలకు సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి వాస్తవ వ్యయాలు, రాబడుల ఆధారంగా బడ్జెట్‌ను తీర్చిదిద్దినట్టు సమాచారం. ఆశించిన మేర రాబడి రాకపోవడంతో ప్రభుత్వం కాస్త మెత్తబడినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ పెట్టిన రూ.3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను

మిగతా 14వ పేజీలో...

గొప్ప ఆధ్యాత్మిక అనుభూతి

'గుట్ట' ఆలయ సందర్శన అనిర్వచనీయం: మిస్ వరల్డ్-2024 క్రిస్టినా పిస్కోవా

వైభవంగా యాదగిరి ప్రదక్షిణ.. తరలివచ్చిన 18 వేల మంది భక్తులు

14



యాదగిరిగుట్ట ఆలయ ప్రాంగణంలో మిస్ వరల్డ్-2024 క్రిస్టినా పిస్కోవా

వైటీడీఏ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

12

టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు ఏర్పాటుకు మార్గం సుగమం

ఎల్ఆర్ఎస్ షార్ట్‌ఫాల్ పత్రాలు..

అప్‌లోడ్ కావట్లే

రుసుము నిర్ధారణ, పరిశీలనలో ఇప్పటికే పలు ఇబ్బందులు.. పెరుగుతున్న సమస్యలు

ఫోన్‌నంబర్‌కు మెసేజీలు రాని పరిస్థితి

ఆన్‌లైన్‌లో చెక్ చేస్తేనే సమాచారం

హెల్ప్‌డెస్క్‌ల వద్ద కూడా పౌరులకు నిరాశే

ఏం చేయలేమని చేతులెత్తేస్తున్న సిబ్బంది

సమస్యల్ని పట్టించుకోని పురపాలక శాఖ



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)లో సాంకేతిక సమస్యలు క్రమేణా పెరుగుతున్నాయి. రుసుము నిర్ధారణ, దరఖాస్తుల పరిశీలనలో ఇప్పటికే పలు ఇబ్బందులు ఉండగా.. తాజాగా షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడం కూడా సవాల్‌గా మారుతోంది. ఒకటికి నాలుగుసార్లు ప్రయత్నించినా పోర్టల్‌లో పత్రాలు అప్‌లోడ్ కావట్లేదు. దీంతో కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లోని హెల్ప్‌డెస్క్‌ల వద్దకు దరఖాస్తుదారులు పరుగులు తీస్తున్నారు. కానీ, అక్కడా వారికి నిరాశే ఎదురవుతోంది. 'ఈ విషయంలో మేమేం చేయలేం. సాంకేతిక సమస్యలున్నాయి.. అప్‌లోడ్ అయ్యేదాకా ప్రయత్నించండి' అని అక్కడి సిబ్బంది సలహా ఇస్తున్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతోపాటు అన్ని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ నెల 31లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అంటే ఇంకా 12 రోజులే

మిగతా 3వ పేజీలో...

ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావుపై

రెడ్‌కార్నర్ నోటీసులు?

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్, మార్చి 18: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయినట్లు తెలిసింది. దీంతో విదేశాల్లో ఉన్న వీరిని భారత్‌కు రప్పించేందుకు మార్గం సుగమమైంది. వారిద్దరిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయినట్లు సీబీఐ తెలంగాణ సీఐడీకి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు పాస్‌పోర్టులను పోలీసులు రద్దు చేయించారు.



సునీతా విలియమ్స్, విల్‌మోర్‌లను భూమి మీదికి తీసుకొస్తున్న స్పేస్ ఎక్స్ డ్రాగన్



స్వాగతం సునీతా!

ఎట్టకేలకు ఐఎస్ఎస్ నుంచి భూమ్మీదికి సునీతా విలియమ్స్!

మంగళవారం ఉదయం 10.35కు స్పేస్ ఎక్స్ డ్రాగన్‌లో తిరుగుప్రయాణం

నేడు తెల్లవారుజామున 3.27కు ఫ్లోరిడా సముద్ర జలాల్లో దిగనున్న వ్యోమనౌక

స్ట్రెచర్‌పై వైద్య పరీక్షలకు వ్యోమగాములు

9 నెలలుగా ఐఎస్ఎస్‌లో ఉండడంతో వారు మామూలుగా నడవలేరన్న వైద్యులు

ఆరు వారాల రీహాబిలిటేషన్ ప్రోగ్రామ్

సునీత, విల్‌మోర్‌లకు నడకలో శిక్షణ, కండరాల బలోపేతానికి చర్యలు

వాషింగ్టన్, మార్చి 18: ఎనిమిది రోజుల మిషన్ కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లి.. వ్యోమనౌకలో సాంకేతిక సమస్యల కారణంగా 286 రోజులపాటు అక్కడే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతవిలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్ ఎట్టకేలకు మంగళవారం ఉదయం (భారత కాలమానం ప్రకారం) భూమ్మీదకు తిరుగు ప్రయాణమయ్యారు. వారి కోసం ప్రత్యేకంగా పంపిన స్పేస్ ఎక్స్ క్రూ-9 డ్రాగన్ క్యాప్సూల్ మంగళవారం ఉదయం 10.35 గంటలకు ఐఎస్ఎస్ నుంచి విడిపోయి భూమి దిశగా పయనమైనట్టు నాసా

మిగతా 2వ పేజీలో...

అనాథ బాలికలే టార్గెట్

గంజాయి మత్తులో దింపి వ్యభిచార రొంపి వైపు నెట్టే ముఠా

కానుకలతో ఎర.. గంజాయి ఇచ్చి ఓ బాలికపై అత్యాచారం

ఆరుగురు నిందితుల అరెస్టు.. ప్రధాన సూత్రధారి ఓ మహిళ


4,300 కండోమ్ ప్యాకెట్లు.. 1.8 కిలోల గంజాయి స్వాధీనం



కిలేడీ ముఠా వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలికలను టార్గెట్‌గా చేసుకుని, వారికి గంజాయి అలవాటు చేసి.. వ్యభిచారకూపంలోకి దింపేందుకు యత్నించే ఓ ముఠా గుట్టును వరంగల్ పోలీసులు రట్టుచేశారు. ఓ బాలికకు గంజాయి అలవాటు చేసి, తన ముఠా సభ్యుడు అత్యాచారానికి పాల్పడడానికి సహకరించిన గ్యాంగ్ లీడర్ ఓ మహిళ కావడం గమనార్హం.! మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఈ కేసు వివరాలను

మిగతా 14వ పేజీలో...



ఓటరు ఐడీ-ఆధార్ అనుసంధానం..

నకిలీ ఓటర్లను అడ్డుకోవడానికే..

ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారమే చర్యలు

త్వరలో ఈసీ- ఉడాయ్ నిపుణుల సంప్రదింపులు

ఆన్‌లైన్‌లో బూత్‌ల వారీ ఓటింగ్ వివరాలపై చర్చలకు సిద్ధం

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 18: ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారం మాత్రమే ఓటరు గుర్తింపు కార్డు-ఆధార్ అనుసంధానంపై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. నకిలీ ఓటర్ల బెడద నివారణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపడతామని, అయితే అది చట్టాలకు అనుగుణంగానే ఉంటుందని తెలిపింది. ఇందుకు సంబంధించి ఆధార్ కార్డులు జారీ చేసే 'ఉడాయ్' సంస్థ, ఎన్నికల కమిషన్ (ఈసీ)కు చెందిన సాంకేతిక నిపుణులు త్వరలో చర్చలు జరపనున్నారని ప్రకటించింది. ఇది కాకుండా

మిగతా 2వ పేజీలో...

బెట్టింగ్ యాప్‌లపై ఫైటింగ్!



'సే నో టూ బెట్టింగ్ యాప్స్' హ్యాష్‌ట్యాగ్‌తో సజ్జనార్ బెట్టింగ్ నివారణ ఉద్యమం

సోషల్ మీడియాలో భారీ స్పందన

ఇన్‌ఫ్లూయెన్సర్లూ జాగ్రత్త

కాసులకు కక్కుర్తిపడి మోసపూరిత యాప్‌లకు ప్రచారం చేస్తే కటకటాలే

ఒకే రోజు 11 మందిపై కేసులు.. నోటీసులు

మంచు లక్ష్మిపైనా కేసుకు రంగం సిద్ధం?

కేసుల భయంతో దిగొస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లు

ప్రచారం చేయబోమంటూ సెల్ఫీ వీడియోలు!

బాధితులంతా ఫిర్యాదు చేయాలన్న సజ్జనార్

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లకు వ్యతిరేకంగా సీనియర్ ఐపీఎస్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రారంభించిన ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. మోసపూరిత యాప్‌ల తరఫున ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదవుతున్నాయి. "భారత ఆర్థిక వ్యవస్థను, యువత భవిష్యత్తును ధ్వంసం చేస్తున్న బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండండి. కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లపై పోలీసులకు ఫిర్యాదు చేయండి" అని సజ్జనార్ ఇచ్చిన పిలుపునకు ఫలితం వస్తోంది. 'సే నో టూ బెట్టింగ్ యాప్స్' హ్యాష్ ట్యాగ్‌తో బెట్టింగ్ నివారణ ఉద్యమాన్ని కొనసాగిద్దామంటూ పిలుపునిచ్చారు. "ఎంతో మంది అమాయకుల ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్

మిగతా 10వ పేజీలో...

'బెట్టింగ్ యాప్' ప్రమోటర్లపై

ఈడీ నజర్!

10

హైదరాబాద్ పోలీసుల నుంచి వివరాల సేకరణ

హవాలా చెల్లింపులు జరిగినట్లు అనుమానాలు

పాక్‌లోకి చైనా మిలిటరీ సంస్థలు!

బీఎల్ఏ దాడుల నేపథ్యంలో నిర్ణయం

సీపెక్‌లో భాగంగా పాక్‌లో పని చేస్తున్న వేలాది మంది చైనీయులు

వారిపై విరుచుకుపడుతున్న బీఎల్ఏ

సిబ్బంది రక్షణకు 3 ప్రైవేటు సెక్యూరిటీ, మిలిటరీ ఏజెన్సీలతో చైనా ఒప్పందం

భవిష్యత్తులో సైన్యాన్నీ దించే చాన్స్

ఇస్లామాబాద్, మార్చి 18: పాకిస్థాన్‌లో పని చేస్తున్న చైనా జాతీయుల మీద బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) దాడులు పెరుగుతున్న నేపథ్యంలో.. వారి రక్షణకు చైనా స్వయంగా రంగంలోకి దిగింది. ఈ మేరకు మూడు ప్రైవేటు మిలిటరీ, సెక్యూరిటీ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. డేవ్ సెక్యూరిటీ ఫ్రాంటియర్ సర్వీస్ గ్రూప్, చైనా ఓవర్సీస్ సెక్యూరిటీ గ్రూప్, హుయాగ్జిన్ జోంగ్‌షన్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థలు

మిగతా 2వ పేజీలో...

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు

419 మంది మృతి.. అత్యధికులు పౌరులే



ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ధ్వంసమైన భవనాలు

2

మృతుల్లో హమాస్ ప్రధాని, మంత్రులు, పోలీసు చీఫ్ తదితరులు

660 మందికి గాయాలు

అనేక భవనాలు ధ్వంసం

కాల్పుల విరమణకు అంగీకరించనందుకే

నెతన్యాహు వెల్లడి

దాడుల గురించి తమకు ముందే సమాచారం ఉందన్న అమెరికా

'ఉపాధి' వేతనం రూ.400 ఇవ్వాలి

- ప్రతి కుటుంబానికి 150 పనిదినాలు కల్పించాలి
- కేంద్రానికి కాంగ్రెస్ నేత సోనియా గాంధీ డిమాండ్



న్యూఢిల్లీ, మార్చి 18: గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజీఎన్ఆర్ఈజీఏను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆరోపించారు. ఉపాధి కూలీలకు రోజువారీ కనీస వేతనాన్ని రూ.400కు పెంచాలని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 150 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో మంగళవారం జీరో అవర్‌లో సోనియా మాట్లాడుతూ.. 2005లో తమ యూపీఏ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఈ చరిత్రాత్మక చట్టం.. కోట్లాది మందికి ఉపాధి భద్రత కల్పిస్తోందని, అయితే నేటి ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడం ఆందోళనకరమని అన్నారు.

ట్రంప్ 'అమెరికాయే ముందు'పై అపార్థాలొద్దు

- అది 'భారతదేశమే ముందు'పై మోదీ నిబద్ధత లాంటిదే
- అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసి గబ్బార్డ్ వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 18: 'అమెరికాయే ముందు' అనే ట్రంప్ విధానాన్ని 'అమెరికా మాత్రమే' అని అపార్థం చేసుకోవద్దని అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసి గబ్బార్డ్ కోరారు. ఇది 'భారతదేశమే ముందు' అనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిబద్ధత లాంటిదేనని తేల్చిచెప్పారు. ఢిల్లీలో జరుగుతున్న రైజీనా డైలాగ్ కార్యక్రమంలో మంగళవారం ఆమె ప్రసంగించారు. హిందూ మతాన్ని పాటిస్తున్న గబ్బార్డ్.. 'నమస్తే.. జై శ్రీకృష్ణ' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ పదాలు మనందరి హృదయాల్లో ఉన్న అంతర్గత ఆధ్యాత్మిక భావాలను ప్రతిబింబిస్తున్నాయని, ఇది జాతి, తెగ, మతంతో నిమిత్తం లేకుండా మనందరి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తు చేయడమేనని ఆమె తెలిపారు. భద్రతా అంశాల నుంచి ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వివిధ సవాళ్లను ఎదుర్కోవడం సహా భారత్‌తో సంబంధాల బలోపేతాన్ని ట్రంప్ ప్రభుత్వం కోరుకుంటోందని చెప్పారు. ఇతర దేశాలతో సంబంధాల గురించి అర్థం చేసుకోలేనివాడిగా ట్రంప్‌ను అపార్థం చేసుకోకూడదని, ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేయాలనేది ఆయన అభిమతమని గబ్బార్డ్ తెలిపారు.

కృష్ణా ప్రాజెక్టులపై 2 వారాల్లో కౌంటర్ వేయండి

- కేంద్రం, ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అధీనం చేసే అంశంపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ 2021లో కేంద్రం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రిట్ పిటిషన్ దాఖలు చేయగా.. తెలంగాణ తెచ్చిన జీవో 34ను రద్దు చేయాలని, దాని పేరుతో అపరిమితంగా విద్యుదుత్పత్తి చేస్తోందని ఏపీ కూడా పిటిషన్ వేసింది. రెండు పిటిషన్లనూ కలిపి మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. జీవో 34, విద్యుదుత్పత్తి అంశాలపై తెలంగాణ సమర్పించిన అఫిడవిట్‌పై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర సర్కారును, ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తర్వాత వారం రోజుల్లో రీజాయిండర్ దాఖలు చేయాలని తెలంగాణకు సూచించింది.

పక్కా ప్రణాళికతోనే నాగ్‌పూర్ హింస

- 33 మంది పోలీసులు గాయపడ్డారు: ఫడణవీస్

ముంబై, మార్చి 18: పక్కా ప్రణాళికతోనే నాగ్‌పూర్‌లో హింస చెలరేగినట్లు కనిపిస్తోందని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. అల్లరిమూకలు ప్రత్యేకంగా కొందరి ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. ఛావా సినిమా.. మొఘల్ రాజు ఔరంగజేబుపై ప్రజల్లో గూడుకట్టుకొని ఉన్న భావోద్వేగాలను తిరగదోడిందని తెలిపారు. "విక్కీ కౌశల్ నటించిన ఛావా చిత్రంతో ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవితానికి సంబంధించిన వాస్తవ చరిత్ర ప్రజలకు తెలిసింది. శంభాజీ మహరాజ్‌ను ఔరంగజేబు చిత్రహింసలకు గురిచేసి, హతమార్చాడు. ఈ సినిమా చూసిన తర్వాత ప్రజల్లో మరోసారి ఔరంగజేబుపై ఆగ్రహం పెల్లుబికింది. ఔరంగజేబుపై కోపాన్ని భారీ నిరసన ప్రదర్శన రూపంలో తెలియజేశారు" అని మంగళవారం ఫడణవీస్ అసెంబ్లీలో చెప్పారు. ఔరంగజేబు సమాధి వద్ద సోమవారం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మత గ్రంథాన్ని కాల్చారన్న వదంతులు వ్యాపించడంతో హిందూ, ముస్లిం వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా చెలరేగిన హింసలో పలు ఇళ్లు, వాహనాలు ధ్వంసమయ్యాయి. కాగా, ఈ హింసాత్మక ఘటనల్లో ముగ్గురు డీసీపీలు సహా 33 మంది పోలీసులు గాయపడ్డారని సీఎం ఫడణవీస్ తెలిపారు.

బాలికపై ఇన్‌స్టా స్నేహితుని అత్యాచారం

బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తల్లితో గొడవపడి ఇంటినుంచి బయటకు వచ్చిన బాలికను నమ్మించిన ఇన్‌స్టాగ్రామ్ స్నేహితుడు.. తిరుపతికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. కర్ణాటకలోని దావణగెరెకు చెందిన బాధిత బాలిక 9వ తరగతి చదువుతోంది. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చూసుకునేందుకు వచ్చింది. ఇదే సమయంలో ఇన్‌స్టాలో సునీల్ (30) అనే వ్యక్తి పరిచయమయ్యాడు. పండ్ల వ్యాపారం చేసేత అతడికి అప్పటికై వివాహమై, పిల్లలు ఉన్నారు. ఈ నెల 13న బాలిక తల్లితో గొడవపడి, నేరుగా మెజస్టిక్ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ సునీల్‌ను కలిసింది. బాలికను తిరుపతికి తీసుకువెళ్లిన అతను.. అక్కడ మూడు రోజులపాటు లాడ్జిలో ఉంచి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నెల 16న బెంగళూరుకు ఇద్దరూ తిరిగి వచ్చారు. ఇంటికెళ్లిన బాలిక జరిగిన విషయాన్ని తల్లికి తెలిపింది. దీంతో బాలికతో కలసి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింద. పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్టు చేశారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. ఇంధన వనరులపై కాల్పుల విరమణ

- 30 రోజుల ఒప్పందానికి పుతిన్ అంగీకారం
- యుద్ధ ఖైదీల మార్పిడికీ సన్నద్ధత
- నేడు తొలి విడత విడుదలకు చాన్స్
- పలు డిమాండ్లపై ఒప్పించిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, మార్చి 18: మూడేళ్లకు పైగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి కొంత మేర విరామం లభించనుంది..! ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై 30 రోజుల పాటు దాడులు చేయబోమని రష్యా అధినేత పుతిన్ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పుతిన్ మధ్య మంగళవారం సుమారు గంటన్నర పాటు ఫోన్‌లో జరిగిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. నిజానికి 30 రోజుల పాటు కాల్పుల విరమణకు పుతిన్‌ను ఒప్పించాలని ట్రంప్ నిర్ణయించినా.. ఆ మేరకు అంగీకారం కుదరలేదని తెలుస్తోంది. దీంతోపాటు.. ఇరు దేశాల పరస్పర ఆక్రమణల్లో ఉన్న భూభాగాలను తిరిగి ఇప్పించడం.. ముఖ్యంగా జాపోరీజియా అణువిద్యుత్తు ప్లాంట్ నుంచి రష్యాను ఖాళీ చేయించడం వంటి అంశాలను పుతిన్ ముందు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే.. చర్చల సమగ్ర వివరాలను అటు వైట్‌హౌస్ గానీ, ఇటు క్రెమ్లిన్ గానీ వెల్లడించలేదు. యుద్ధ ఖైదీల పరస్పర బదిలీకి రష్యా అధినేత అంగీకరించినట్లు క్రెమ్లిన్ వర్గాలు విడుదల చేసిన పత్రికాప్రకటన స్పష్టం చేస్తోంది. యుద్ధంలో తీవ్రంగా గాయపడి, తమ చెరలో చికిత్స పొందుతున్న 23 మంది ఉక్రెయిన్ సైనికులను బుధవారం అప్పగించేందుకు రష్యా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు

419 మంది మృతి.. అత్యధికులు పౌరులే



ఇజ్రాయెల్ దాడుల్లో నేలమట్టమైన భవనాలు

టెల్‌అవీవ్, మార్చి 18: హమాస్ ప్రభుత్వం దాదాపుగా పతనమైంది..! గాజాపై సోమవారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 419 మంది మృతిచెందగా.. 660 మంది గాయాలపాలయ్యారు. వందల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. మృతుల్లో హమాస్ ప్రధాని ఇసామ్ దాలిస్ సహా.. కీలక మంత్రులు, మిలటరీ/పోలీసు కమాండర్లు ఉన్నారు. ముందు నుంచి హమాస్‌కు సహకరిస్తూ వస్తున్న 'ఇస్లామిక్ జిహాద్' సంస్థ కీలక నేత అబూ హమ్జా కూడా ఈ దాడుల్లో అంతమైనట్లు ఇజ్రాయెల్ వార్తాసంస్థ యెదిహోత్ అహ్రోనోత్(వైనెట్) తెలిపింది. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ వార్తా సంస్థ అల్-హదత్ కూడా హమాస్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల మరణాలను నిర్ధారించింది. అమెరికా, ఖతార్, ఈజిప్ట్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందానికి తాము అంగీకరించినా.. హమాస్ నుంచి స్పందన లేకపోవడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి వైమానిక దాడులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఎక్స్‌లో పోస్టు చేశారు. పౌరులు తూర్పు గాజాను ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇజ్రాయెల్ తమకు ముందుగానే సమాచారమిచ్చిందని, ట్రంప్ ఓకే చెప్పాకే దాడులను ప్రారంభించిందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ కూడా ఇజ్రాయెల్ దాడుల్లో 419 మంది మృతిచెందినట్లు నిర్ధారించింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు తెలిపింది. గాజాలోని ఖాన్‌యూనిస్‌తోపాటు.. రఫా, ఉత్తరగాజా, సెంట్రల్ గాజా సిటీలనే లక్ష్యంగా చేసుకుని సుమారు 200 విమానాలు దాడులకు పాల్పడ్డట్లు వివరించింది.

హమాస్‌కు భారీ నష్టం

ఇజ్రాయెల్ దాడులతో హమాస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. హనియే, సిన్వర్ వంటి హమాస్ అగ్రనాయకులు అంతమైనా.. వ్యూహాత్మక పోరాటాలకు సహకరిస్తున్న ఇస్లామిక్ జిహాద్ నేత అబూ హమ్జా తాజా దాడుల్లో హతమైనట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. క్షిపణుల కమాండర్‌గా పనిచేస్తున్న హమ్జా భార్య, ఇతర కుటుంబ సభ్యులూ చనిపోయినట్లు తెలిపింది. ఇక హనియేకు కుడిభుజంగా ఉంటూ.. ఆయన మరణం తర్వాత హమాస్ ప్రధాని పదవిని చేపట్టిన ఇసామ్ డాలిస్, ఆయన భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు మనవరాళ్లు కూడా మృతి చెందారు. డాలిస్ మరణంతో హమాస్ దారితెన్నూ లేకుండా పోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిపిన సమయంలో ఇజ్ అద్-దీన్ అల్-ఖాసమ్ బ్రిగేడ్లకు సీనియర్ నేతగా.. రఫా బ్రిగేడ్‌కు డిప్యూటీ కమాండర్‌గా డాలిస్ పనిచేశారు. డాలిస్ మరణాన్ని ఆయన సోదరుడు ధ్రువీకరిస్తూ.. మంగళవారం అల్-జజీరాకు ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు.



ఇస్లామిక్ జిహాద్ నేత అబూ హమ్జా



హమాస్ ప్రధాని ఇసామ్ దాలిస్

దాడుల్లో మృతి చెందిన ఇతర నేతలు



బహ్జత్ అబూ సుల్తాన్: ఈయన హమాస్ లెఫ్టినెంట్ జనరల్. ఇజ్రాయెల్‌పై దాడుల్లో కీలకంగా వ్యవహరించారు



అహ్మద్ ఒమర్ అల్-హట్టా: హమాస్ న్యాయశాఖ మంత్రిగా పనిచేస్తూ.. ఇస్లామిక్ చట్టాల అమలులో కీలక పాత్ర పోషించారు. గాజా అంతర్గత వ్యవహారాల ఇన్‌చార్జిగా కూడా కొనసాగారు. 2021 వరకు గాజాలోని 'రబాత్ పోలీసు శిక్షణ కళాశాల'కు డీన్‌గా పనిచేశారు.



మహమ్మద్ అబూ వత్ఫా: హమాస్ పోలీసు, భద్రత విభాగాల అధిపతిగా.. అంతర్గత వ్యవహారాల డీజీగా సేవలందించారు. సెంట్రల్ గాజాలోని ఈయన ఇంటిపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో.. వత్ఫా కుటుంబమంతా చనిపోయింది.



యాసిర్ హర్బ్: ఈయన హమాస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు. ఇజ్రాయెల్ తాజా దాడుల్లో ఈయన ఐదుగురు కుమారులు కూడా మరణించారని ఖతార్ వార్తాపత్రిక అల్-అరబీ అల్-జదీద్ వెల్లడించింది.




అబూ ఒబేదా మహమ్మద్ అల్-జమాసీ: ఈయన హమాస్‌లో మానవహక్కులను పర్యవేక్షించేవారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు కూడా. దక్షిణ గాజాకు ప్రభుత్వాధినేతగా పనిచేశారు.

పాక్‌లోకి చైనా మిలిటరీ సంస్థలు!

(మొదటి పేజీ తరువాయి)

ఇక మీదట పాక్‌లో చైనా జాతీయుల రక్షణ బాధ్యతలు చూసుకోనున్నాయి. వేల కోట్ల డాలర్ల వ్యయంతో నిర్మిస్తున్న 'చైనా-పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్' (సీపెక్)లో పలువురు చైనా జాతీయులు పని చేస్తున్నారు. కాగా, పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుతూ సాయుధ పోరాటం జరుపుతున్న బీఎల్‌ఏ.. చైనా-పాక్ కారిడార్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా బలూచిస్థాన్‌లోని ఖనిజ సంపదను దోచుకోనున్నారన్నది ఆ సంస్థ ఆరోపణ. ఈ నేపథ్యంలో చైనీయుల మీద దాడులు జరిపి వారిని భయభ్రాంతులకు గురిచేస్తోంది. తాజాగా బీఎల్‌ఏ ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసి, పలువురు పాక్ సైనికులను హతమార్చింది. సైన్యం కాన్వాయ్ మీద దాడి చేసి 90 మంది జవాన్లను ఊచకోత కోసింది. ఈ వరుస ఘటనలతో చైనీయుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో చైనా ప్రభుత్వం స్వయంగా రంగంలోకి దిగి తమ వారి రక్షణ బాధ్యతను తన చేతుల్లోకి తీసుకుంది. చైనా ఒత్తిడి మేరకు పాకిస్థాన్ తన రక్షణ బడ్జెట్‌లో.. చైనా జాతీయుల భద్రత కోసం భారీగా కేటాయింపులను పెంచింది. అయినప్పటికీ, చైనా పాక్‌ను నమ్మకుండా తానే స్వయంగా రంగంలోకి దిగటం గమనార్హం. కాగా బలూచ్ తిరుగుబాటు దారులు మరిన్ని దాడులు జరిపే ప్రమాదం ఉన్న దృష్ట్యా 2,500 మందికి పైగా సైనికులు పాక్ ఆర్మీకి రాజీనామా చేశారన్న వార్త మరోవైపు పెను సంచలనం సృష్టిస్తోంది.

లోకం తీరు



మహాకుంభ్.. ఓ జాతీయ చైతన్యం

లోక్‌సభలో ప్రధాని ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 18: ప్రయాగ రాజ్‌లో ఈ దఫా జరిగిన మహా కుంభమేళాకు ప్రజలే సారథ్యం వహించారని, వారి సంకల్పం, అంకితభావంతోనే విజయవంతంగా సాగిందని ప్రధాని మోదీ అన్నారు. ఇది జాతీయ చైతన్యానికి నిదర్శనమని తెలిపారు. పలు చారిత్రక ఉద్యమాలు, విప్లవాలు, ఘటనలతో దానిని పోలుస్తూ మంగళవారం లోక్‌సభలో ఆయన ప్రకటన చేశారు. మహాకుంభమేళా దేశ సమైక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేసిందని ప్రధాని పేర్కొన్నారు. 45 రోజుల కార్యక్రమంలో 66 కోట్ల మందికిపైగా ప్రజలు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేశారన్నారు. ఇంత భారీ జనసమ్మేళనం నిర్వహించే సత్తా భారత్‌కు ఉందా అని ప్రశ్నించినవారికి దీటైన జవాబిచ్చిందని ఆయన చెప్పారు.

మృతులకు నివాళులు అర్పించాల్సింది: రాహుల్

మహాకుంభమేళా మన చరిత్ర, సంస్కృతి అని.. సాంస్కృతిక వారసత్వంపై ప్రధాని ప్రకటనతో తాము ఏకీభవిస్తున్నామని, మద్దతిస్తున్నామని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. అయితే కుంభమేళా తొక్కిసలాటలో చనిపోయిన 30 మందికి శ్రద్ధాంజలి ఘటించడంలో ఆయన విఫలమయ్యారని విమర్శించారు. పార్లమెంటు ప్రాంగణంలో రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ.. సభలో ప్రధాని ప్రకటన చేశాక తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. 'కుంభమేళాకు హాజరైన లక్షల మంది యువత కోరుకునేది ప్రశంసలు కాదు.. ఉద్యోగాలు. ప్రధాని నుంచి ఉపాధి కోరుతున్నారు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

బెంగళూరులోని 'సోరోస్' సంస్థల్లో సోదాలు

- ఫెమా చట్టం ఉల్లంఘన కేసులో 8 సంస్థల్లో రోజంతా ఈడీ తనిఖీలు

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అమెరికా కుబేరుడు జార్జ్ సోరోస్ సంస్థ ఓపెన్ సొసైటీ ఫౌండేషన్‌కు (ఓఎస్ఎఫ్) చెందిన బెంగళూరులోని కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం సోదాలు జరిపింది. విదేశీ మారక ఉల్లంఘనల కేసులో భాగంగా ఈ ఫౌండేషన్ నుంచి లబ్ధి పొందుతున్న కొన్ని సంస్థలకు చెందిన ఎనిమిది కార్యాలయాల్లోనూ తనిఖీలు నిర్వహించింది. ఈ సంస్థల్లో కొన్ని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలతో సంబంధం కలిగి ఉన్నాయి. ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ ఆర్థిక విభాగం అయిన ఈడీఎఫ్‌లో బెంగళూరుకు చెందిన అస్పడా ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ప్రధాన లబ్ధిదారుగా ఉన్నట్లు ఈడీ వర్గాలు ప్రాథమికంగా గుర్తించాయి. ఫెమా మార్గదర్శకాలను ఉల్లంఘించి ఈ సంస్థ ఎఫ్‌డీఐలను (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) పొందుతోందని, ఈడీఎఫ్‌కు చెందిన ఆర్థిక వ్యవహారాలను ఇదే చక్కబెడుతోందని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. మరో సంస్థ కూడా ఇదే పని చేస్తున్నదని తెలిపాయి. నిజానికి, భారత్‌లో ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ కార్యకలాపాలకు 2016లో కేంద్రం పరిమితులు విధించింది.

ఓటరు ఐడీ-ఆధార్ అనుసంధానం.. నకిలీ ఓటర్లను అడ్డుకోవడానికే..

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణకు సంబంధించి మరో రెండు కీలక ప్రకటనలు చేసింది. ఒక ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ నెంబరు)పై పలువురి ఓటర్ల పేర్లు నమోదయి ఉంటే దానిని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికార్లే గుర్తించేలా సాఫ్ట్‌వేర్‌లోనే ప్రత్యేక ఆప్షన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. పోలింగ్ ముగిసిన అనంతరం బూత్‌ల వారీగా ఓటింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టే విషయమై చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

ఆధార్- ఎపిక్ అనుసంధానంపై ఎన్నికల కమిషన్ మంగళవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి, చట్ట సభల వ్యవహారాల కార్యదర్శి, ఐటీ శాఖ కార్యదర్శి, ఉడాయ్ సీఈవోలతో చర్చలు జరిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా అనుసంధానం ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం ప్రకారం భారత పౌరులకు ఓటు హక్కు లభిస్తుంది. ప్రజాప్రాతినిధ్య చట్టానికి 2021లో చేర్చిన సెక్షన్లు 23(4), 23(5), 23(6)ల్లో ఆధార్ అనుసంధానికి సంబంధించిన సూచనలు ఉన్నాయి. ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కు భారత పౌరులకు మాత్రమే పరిమితం. ఆధార్ కార్డు వ్యక్తుల గుర్తింపును తెలుసుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో ఈ రెండింటి అనుసంధానంపై సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చింది. కాగా ఈసీ నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతించింది. బోగస్ ఓట్లపై తాము చేసిన ఫిర్యాదులకు స్పందించి సవరణలకు చర్యలు ప్రారంభించిందని తెలిపింది.



'నకిలీ ఓటర్ల' తొలగింపునకు చర్యలు

పశ్చిమ బెంగాల్‌లో పెద్దయెత్తున 'నకిలీ ఓటర్ల' పేర్లను చేర్చారంటూ తృణమూల్ కాంగ్రెస్ ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 'నకిలీ ఓటర్ల'ను గుర్తించి, వారి పేర్లను తొలగించేందుకు సాఫ్ట్‌వేర్‌లోనే ప్రత్యేక 'ఆప్షన్'ను ఏర్పాటు చేసింది. ఒకే ఓటరు గుర్తింపు కార్డు నెంబరు (ఎపిక్) నెంబరుపై పలువురి పేర్లు నమోదయి ఉన్నట్టయితే వాటిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులే గుర్తించి తొలగించవచ్చు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన లేఖను బెంగాల్ తాత్కాలిక ప్రధాన ఎన్నికల అధికారి వర్చువల్ భేటీలో అన్ని జిల్లాల అధికార్లకు వివరించి చెప్పారు.

ఆన్‌లైన్‌లో బూత్‌ల వారీ వివరాలు

పోలింగ్ జరిగిన 48 గంటల అనంతరం బూత్‌ల వారీ ఓటింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఓటింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనానికి ఈ విషయాన్ని నివేదించింది. ఈ వ్యాజ్యాలపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణను జూలై నెలకు వాయిదా వేశారు.

స్వాగతం సునీతా!

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. అందులో సునీత, విల్‌మోర్‌తోపాటు మరో ఇద్దరు వ్యోమగాములు అలెగ్జాండర్ గోర్బనోవ్ (రష్యా), నిక్ హేగ్ (అమెరికా) కూడా ఉన్నారు. ఈ నౌక 17 గంటలపాటు ప్రయాణించి ఫ్లోరిడా తీరంలోని సముద్ర జలాల్లో బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు దిగుతుందని నాసా వెల్లడించింది. దిగగానే నాసా రికవరీ బృందాలు అక్కడికి వెళ్లి వారిని వ్యోమనౌక నుంచి బయటకు తెచ్చి.. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించి వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపింది. దాదాపు 9 నెలల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో, భార రహిత స్థితిలో ఉన్న నేపథ్యంలో సునీత, విల్‌మోర్ భూమ్మీదికి తిరిగి రాగానే మామూలుగా నడవలేరని నాసా మాజీ వ్యోమగామి లెరోయ్ చియావో వెల్లడించారు. రోదసిలో ఉన్నప్పుడు శరీరంలోని రక్తం, ఇతర స్రావాలన్నీ పైభాగంలో ఎక్కువగా చేరుతాయని.. దీనివల్ల భూమ్మీదికి వచ్చాక వారు నిలబడితే రక్తపోటు పడిపోయి, కళ్లు తిరిగి పడిపోతారని వివరించారు. ఈ నేపథ్యంలో.. వైద్యపరీక్షలు పూర్తయిన అనంతరం సునీతకు, విల్‌మోర్‌కు ఆరువారాల పాటు రీహ్యాబిలిటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తారని, నడక, కండరాల బలోపేతానికి సంబంధించి శిక్షణ ఇస్తారని, పౌష్టికాహారం ఇస్తారని వైద్యనిపుణులు తెలిపారు.



62 గంటల స్పేస్ వాక్

ఈ 9నెలల కాలంలో చేసిన స్పేస్‌వాక్‌లతో కలిపి.. సునీత ఇప్పటిదాకా 62 గంటల స్పేస్‌వాక్‌లు నిర్వహించారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..

అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉంటే అక్కడి భారరహిత వాతావరణం వల్ల వ్యోమగాముల ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. వారి కండరాలు క్షీణిస్తాయి. రక్తనాళాలు సంకోచానికి గురవుతాయి. గుండె, మెదడు, రక్తప్రసరణ వ్యవస్థ ప్రభావితమవుతాయి. మెదడులో స్రావాలు పెరిగి.. వినికిడి శక్తి, చూపు మందగిస్తాయి. వ్యోమగాముల మెదడుపై ఒత్తిడి పెరిగి.. 'స్పేస్‌ఫ్లైట్ అసోసియేటెడ్ న్యూరో-ఆక్యులార్ సిండ్రోమ్ (శాన్స్)' బారిన పడే ప్రమాదం ఉంటుంది. సగటున నెలకు 1-2% చొప్పున వారి ఎముకల సాంద్రత తగ్గి చాలా బలహీనపడిపోతారు. రక్తప్రసరణ వ్యవస్థ సరిగా పనిచేయక.. వారి రక్తపోటు పెరుగుతుంది. స్పేస్ రేడియేషన్‌కు ఎక్కువగా గురవడం వల్ల దీర్ఘకాలంలో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. వారు క్యాన్సర్ బారిన, కేంద్ర నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యల బారిన పడే ముప్పు పెరుగుతుంది.





అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సునీతవిలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను తీసుకొస్తున్న స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్

కొత్తగా మరో నలుగురు..

డ్రాగన్ క్యాప్సూల్‌లో భూమ్మీదికి తిరిగొచ్చిన నలుగురు వ్యోమగాముల స్థానంలో మరో నలుగురు ఆస్ట్రోనాట్లు.. అన్నే మెక్ క్లెయిన్, నికోల్ అయెర్స్(అమెరికా), టకుయ ఒనిషి (జపాన్), కిరిల్ పెస్కోవ్ (రష్యా) ఐఎస్ఎస్‌లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణంగా కొత్తగా వచ్చిన సిబ్బంది.. అప్పటికే ఉన్న సిబ్బందితో కలిసి ఐదురోజులు ఐఎస్ఎస్‌లో ఉంటారు. దీన్ని 'హ్యాండోవర్ పీరియడ్' అంటారు. ఈసారి ఆ హ్యాండోవర్ పీరియడ్‌ను 2 రోజులకు కుదించారు. ఇక.. భారత కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం ఐదు గంటలకు నాసా అధికారులు పత్రికా సమావేశం నిర్వహించి సునీత, విల్‌మోర్ ఆరోగ్యపరిస్థితిపై వివరాలు వెల్లడించనున్నారు. కాగా, భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమిపై అడుగుపెట్టనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ఆమెకు హృదయపూర్వక లేఖ రాశారు. "మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం" అంటూ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

4500 భూప్రదక్షిణలు!

ఐఎస్ఎస్‌లో 286 రోజులపాటు ఉన్న సునీత, విల్‌మోర్.. ఆ సమయంలో 4,500 భూప్రదక్షిణలు చేశారు.

కుక్కలతో వాకింగ్‌కు వెళ్తా

మామూలుగా మనం ఏదైనా పని మీద వేరే ఊరెళ్తే.. ఇంటికి ఎప్పుడెప్పుడు వెళ్దామా, మనకు ఇష్టమైన పనులు ఏమేం చేద్దామా అనే ఆలోచన వస్తుంది. సునీత, విల్‌మోర్‌కు కూడా అలాంటి ఆలోచనలు ఉన్నాయి. భూమ్మీదికి వచ్చాక.. తన రెండు పెంపుడు శునకాలతో వాహ్యాళికి వెళ్లాలని ఉందని, సముద్రంలో ఈత కొడతానని సునీత విలియమ్స్ చెప్పగా.. తనకు గడ్డిపై నడవాలని, తన కుటుంబంతో కలిసి సమయాన్ని గడపాలని ఉన్నట్టు బుచ్ విల్‌మోర్ వెల్లడించారు.

'అమ్మ దొంగ' అరెస్టయ్యాడు

- అమ్మ చీర కోసం మొదలుపెట్టి తెలుగు రాష్ట్రాల్లో వరుస చోరీలు
- చోరీ సొత్తు శ్మశానంలో దాచి అక్కడే ఉండే కేటుగాడు
- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు.. రూ.45 లక్షల సొత్తు రికవరీ

సత్తుపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అమ్మకు ఓ చీర కొనిపెడదామని చోరీలు మొదలుపెట్టి అంతర్రాష్ట్ర దొంగగా ఎదిగిన ఓ కేటుగాడిని ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. దోచుకున్న సొమ్మును శ్మశానంలో దాచుకుని అక్కడే తలదాచుకునే ఆ దొంగ దగ్గర నుంచి రూ.45 లక్షల విలువైన సొత్తును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సత్తుపల్లిలో మంగళవారం విలేకరులకు వివరించారు. ఏపీలోని ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తాపూర్‌కు చెందిన తిరువీధుల సురేందర్ తన తల్లికి చీర కొనివ్వాలనే కోరికతో మొట్టమొదటిసారి రూ.300 చోరీ చేశాడు. ఆ డబ్బుతో చీర కొనుగోలు చేసిన సురేందర్ దొంగతనాలను వృత్తిగా మార్చుకుని అంతర్రాష్ట్ర దొంగయ్యాడు. తెలంగాణ, ఏపీల్లో 90 చోరీ కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. గత నవంబరులో రాజమండ్రి జైలు నుంచి విడుదలైన సురేందర్.. తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ వరుస చోరీలకు పాల్పడ్డాడు. తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలతో పాటు ఏపీలోని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మూడు నెలల వ్యవధిలోనే 43 చోరీలు చేశాడు. గూగుల్ మ్యాప్స్ యాప్ సాయంతో చోరీ చేయాలనుకునే ఇళ్లను గుర్తించే సురేందర్.. దోచుకున్న సొత్తును స్మశాన వాటికల్లో దాచిపెట్టి అక్కడే తలదాచుకుంటాడు. ఈ క్రమంలో మార్చి 10న ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సురేందర్‌ను గుర్తించిన నరేష్ అనే కానిస్టేబుల్ అతనిని అనుసరించాడు. ఇది గమనించిన సురేందర్.. నరేష్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. దీంతో సురేందర్ ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్న పోలీసులు - సత్తుపల్లి మండలం కొత్తూరు సమీపంలోని స్మశాన వాటిక వద్ద అతడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సురేందర్ దగ్గర 461.18గ్రాముల బంగారు, 426గ్రాముల వెండి ఆభరణాలు, రూ.3.33లక్షల నగదు, ఒక మొబైల్‌ఫోన్, రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం సొత్తు విలువ రూ.45లక్షలు ఉంటుందని తెలిపారు. కొన్ని ఆయుధాలను కూడా సీజ్ చేశారు. కాగా, సురేందర్ చేసిన దాడిలో గాయపడిన కానిస్టేబుల్ నరేష్‌ను ఆస్పత్రికి తరలించిన ఇల్లంగి రాజు, చెరుకుపల్లి ప్రసాద్‌కు సీపీ సునీల్‌దత్ నగదు రివార్డు అందజేశారు. సురేందర్‌ను అరెస్ట్ చేసిన సత్తుపల్లి ఎస్సై టి.కవిత ఇతర సిబ్బందిని కూడా అభినందించి నగదు అవార్డులు అందజేశారు.

శ్రీ మా ఆశ్రమంలో రూ.1.2 కోట్ల సొత్తు చోరీ

- మొయినాబాద్‌లో ఘటన.. నిందితుల అరెస్ట్..?

మొయినాబాద్, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీ మా ఆశ్రమంలో భారీ దోపిడీ జరిగింది. ఆశ్రమంలోకి చొరబడిన దొంగలు రూ.1.27 కోట్ల విలువైన వజ్రాలు, వాచీలు, నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై మూడు రోజుల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్ రెవెన్యూలో శ్రీ మా ఆశ్రమం ఉంది. శివగిరి ముక్తానంద స్వామి దీన్ని నిర్వహిస్తున్నారు. మార్చి 1న ఆయన రిషికేశ్, హిమాలయాలకు వెళ్లారు. ఆశ్రమంలో పని చేసే వ్యక్తులు ఈ నెల 15న స్వామీజీ గదికి వెళ్లి చూడగా.. లాకర్లు ధ్వంసమై కనిపించాయి. ఈ విషయాన్ని స్వామీజీకి తెలిపారు. రూ.53 లక్షల నగదు, రూ.5 లక్షల విలువైన వజ్రాలు, రూ.60 లక్షల విలువైన తొమ్మిది వాచీలు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా సొమ్ము కాజేసిన వారిని గుర్తించినట్లు సమాచారం. ఆశ్రమంలో పని చేసే వ్యక్తులే దొంగతనానికి పాల్పడినట్లు తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.

పురుగుల మందు తాగి మిర్చి రైతు ఆత్మహత్య

వెంకటాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన మిర్చి రైతు మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బెస్తగూడెం గ్రామంలోని రామెళ్ల సతీష్(39) మూడెకరాల్లో మిర్చిపంటను సాగు చేశాడు. పంట చేతికొచ్చిన సమయంలో కూలీలు దొరకకపోవడంతో పంట నేలరాలి నష్టం వస్తుందని మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో గత 15 రోజులుగా మద్యం తాగి తిరుగుతున్నాడు. సోమవారం ఉదయం మిర్చితోట వద్దకు వెళ్లిన సతీష్ మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యానికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే సతీష్ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ షార్ట్‌ఫాల్ పత్రాలు..

అప్‌లోడ్ కావట్లే



(మొదటి పేజీ తరువాయి)

గడువు మిగిలి ఉంది. ఇంతటి కీలకసమయంలో సమస్యలు తలెత్తుతుండడం.. ఏం చేయాలో తోచక దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీలో 1.06 లక్షలు, శివారు కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఆరు లక్షలకు పైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులున్నాయి. వారిలో 60% దరఖాస్తుదారులకు ఫీజు చెల్లింపు సమాచారం వెళ్లిందని అధికారులు చెబుతున్నారు. దాదాపు 20 శాతం మంది.. అధికారులు అడిగిన పత్రాలను (షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్లను) సమర్పించాల్సి ఉంది. కానీ రుసుము చెల్లింపు, పత్రా ల అప్‌లోడ్‌కు సంబంధించిన ఎస్సెమ్మెస్‌లు దరఖాస్తుదారుల ఫోన్లకు రావట్లేదు. ఆన్‌లైన్‌లో చూసుకుంటే తప్ప దరఖాస్తు స్థితి తెలియట్లేదు. అలా చూసుకునే అవగాహన లేక చాలా మంది తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. కొన్ని మునిసిపాలిటీల సిబ్బంది మాత్రం.. దరఖాస్తుదారులకు ఫోన్‌చేసి, రుసుము చెల్లించాలని సూచిస్తున్నారు. కాగా.. దరఖాస్తుదారుల్లో ఇప్పటివరకూ రరుసుము చెల్లించినవారు 8 నుంచి 10 శాతం లోపే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నిర్ధారణలో వ్యత్యా సం ఉండడం.. రుసుము చెల్లింపుపై దరఖాస్తుదారుల వెనకడుగుకు ఒక ప్రధాన కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదాహరణకు.. కిస్మత్‌పురాలో 250 చదరపు గజాల ప్లాట్‌కు రూ.19 వేలు, అదే ప్రాం తంలోని 116 గజాలకు రాయితీ పోను రూ.38 వేలు రుసుము నిర్ధారిస్తూ 'ఫీ ఇంటిమేషన్ లెటర్' వచ్చింది. తక్కువ రుసుము వచ్చిన వ్యక్తి.. "ఇంత తక్కువ ఫీజు ఎందుకు వచ్చింది? ఇప్పుడు చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తారా? లేక మరోసారి రుసుము చెల్లించాల్సి ఉంటుం దా?" అని సందేహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి చాలా ప్రాంతాల్లో కనిపిస్తోంది. మరోవైపు.. రుసుము చెల్లించినవారి వివరాలు ఇప్పటికీ సంబంధిత కార్పొరేషన్, మునిసిపాలిటీ లాగిన్‌లోకి రాకపోవడం గమనార్హం. ఈ సమస్యలను పురపాలక శాఖ అధికారులు పట్టించుకోవట్లేదు. రాయితీతో రుసు ము చెల్లింపునకు గడువు ముగియనున్న నేపథ్యంలో.. ఇప్పటికైనా వారు స్పందించి, సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

2015 దరఖాస్తులు పెండింగ్‌లోనే..

హెచ్ఎండీఏ పరిధిలో 2015 నాటి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సైతం ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఆ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను 2018 నుంచి నిలిపివేయడంతో అప్పట్నుంచీ అధికారులు హెచ్ఎండీఏ ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ లాగిన్‌ను మూసివేశారు. దరఖాస్తు కోసం రూ.10 వేల చొప్పున చెల్లించిన రుసుమును కూడా దరఖాస్తుదారులకు తిరిగి ఇవ్వలేదు. అయినా వారు 2020 ఎల్ఆర్ఎస్ సమయంలో మరోసారి రూ.1000 చెల్లించి దరఖాస్తు చేశారు. తమ దస్త్రాలను సత్వరం పరిష్కరించాలని ఇప్పుడు వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇటీవల ఆయా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలనే సమాచారం కూడా వస్తోంది. ఫీజు చెల్లించేందుకు తాము సిద్ధమేనని.. అయితే, నాడు తాము చెల్లించిన రూ.10 వేల రుసుమును ఇప్పుడు సర్దుబాటు చేయాలని వారు అభ్యర్థిస్తున్నారు. లేదా ఆనాటి దరఖాస్తుల పరిష్కారానికైనా మోక్షం కలిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



వీర విజయం గోల్డెన్ జూబ్లీ సావనీర్‌ను విడుదల చేస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

వీరభద్రులకు సరైన గుర్తింపు దక్కలేదు

- కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సంచార కులమైన వీరభద్రులకు ఒక చోట స్థిరత్వం లేకపోవడంతో సరైన గుర్తింపు దక్కలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీసీ'ఏ'లో అత్యంత వెనుకబడిన కులంగా ఉన్న వీరభద్రీయులు సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరముందని అన్నారు. వీరభద్ర(వీరముష్టి) సంఘం స్వర్ణోత్సవాల సందర్భంగా ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజికంగా వెనుకబాటుకు గురైన వీరభద్రీయుల ఉన్నతి కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలను పనికి పంపకుండా... చదువుకునే విధంగా ప్రోత్సహిస్తే భవిష్యత్తు బంగారం అవుతుందని.. ఇందుకోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వీరభద్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీలు కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నేత అలె భాస్కర్ పాల్గొన్నారు. అంతకు ముందు వీర విజయం సావనీర్‌ను కిషన్ రెడ్డి లక్ష్మణ్ విడుదల చేశారు.

రాజలింగమూర్తి హత్య కేసులో సూత్రధారి

బీఆర్ఎస్ నేత హరిబాబు అరెస్టు

- అతనికి సహకరించిన మాజీ మావోయిస్టు రమణయ్య దంపతులకు కూడా రిమాండు

కృష్ణ కాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో ఎనిమిదో నిందితుడు, హత్య సూత్రధారి అయిన బీఆర్ఎస్ నేత, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కొత్త హరిబాబును పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి గత నెల 19న హత్యకు గురికాగా పది మందిపై కేసు నమోదైంది. గత నెల 23న ఏడుగురిని అరెస్టు చేయగా ఎనిమిదో నిందితుడు హరిబాబు, పదో నిందితుడు పుల్లా సురేష్ కోసం పోలీసులు గాలిస్తుండగా ఎట్టకేలకు హరిబాబు చిక్కాడు. అతనికి ఆశ్రయం ఇచ్చిన ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన మాజీమావోయిస్టు వట్టి రమణయ్య, ఆయన భార్యను కూడా అరెస్టు చేశారు. హరిబాబు గతంలో మావోయిస్టు పార్టీలో పనిచేసినప్పుడు రమణయ్యతో సాన్నిహిత్యం ఏర్పడింది. రమణయ్య దంపతులు పరారీలో ఉన్న హరిబాబుతో పాటు తిరుగుతూ ఆర్థిక అవసరాలు చూసుకున్నారు. మధ్యప్రదేశ్‌లో క్రెడిట్ కార్డు వాడారు. అప్పటికే హరిబాబు సంబంధీకులు, ఇతరుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు అక్కడకు వెళ్లి ముగ్గుర్నీ అరెస్టు చేశారు.

హైకోర్టును తప్పుదోవ పట్టించాలని చూసిన...

వ్యక్తికి రూ.కోటి జరిమానా

విలువైన ప్రభుత్వ భూమి కొట్టేయాలని కుట్ర..తప్పుడు పత్రాలు, వాస్తవాలు దాచిపెట్టి పిటిషన్లు

- ఏప్రిల్ 10లోగా జరిమానా సొమ్ము చెల్లించాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సివిల్ వివాదంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని కొట్టేసే దురుద్దేశంతో హైకోర్టును తప్పుదోవ పట్టించాలనుకున్న వ్యక్తికి గట్టి షాక్ తగిలింది. తప్పుడు పత్రాలతో తనకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు పొందాలనుకున్న ఆ వ్యక్తికి హైకోర్టు రూ.కోటి జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని ఏప్రిల్ 10లోగా హైకోర్టు లీగల్‌సెల్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది. జరిమానా చెల్లించకపోతే ఈ కేసును మళ్లీ ఏప్రిల్ 11న విచారణ చేపట్టే కేసుల జాబితాలో ఉంచాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఏకసభ్య ధర్మాసనం రిజిస్ట్రీకి నిర్దేశించింది. భారతీయ సమాజానికి సత్యమే ప్రధానమైన పునాది అని, నిజాయితీ, సత్యం, నైతిక విలువలపైనే భారతీయ తత్వం ఆధారపడి ఉందని భగవద్గీత, ఉపనిషత్తులతో పాటు మహాత్మాగాంధీ వంటి నాయకులు ఉద్ఘాటించిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హైదరాబాద్ జిల్లా బండ్లగూడ మండలం కందికల్‌లోని సర్వే నం.310/1, 310/2లో 9.11 ఎకరాల భూమి తనకు వారసత్వంగా సంక్రమించిందని, దాని విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ నాంపల్లి సంగీత్‌నగర్‌కు చెందిన వెంకటరామిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1980లో తన తండ్రి పట్టాభి రామిరెడ్డి రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా భూమి కొన్నట్లు తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూమిగా రికార్డు చేసినా పొరపాటున 'ఆబాదీ' భూమిగా రికార్డయి అలాగే కొనసాగినట్లు పేర్కొన్నారు. అయితే అది ప్రభుత్వ భూమి అని, పిటిషనర్ ఆక్రమణదారు అని పేర్కొంటూ ఆర్డీవో జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆ భూమిలో రిజిస్ట్రేషన్లు కాకుండా నిషేధిత జాబితాలో పెట్టారు. ఇది అక్రమమన్నది పిటిషనర్ వాదన. మరోవైపు, ఆర్ శ్రీశైలం, ఇతరులు 1989 నుంచి సదరు భూమిపై హక్కులు క్లెయిమ్ చేస్తూ సివిల్ వివాదం కొనసాగిస్తున్నారని, సెకండ్ అప్పీల్ రూపంలో సదరు వివాదంలో హైకోర్టులో పెండింగ్‌లో ఉందని తహసీల్దార్ పేర్కొన్నారు. వివాదాలు పెండింగ్‌లో ఉండగా పిటిషనర్ 2022 డిసెంబరు 1 నుంచి పిటిషనర్ సదరు భూమిలో జోక్యం చేసుకుంటుండటంతో తహసీల్దార్ ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదైంది. పిటిషనర్, పిటిషనర్ తండ్రి పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం, రికార్డుల సవరణ, తమ ఆస్తిలో అధికారులు జోక్యం చేసుకోవద్దని వివిధ కారణాలతో హైకోర్టులో 4 పిటిషన్లు వేసి ఉపసంహరించుకున్నారు. వాటి వివరాలు వెల్లడించకుండా 2024లో మరో రెండు పిటిషన్లు దాఖలు చేసి యథాతథ స్థితి కొనసాగించాలనే ఉత్తర్వులు పొందారు. పోలీసు కేసులైన తర్వాత పిటిషనర్ సదరు భూమి తమదేనని సివిల్ కోర్టులో దావా వేశారు. అందులో ఎక్స్‌పార్టీ ఆదేశాలు రావడంతో అంతకుముందు నుంచి వివాదం కొనసాగిస్తున్న పార్టీలను ఖాళీ చేయించేందుకు యత్నాలు మొదలుపెట్టారు. తమకు అనుకూలంగా ఆదేశాలు తెచ్చుకునేందుకు వివిధ ధర్మాసనాల వద్ద కేసులు వేస్తూ ఫోరం షాపింగ్ చేస్తున్నారని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'విక్రయించారని పిటిషనర్ పేర్కొంటున్న వ్యక్తులు మొదటి నుంచి వివాదం కొనసాగిస్తున్నారు. వారి వివాదం సెకండ్ అప్పీల్ రూపంలో హైకోర్టు పెండింగ్‌లో ఉండటంతో పాటు వారికి అనుకూలంగా ఇన్‌జంక్షన్ ఆర్డర్ ఉంది. వాస్తవాలు దాచి కోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్లు వేస్తూ విలువైన కోర్టు సమయాన్ని వృథా చేయడంతో పాటు కేసుల పెండింగ్ భారం పెరిగిపోవడానికి పిటిషనర్ లాంటి వ్యక్తులు కారణమవుతున్నారు. పిటిషనర్ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సదరు విలువైన భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారు. ఒకే అంశంపై వివిధ కోర్టులను ఆశ్రయిస్తూ న్యాయ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీసేలా న్యాయపరమైన ప్రత్యామ్నాయల పేరుతో వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. రూ.కోటి భారీ జరిమానా విధిస్తూ పిటిషన్‌ను కొట్టేస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

2 వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి!

- ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించడంపై కేంద్రం, ఏపీలకు సుప్రీం ఆదేశం
- ఆ తర్వాత రిజాయిండర్ దాఖలు చేయాలని తెలంగాణకు సూచన



న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై ప్రాజెక్టులను 'కృష్ణా నదీ యాజమాన్య బోర్డు'కు అప్పగించడంపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలంటూ సుప్రీంకోర్టు కేంద్రం, ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కృష్ణా నది పరివాహక ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తూ 2021లో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అలాగే, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 34ను రద్దు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ ప్రభుత్వం జీవో 34 పేరుతో పరిమితులు లేకుండా విద్యుదుత్పత్తి చేస్తోందని, పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టులను బోర్డులే నియంత్రించాలని ఆ పిటిషన్‌లో కోరింది. తెలంగాణ, ఏపీ పిటిషన్లను కలిపి మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారించింది. అయితే, గత విచారణ సందర్భంగా జీవో 34, విద్యుదుత్పత్తి తదితర అంశాలతో కూడిన సమగ్ర నివేదిక సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో తెలంగాణ సర్కారు ఆ వివరాలను సమర్పించింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వ అఫిడవిట్‌పై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఆ తర్వాత వారం రోజుల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని తెలంగాణకు సూచించింది. ఈ కేసు మరోసారి ఏప్రిల్ 15న ధర్మాసనం ముందుకు వచ్చే అవకాశం ఉంది.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఏసీబీకి చిక్కినవారిపై సమగ్ర విచారణ జరిపించాలి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఏసీబీకి చిక్కినవారిపై సమగ్ర విచారణ జరిపించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి ఈమేరకు మంగళవారం సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రంలో అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతుందని, ప్రతి చిన్న పనికి లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని ఎఫ్‌జీజీ తెలిపింది. డీసీటీవో జి.శ్రీనివాస్‌పై 2013లో ఏసీబీ క్రిమినల్ కేసును నమోదు చేసిందని, 11 ఏళ్ల నుంచి ఈ కేసు ఏసీబీ న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని తెలిపింది. ఆ కేసును పట్టించుకోకుండానే ఆయనకు అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి ఇచ్చారని వివరించింది. మరో డీసీటీవో డి.శ్రీనివాస్‌రెడ్డిపై 2018లో ఏసీబీ కేసు నమోదు చేసిందని, ఏడేళ్లుగా దాని విచారణ పూర్తి కాలేదని తెలిపింది. ఈయన కూడా పదోన్నతి కోసం హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకున్నారని వివరించింది. కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ కె.గీత అక్రమాలపై విజిలెన్స్ విభాగంవారు విచారించి 2017లో కేసు నమోదు చేశారని తెలిపింది. ఈమె కూడా తనకు జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించగా.. పరిశీలించాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపింది. ఇలా ఒక్క వాణిజ్య పన్నుల శాఖలోనే కాకుండా... ఇతర శాఖల్లోనూ అవినీతి చోటు చేసుకుంటుందని, పైగా... అవినీతి అధికారులకు పదోన్నతులు కల్పిస్తున్నారని వివరించింది. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకోవాలని, పైన పేర్కొన్న మూడు కేసుల్లో సమగ్ర విచారణ జరిపించాలని ఎఫ్‌జీజీ డిమాండ్ చేసింది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

రక్తమోడిన గాజా

కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపు గురించి చర్చించుకోబోతున్న తరుణంలో, ఇజ్రాయెల్ మంగళవారం తెల్లవారుజామున గాజామీద విరుచుకుపడి నాలుగువందలమందిని ఊచకోతకోసింది. కనీసం ఆరేడు వందలమంది తీవ్రంగా గాయపడినందున మృతుల సంఖ్య మరింత హెచ్చడం ఖాయం. ఖాన్‌యూనిస్, రఫా, ఉత్తరగాజా, గాజాసిటీ ఇత్యాది గాజాపట్టీలోని పలుప్రాంతాలమీద ఇజ్రాయెల్ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. ఇంతటి దుర్మార్గాన్ని కలలో కూడా ఊహించని కారణంగా పెద్దసంఖ్యలో స్త్రీలు, పిల్లలతో సహా వందలాదిమంది ఇజ్రాయెల్ చేతికి ఇలా సునాయాసంగా చిక్కి బలైపోయారు. పదిహేడు నెలల యుద్ధంలో ఒకేరోజున అత్యధికసంఖ్యలో జనహననం జరిగిన సందర్భం బహుశా ఇదే కావచ్చు.

యుద్ధం జరుగుతున్నప్పుడు వేరు. పరిగెత్తి ప్రాణాలు కాపాడుకోగల అవకాశమైనా జనానికి మిగిలివుంటుంది. కానీ, యుద్ధం ఆగి, కాల్పుల విరమణ అమలు జరుగుతున్నప్పుడు ఇజ్రాయెల్ ఈ పాపానికి ఒడిగట్టింది. ఇంతకుముందు సురక్షితప్రాంతాలకు తరలిపోయిన పాలస్తీనియన్లు సైతం ఎంతో నమ్మకంగా తిరిగివచ్చినందున, పెద్దసంఖ్యలో ఈ మారణకాండకు బలైపోయారు. కాల్పుల విరమణ కాలంలో గాజాకు తిరిగివచ్చిన పాలస్తీనియన్ల సంఖ్య ఓ ఐదులక్షలవరకూ ఉంటుంది. తమ ఇళ్ళు నేలమట్టమైన చోటే టెంట్లు వేసుకొని వారంతా ఉంటున్నారు. రాత్రివేళ దాడికావడంతో నిద్రలో ఉన్నవారు సులువుగా దొరికిపోయారు, శిథిలాల్లోనే నిక్షిప్తమైపోయారు. ఒకేమారు గాజా నలుదిక్కుల్లోనూ ఈ దాడి జరిగింది. ఎఫ్–16, ఎఫ్–35వంటి యుద్ధవిమానాలతో పాటు, హెలికాప్టర్లు, డ్రోన్లు కూడా ఆకాశంనుంచి నిప్పులు కురిపిస్తుంటే, నేలమీద ట్యాంకులు విరుచుకుపడ్డాయి. పరుగులు తీస్తున్నవారిని కూడా ఇజ్రాయెల్ సైనికులు కాల్చిపారేశారు. ఇప్పటికే, ఆస్పత్రులన్నీ ధ్వంసమై, మిగిలిన ఆ ఒకటీరెండూ ఆస్పత్రుల్లో కూడా మందులూ, వైద్యులు లేని స్థితిలో ఇప్పుడు జరిగిన భయానకమైన దాడి మరింత తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టించింది. గాయపడిన ప్రతీవ్యక్తీ చికిత్స అందక కచ్చితంగా కన్నుమూయాల్సిన పరిస్థితులున్నాయి. బందీలుగా ఉన్నవారందరినీ వదిలేయమని అమెరికా అధ్యక్షుడు హమాస్‌ను ఆదేశిస్తే, సదరు సంస్థ ఆ మాట విననందుకు శిక్షగా ఈ ఊచకోత జరిగిందట. ట్రంప్‌కు చెప్పే చేశామనో, ఇలా చేయమని ఆయనే చెప్పారనో ఇజ్రాయెల్ అధినేతలు అంటున్నారు. అవును ఈ మారణకాండకు మేమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాం అని అమెరికా గర్వంగా చెప్పుకుంటోంది.

కాల్పుల విరమణ కాలంలోనూ ఇజ్రాయెల్ చిన్నాచితకాదాడులు కొనసాగిస్తూనే ఉంది, మందులూ ఆహారసరఫరాలను అడ్డుతూనే ఉంది. అయినా, హమాస్ మెత్తబడిన కారణంగా బందీల పరస్పర అప్పగింతలు సజావుగానే సాగుతున్నాయి. ఒప్పందాన్ని ఏ క్షణాన్నయినా కాలదన్ని, మళ్ళీ యుద్ధానికి కాలుదువ్వే హక్కు తనకు ఉన్నదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆదినుంచీ వాదిస్తున్నారు. ఆరువారాల క్రితం బలహీనంగా ఉన్న నెతన్యాహూ ఇప్పుడు మళ్ళీ అమెరికా ఆయుధాలను పోగేసుకొని బలపడ్డాడని, అస్త్రాలకు పదునుపెట్టడం, సైనికులకు విశ్రాంతినివ్వడం, యుద్ధవిమానాలకు రిపేర్లు చేసుకోవడం వంటివి పూర్తికావడంతోనే విరుచుపడ్డారని అంటారు. కాల్పులు నిలిచినకాలంలో ఎంతోమంది హమాస్ కీలకనాయకులను ఇజ్రాయెల్ గుర్తించడంతో, ఇప్పుడు పెద్దసంఖ్యలో వారిని మట్టుబెట్టగలిగింది. ఒప్పందం రెండోదశలోకి ప్రవేశిస్తే, గాజానుంచి ఇజ్రాయెల్ తన సైన్యాన్ని ఉపసంహరించుకోవాల్సి వస్తుంది. అంటే, గాజాను ఏలుకోమని మళ్ళీ హమాస్‌కు ఇచ్చేయడమే. అటువంటి సూచనలు ఏ మాత్రం కనిపించినా, నెతన్యాహూ మిత్రపక్షాలు ఆయనకు మద్దతు ఉపసంహరించుకుంటాయి. ఇప్పటికే ఆయనకు దూరం జరిగినవారు ఉన్నందున రాబోయే రోజుల్లో ఆయన అవిశ్వాసపరీక్ష ఎదుర్కోవాల్సి రావచ్చు కూడా. కోర్టులో అవినీతికేసులు కొలిక్కివచ్చాయనీ, తప్పించుకోవడానికే మళ్ళీ ఈ యుద్ధం రాజేశాడని కొందరు అంటారు. మొత్తానికి మంగళవారం ఊచకోతతో పరిస్థితి మొదటికివచ్చింది. హమాస్–ఇజ్రాయెల్ మధ్య రెండునెలల కాల్పుల విరమణ ఒప్పందం స్థానంలో మరింత ఉద్రిక్తవాతావరణం ఏర్పడింది. హమాస్ దగ్గర ఇంకా 59మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారని లెక్క. కానీ, వారిలో అత్యధికం ఇప్పటికే మరణించారన్న సమాచారం ఉండటంతో ఇజ్రాయెల్ ఈ దూకుడు నిర్ణయం తీసుకుందని అంటారు. కానీ, తమవారిని రక్షించుకొనే పేరిట గాజాలో అది ముున్ముందు సాగించబోయే విధ్వంసం ఊహకు అందనిది. హమాస్‌ను నిర్మూలించడమనే ముసుగులో తిరిగి తమ ఇళ్ళకు చేరుకుంటున్న పాలస్తీనియన్లను తరిమికొట్టే స్వామికార్యాన్ని కూడా నెతన్యాహూ నెరవేర్చబోతున్నారు.

సామాజిక వికాస కార్యక్రమాలను జకాత్ ద్వారా చేయడం పెద్ద సమస్య ఏమి కాకున్నా ఎందుకో ముస్లిం సమాజం మిన్నకుండిపోతోంది. ముస్లిం సామాజికులకు ఈ దిశగా నేతృత్వం వహించే ఆమోదయోగ్యమైన నాయకుడు ఒక్కడు కూడ లేడంటే ఆశ్చర్యం కలుగుతుంది. అటు కర్ణాటక సరిహద్దులోని హిందూపురం మొదలు ఇటు మహారాష్ట్ర సరిహద్దులోని బోధన్ వరకు తెలుగునాట ముస్లిం సమాజం దీనిపై ఆత్మ విమర్శ చేసుకోవాలి.


భయ్యా, దానశీలత మరిచావా?

సకల మతాల ధార్మిక సూత్రాలలో దానం, కరుణ ప్రధానంగా ఉంటాయి. కనుకనే, సర్వమతాల సారాంశం మానవ సేవే మాధవ సేవ. మనిషి దైవ సన్నిధికి వెళ్లే మార్గంలో దానం అనేది అత్యంత కీలక వారధి. భక్తి ప్రవచనాలు ఎన్ని పలికినా, దైవ చింతనలో ఎంత గడిపినా మనిషి దానం విషయానికి వచ్చే సరికి సహజంగా వెనుకంజ వేస్తున్నాడు!

ఇస్లాం జీవన విధానానికి మూలం ఖురాన్. ఈ పవిత్ర గ్రంథం రంజాన్ మాసంలో అవతరించిందని ముస్లింల విశ్వాసం. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజాలు రంజాన్ మాసాన్ని భక్తి శ్రద్ధలతో పాటిస్తాయి. ఇక, ఇస్లాం అధికారిక మతంగా ఉన్న గల్ఫ్ దేశాలు అన్నిటిలోనూ ఈ పవిత్ర మాసంలో విశ్వాసుల ఆర్భాటం ఇతర ముస్లిం దేశాలలో కంటే ఎక్కువగా ఉంటుంది.

గల్ఫ్ లేఖ

ఇస్లాంలో ఐదు మౌలిక, ఆదేశిక సూత్రాలలో ఒకటి: సియాం (ఉపవాసం). రంజాన్ నెలలో ముస్లింలు అందరూ ఈ ధార్మిక నియమాన్ని పాటిస్తారు. తమ ఉపవాస దీక్ష, దానాల ద్వారా దైవ సంకల్పం బలోపేతం కావాలనేది రంజాన్ మాసం అందించే సందేశం. ఈ పవిత్ర మాసంలో వీలయినంత ఎక్కువ సమయాన్ని దైవ సన్నిధిలోనూ, ఖురాన్ పఠనంలోనూ గడపాలని ఇస్లామిక్ పండితులు చెబుతుంటారు. ఈ కారణాన సంవత్సరంలోని మిగిలిన నెలల్లో రోజూ నమాజు చేయనివారు కూడ ఈ నెలలో క్రమం తప్పకుండా నమాజు చేయడానికి ప్రయత్నిస్తారు. ఐదు ఆదేశిక సూత్రాలలో సియాంతో పాటు జకాత్ (నిర్బంధ దానం) కూడ ముఖ్యమైనది. ముస్లింలకు నమాజు, ఉపవాసం ఎంత ముఖ్యమో అదే విధంగా విధిగా దానం చేయడం కూడ అంతే ముఖ్యం. జకాత్ అనేది ఒక రకమైన ఖచ్చితమైన అల్లాహ్ పన్ను పేదలకు చెల్లించే విధానం. ఈ నియమవ్రతం నుంచి అర్హులకు మినహాయింపు లేదు. దానం అనేది ఐచ్ఛికం కానీ జకాత్ ఖచ్చితం, తప్పని సరి. ప్రతి ముస్లిం తన వద్ద నిల్వ ఉన్న వార్షిక ఆదాయం నుండి రెండున్నర శాతం విధిగా పేదలకు తప్పని సరిగా చెల్లించాలనేదే జకాత్ ధార్మిక నియమం. ఉదాహరణకు లక్ష రూపాయలు ఉన్న వ్యక్తి విధిగా రెండున్నర వేల రూపాయలు పేదలకు దానం ఇవ్వాలనేది తప్పనిసరి ఇస్లామిక్ నిబంధన. నమాజు, ఉపవాసం పట్ల ముందుకు వచ్చే



భారతీయ ముస్లిం సమాజం జకాత్ ఇవ్వాల్సివచ్చే సరికి వెనుకంజ వేస్తోంది. నమాజుతో పాటు జకాత్ చెల్లింపు బాధ్యతను అల్లాహ్ ఖురాన్ వివరించింది. హదీస్, ఖురాన్ ప్రవచనాలను అత్యంత భక్తి శ్రద్ధలతో వినేవారు, ముస్లిం సమాజం వెనుకబాటుతనం గురించి భావోద్వేగ ప్రసంగాలకు లోనయ్యేవారు కూడ జకాత్ చెల్లింపు వచ్చేసరికి ఆసక్తి చూపరు. మత బోధకులు (ఖతీబ్) జకాత్ దానం ఇవ్వాల్సిన అవశ్యకతను నొక్కి చెబుతున్నారు. కానీ ఆశించిన స్థాయిలో సరైన నిష్పత్తి ప్రకారం జకాత్ ఇవ్వడం లేదనే ఒక అభిప్రాయం చాలామందిలో నెలకొని ఉంది. జకాత్ డబ్బును ప్రణాళికా బద్ధంగా వెచ్చిస్తే ముస్లిం సమాజంలో పేదరికం అంటూ ఏమి ఉండదనేది అనేక మంది అభిప్రాయం. జకాత్‌తో పాటు సదఖా, వక్ఫ్ అనే మరో రెండు రకాల దానాలు కూడ ఇస్లాంలో ఉంటాయి కానీ జకాత్ తప్పనిసరి.

జకాత్ దానం ద్వారా తమ సామాజిక వర్గ అభ్యున్నతికి సవాలక్ష అవకాశాలు ఉన్నా తెలుగునాటతో సహా సమస్త భారతదేశంలోనూ అటువంటి కృషి జరుగుతున్న ఉదంతం ఒక్కటి కూడా లేకపోవడం విచారకరం. జకాత్ దానం ద్వారా విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టవచ్చు. ముస్లిం సమాజంలోని పేదలకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థ గానీ ఆసుపత్రి గానీ తెలుగునాట ఒక్కటి కూడా లేదు. కనీసం నవాబుల నగరమైన హైదరాబాద్‌లో విద్యావకాశాల కొరకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ముస్లిం బాలబాలికలకు నీడ నివ్వడానికి విద్యార్థుల వసతి గృహం ఒక్కటి కూడా లేదంటే దుస్థితిని ఊహించుకోవచ్చు.

రంజాన్ మాసం సందర్భంగా ముస్లింల ఇళ్ళలో, మసీదులలో జకాత్ ఇవ్వమని వచ్చే అసంఖ్యాకులలో ఏ ఒక్కరు కూడ ఒక పాఠశాల లేదా వైద్యశాల నిర్మాణం కోసం రాకపోవడానికి కారణం ఆ దిశగా సమాజం అడుగువేయకపోవడమే కాదూ?

సామాజిక వికాస కార్యక్రమాలను జకాత్ ద్వారా చేయడం పెద్ద సమస్య ఏమి కాకున్నా ఎందుకో ముస్లిం సమాజం మిన్నకుండిపోతోంది. హైదరాబాద్ నగరంలోని ఒక్క టోలీచౌకీ ప్రాంతానికి చెందిన ప్రవాసులు నిబద్ధతగా జకాత్ ఇస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ముస్లిం సామాజికులకు ఈ దిశగా నేతృత్వం వహించే ఆమోదయోగ్యమైన నాయకుడు ఒక్కడు కూడ లేడంటే ఆశ్చర్యం కలుగుతుంది. అటు కర్ణాటక సరిహద్దులోని హిందూపురం మొదలు ఇటు మహారాష్ట్ర సరిహద్దులోని బోధన్ వరకు తెలుగునాట ముస్లిం సమాజం దీనిపై ఆత్మ విమర్శ చేసుకోవాలి. తమ వెనుకబాటుతనానికి పాలకులే కారణమంటూ నిందించడం వల్ల ప్రయోజనమేముంది? వివక్షకు గురవుతున్న బాధితులుగా చెప్పుకొంటూ వాపోవడం కంటే తమ పరిధిలో తామెంత వరకు తమ వారికి మేలు చేయగలుగుతామనే కనీస కింకర్తవ్యాన్ని ముస్లింలు విస్మరిస్తున్నారు. ప్రార్థనలతో పాటు దానానికి కూడ ముందుకు వస్తేనే ఆధ్యాత్మికతకు పరిపూర్ణత ఉంటుంది.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గోల్వాల్కర్ ఆశయం నెరవేరేనా?



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'గురూజీ గోల్వాల్కర్ భారతదేశం ఏకీకృత వ్యవస్థ కావాలని ఆకాంక్షించారు. సమాఖ్య రాజకీయ వ్యవస్థ వల్ల భారతదేశం విచ్ఛిన్నం కావచ్చని ఆయన నిజంగానే భయపడ్డారు. అంతర్గత విభేదాలు, చిన్నచిన్న తగాదాల మూలంగా ఒకటి, రెండు సందర్భాల్లో తప్ప దేశం వేలాది ఏళ్లపాటు బాహ్య దురాక్రమణలను ఎదుర్కోలేకపోయింది. ఈ కాలంలో దేశ ఐక్యత ప్రమాదంలో పడింది. భాష అనేది ఒక బలమైన భావోద్వేగమైన అంశం. స్వాతంత్ర్యం తర్వాత తమిళ ప్రాంతాల్లో ప్రత్యేక ద్రవిడస్థాన్ కోసం ఉద్యమాలు జరిగాయి. భాషా రాష్ట్రాలు ప్రాంతీయ దురభిమానాలకు దారితీస్తాయని, దాని వల్ల జాతీయ ఐక్యత, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని గోల్వాల్కర్ భావించారు. అయితే హిందీ అనేది ఒక అనుసంధాన భాషయే కాని జాతీయ భాష కాదని, బెంగాలీ, తమిళం, కన్నడ, తెలుగు, మలయాళీ మొదలైనవన్నీ జాతీయ భాషలేనని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశం ఒక దేశం కాదని, వివిధ భాషల ఆధారంగా ఉన్న జాతీయతల సమ్మేళనం అనే హానికరమైన సిద్ధాంతాన్ని కమ్యూనిస్టులు సమర్థించారు. స్టాలిన్ మొదట ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం భారత జాతీయతకు ప్రమాదం కలిగించే అవకాశం ఉన్నది.' అని ఆర్ఎస్ఎస్ మేధావి ఎస్‌వి శేషగిరిరావు 'ఒక సిద్ధాంతంతో నా ప్రయాణం' (మై జర్నీ విత్ ఆన్ ఐడియాలజీ) అన్న పుస్తకంలో రాశారు.


శేషగిరిరావు చెప్పిన విషయాలు భారతీయ జనతా పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రతిఫలింపచేస్తాయి. గత శతాబ్దపు తొలి దశాబ్దంలోనే హిందూ జాతీయవాదానికి బీజాలు పడ్డాయనడంలో సందేహం లేదు. వినాయక్ దామోదర్ సావర్కార్ (1883–1966), కేశవ్ బలిరాం హెగ్డేవార్ (1889–1940), మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ (1906–1973) అనే ముగ్గురు సిద్ధాంతకర్తల ఆలోచనా విధానమే బీజేపీకి పునాది అని వేరే చెప్పనక్కర్లేదు. సావర్కార్ రచించిన ఎసెన్షియల్స్ ఆఫ్ హిందూత్వ, గోల్వాల్కర్ రచించిన వి ఆర్ అవర్ నేషన్ హుడ్, బంచ్ ఆఫ్ థాట్స్ అనే గ్రంథాల్లో చెప్పిన విషయాలే బీజేపీ, దాని అనుబంధ సంఘాలకు చెందిన లక్షలాది కార్యకర్తలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేశాయి.

కులాల ప్రాతిపదికన విడిపోయిన హిందువులు కలిసికట్టుగా ఒకే జాతిగా ముందుకు రావాలని తమ ప్రాచీన జన్మభూమిని బయటివారి కబంధ హస్తాలనుంచి విముక్తం చేయాలని సావర్కర్ తన రచనలో పేర్కొన్నారు. మరోవైపు ఒకేరకమైన సంప్రదాయాలు, ఉమ్మడి భాష, దేశ పూర్వ వైభవం, చరిత్రకు సంబంధించి ఒకేరకమైన స్మృతుల గురించి గోల్వాల్కర్ తన రచనల్లో ఉల్లేఖించారు. ఒకే మూలానికి చెందిన ఒకే సంస్కృతి క్రింద మనుగడ సాధించే జనాభా గురించి ఆయన మాట్లాడారు. ఇటాలియన్ జాతీయవాదనాయకుడు గియుసెప్పె మజిని ఆయనను ప్రభావితం చేశారు. మరాఠీలో మజిని జీవిత చరిత్రను కూడా గోల్వాల్కర్ రచించారు.

గత పది సంవత్సరాలుగా నరేంద్రమోదీ ప్రభుత్వం మాట్లాడుతున్న ఒకే దేశం–ఒకే ఎన్నికలు, ఒకే దేశం–ఒకే గుర్తింపు కార్డు, ఒకే దేశం–ఒకే పన్ను, ఒకే దేశం–ఒకే పౌర స్మృతి లాంటి పదాల వెనుక ఒక ఆలోచనాధార ఉన్నది. అన్ని రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉండాలనే ఉద్దేశంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేయాలని చెప్పినా, మోదీయే అంతటా సర్వాంతర్యామిగా కనపడ్డా, కులగణనను వ్యతిరేకించినా, ఆంధ్రప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూటమిలో కలుపుకున్నా ఈ ఆలోచనా విధానంలో భాగమే. రాష్ట్రాల అధికారాల్లో జోక్యం చేసుకుంటూ చట్టాలు చేయడం వెనుక ఉద్దేశం కూడా అదే. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించినా, ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహించినా, కాశీ–తమిళ సంగమం అంటూ కార్యక్రమాలను ఏర్పాటు చేసినా ఒకే ఒక సంస్కృతీ ప్రవాహంలో భారతీయులను ఏకం చేయాలనే ఆలోచన తప్ప మరేమీ లేదు. మంగళవారం నాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోక్‌సభలో ప్రకటన చేస్తూ మహాకుంభ్ కేవలం మతపరమైన సమ్మేళనమే కాదని, సమైక్యత, అభివృద్ధి, ఆధ్యాత్మిక జాగృతి దిశగా భారతదేశ ప్రయాణం అన్నారు. మహాకుంభ్ మన జాతీయ చేతన ఎంత గొప్పగా జాగృతం అయిందో స్పష్టం అయిందని ఆయన అన్నారు.

అయితే చర్చనీయాంశమైన విషయం ఏమంటే దాదాపు వంద సంవత్సరాల సైద్ధాంతిక భూమిక ఉన్నా, పది సంవత్సరాలకు పైగా మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నా దేశాన్నంతటినీ ఒకే గొడుగు క్రిందకు తీసుకురావడంలోను, ప్రజలందర్నీ ఒకే ఆలోచనా విధానంలో భాగస్వాములను చేయడంలోను బీజేపీ, దాని అనుబంధ సంస్థలు విజయవంతమయ్యాయా అన్న విషయం చర్చించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే కొన్ని దక్షిణాది రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా తమిళనాడు నుంచి వస్తున్న ప్రతిఘటనలను చూడాల్సి ఉన్నది. హిందీ భాష , నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులో అన్యాయం లాంటి అంశాలను ఈ రాష్ట్రాలు లేవనెత్తుతున్నాయంటే దానికీ ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నదని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

నిజానికి కాంగ్రెస్ కూడా తొలుత దేశ వ్యాప్తంగా హిందీని అమలు చేసేందుకు ప్రయత్నించింది. గాంధీ హిందీ భాషా వ్యాప్తి ద్వారా దేశాన్ని స్వాతంత్ర్య సమరం దిశగా నడిపేందుకు ప్రయత్నించారు. తమిళనాడులో స్వాతంత్ర్యానికి పూర్వమే హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. హిందీని ఇంగ్లీషు స్థానంలో దేశ జాతీయ భాషగా నిర్ణయిస్తూ హోంమంత్రి హోదాలో గుల్జారీలాల్ నందా సర్క్యులర్ జారీ చేసినప్పుడే హిందీ మాట్లాడని రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత హోంమంత్రి గోవింద వల్లభ్ పంత్ నేతృత్వంలో ఉభయ సభలకు చెందిన 35 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ కమిటీ కూడా హిందీని ప్రధాన భాషగా నిర్ణయించినప్పుడు కూడా తీవ్ర వ్యతిరేకత బయలుదేరింది. హిందీని బలవంతంగా రుద్దాలని ప్రయత్నించడం వల్ల హిందీకే నష్టమని రాజ్యాంగ అసెంబ్లీ సభ్యుడైన కెఎం మున్షీ లాంటి వారు కూడా అభిప్రాయపడ్డారు. 1965లో హిందీ వ్యతిరేక ఆందోళనలో తమిళనాడులో దాదాపు 70 మందికి పైగా మరణించారు. హిందీయేతర రాష్ట్రాలు కోరుకున్నంతవరకూ ఇంగ్లీషు అధికార భాషగా కొనసాగుతుందని అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి హామీ ఇవ్వాల్సి వచ్చింది. భాషపై జరిపిన ఆందోళన మూలంగానే డిఎంకె తమిళనాడులో అధికారంలోకి వచ్చింది. ఈ రాజకీయ నేపథ్యం తెలుసు కనుకే డిఎంకె అధినేత ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీ ఎన్నికలు ఏడాది ఉండగానే జాతీయ విద్యవిధానం ద్వారా హిందీని దొడ్డిదారిన ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆందోళన మొదలుపెట్టారు.



దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీ సంపూర్ణంగా విస్తరించాలంటే కేవలం కుంభమేళా, రామమందిరం వంటి భావోద్వేగాలు సరిపోవు. నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపు విషయంలో ఉధృతమవుతున్న ఆందోళనలకు కూడా జవాబివ్వాల్సి ఉంటుంది.

అయితే కాంగ్రెస్ హిందీని బలవంతంగా అమలు చేసే విధానాన్ని వెనక్కు తీసుకున్నా, బీజేపీ తాను హిందీని బలవంతంగా రుద్దడం లేదని చెబుతున్నా హిందీ భాష క్రమంగా అంతటా వ్యాపిస్తోంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా హిందీ ఆమోదయోగ్యత పెంచేందుకు నిరంతరం విస్తృత ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి హిందీ సినిమాలు, పాటలు, మహాభారత్, రామాయణ్‌తో పాటు హిందీ సీరియళ్లు హిందీకి ఆమోదయోగ్యత పెంచాయి. అనేకమంది దక్షిణాది ప్రజలు ఢిల్లీకి వచ్చి హిందీ రానందుకు తొలుత బాధపడినప్పటికీ వారు క్రమంగా హిందీలో పట్టు సంపాదించిన సందర్భాలున్నాయి. తనకు హిందీ, ఇంగ్లీషు రానందువల్లే ప్రధానమంత్రి కాలేదని ఒకప్పుడు కామరాజ్ వాపోయారు. కాని దక్షిణాదినేతయినా పివి నరసింహారావు చక్కటి హిందీలో ప్రసంగించేవారు. హిందీ రాకపోయినప్పటికీ ప్రధాని దేవెగౌడ కన్నడంలో హిందీ పదాలు రాసుకుని మాట్లాడేవారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్వచ్ఛమైన హిందీలో తప్ప మరో భాషలో మాట్లాడలేకపోవడం పట్ల ఇబ్బందిపడినప్పటికీ ఎంపీలకు ఆయన భాష అలవాటైపోయింది. కాంగ్రెస్ పార్టీలో ఇంగ్లీషులో మాట్లాడే అధికార ప్రతినిధులు ఉన్నప్పటికీ బీజేపీలో అలాంటి అధికార ప్రతినిధులు పెద్దగా లేకపోయినా దక్షిణాది విలేఖరులు సర్దుకుపోతున్నారు. ఈ పరిస్థితుల్లో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీని వ్యతిరేకించడం, 1968లో అన్నాదురై ప్రభుత్వం ప్రవేశపెట్టిన ద్విభాషా విధానానికి ఇప్పుడు కూడా కట్టుబడి ఉంటానని చెప్పడం, కేవలం తమిళ, ఇంగ్లీషు భాషలు తప్ప హిందీ అక్కర్లేదని ప్రకటించడం వల్ల రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం సాధించగలరా అన్న చర్చ జరుగుతోంది. తమిళనాడులో అన్నాడిఎంకె కూడా స్టాలిన్‌ను సమర్థించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

కాని ఇది కేవలం భాష పట్ల వ్యతిరేకత కాదని, బీజేపీ భావజాలం విస్తరణ పట్ల వ్యతిరేకత అన్న విషయం స్పష్టంగా అర్థమవుతూనే ఉన్నది. అందుకే భాషతో పాటు నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలను కూడా కొన్ని దక్షిణాది పార్టీలు లేవనెత్తుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోతోందని, నిధులు, పన్నుల పంపిణీలోనూ, ప్రాజెక్టుల కేటాయింపులోనూ దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని ఈ పార్టీలు విమర్శిస్తున్నాయి. ఆర్థికంగా పనితీరు ప్రదర్శించిన రాష్ట్రాలకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను రూపొందించారని తమిళనాడు, తెలంగాణ, కేరళతో పాటు పంజాబ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకంటే ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌కు నిధులు లభించిన విషయాన్ని వారు ఎత్తిచూపుతున్నారు.

ఈ నేపథ్యంలో బీజేపీ రాజకీయంగా విస్తరించాలంటే కేవలం కుంభమేళా, రామమందిరం వంటి భావోద్వేగాలు సరిపోవు. హోలీ నాడు ముస్లింలు ఇళ్లకే పరిమితం కావాలని బిహార్‌లో ఒక బీజేపీ ఎమ్మెల్యే పిలుపిచ్చారు. తాము అధికారంలోకి వస్తే ముస్లిం ఎమ్మెల్యేలనందర్నీ బయటకు గెంటేస్తామని బీజేపీ నేత సువేందు అధికారి అన్నారు. అస్సాంలో పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ఉన్నా ముఖ్యమంత్రి హేమంత బిశ్వాస్ శర్మ మదర్సాల మూసివేత వంటి ముస్లిం వ్యతిరేక అంశాలను ప్రస్తావిస్తూ ప్రచారంలో ఉంటున్నారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించి గోల్వాల్కర్ ఆశించిన లక్ష్యం నెరవేరాలంటే ఇలాంటి ప్రచారాలు సరిపోవు. నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపు విషయంలో రేగుతున్న ఆందోళనలకు కూడా జవాబివ్వాల్సి ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

నిధులు అక్కర్లేని హామీలైనా అమలు చేయరేం?

మార్చి 12 నుండి 2025–26 సంవత్సరానికి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మార్చి 19న ఈ ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గత దశాబ్ద కాలంగా పాలన పేరుతో ఇప్పటి వరకూ నడుస్తున్న ట్రెండ్ ఏమిటంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి మనసులో ఏ అంశాలకు ప్రాధాన్యత ఉందో అవే ప్రభుత్వ పాలనా ఎజెండాగా మారతాయి. ప్రభుత్వంపై రాజకీయ పట్టు కలిగిన కొందరు క్యాబినెట్ మంత్రుల ఆలోచనలు కూడా ప్రభుత్వ ఎజెండాలో ప్రవేశించవచ్చు. అంతే తప్ప పేద ప్రజల తక్షణ అవసరాలు, ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రజల ముందు పెట్టిన మేనిఫెస్టో అంశాలు ప్రభుత్వ ఎజెండాలోకి రావు.

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 'అభయ హస్తం' పేరుతో ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నో అంశాల అమలుకు పెద్దగా బడ్జెట్ కేటాయింపులు కూడా అవసరం లేదు. కానీ ప్రభుత్వం ఏర్పడి పద్నాలుగు నెలలు దాటినా అవి ఇప్పటివరకూ చర్చకు కూడా రాలేదు. పౌర సమాజ ప్రతినిధులు కొన్ని అంశాలను చర్చకు పెట్టినా, అవి ఇంకా ఆచరణకు నోచుకోలేదు.

మేనిఫెస్టో మొదటి అధ్యాయంలో ఇచ్చిన హామీ ఒకటి: "పౌర సేవల హక్కుల చట్టాన్ని తీసుకువచ్చి, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కొరకు ఒక సమగ్రమైన పోర్టల్‌ను ఏర్పాటు చేసి, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పారదర్శకంగా పరిష్కరిస్తాం. ప్రజా ఫిర్యాదుల కొరకు ఒక టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం". ఈ హామీ ఇప్పటి వరకూ అమలులోకి రాలేదు.

రాష్ట్ర రాజధానిలో 'ప్రజావాణి' పేరుతో ఒక ప్రక్రియ నడుస్తున్నా, అది ఇంకా పూర్తి స్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా రూపొందలేదు. గ్రామ, మండల స్థాయిలో ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారం అంశంలో ఇప్పుడే పైలట్ ప్రాజెక్టు ఆదిలాబాద్ జిల్లాలో మొదలైంది. అనేక మంది పౌర సమాజ కార్యకర్తలు ఇందులో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ జిల్లాలో వచ్చిన అనుభవాల నుండీ రాష్ట్ర స్థాయిలో 'ప్రజావాణి' వ్యవస్థను మెరుగుపరచాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రక్రియ ఎంత సజావుగా ముందుకు వెళుతుందో ఇప్పుడే చెప్పలేం. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తేవడం వల్ల ప్రజలు తమ బాధలు, సమస్యలు చెప్పుకునేందుకు ఒక వెసులుబాటు వస్తుంది. ప్రభుత్వం ఈ వైపు త్వరగా దృష్టి సారించాలి. దీనికి బడ్జెట్‌లో నిధుల ఖర్చు కూడా ఎక్కువ ఉండదు.

ఆరు గ్యారంటీలలో మరో అంశం బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో సంబంధం లేకుండా అమలు చేయవచ్చు. వివిధ జిల్లాలలో, హైదరాబాద్ మహానగరంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇదే సమయంలో రాష్ట్రంలో వేలాది పేద కుటుంబాలు కనీస ఇంటి స్థలం లేక ఇబ్బంది పడుతున్నాయి. ఆయా జిల్లాలలో పేదలు ఇంటి స్థలాల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. ఇంటి స్థలం ఉంటే కానీ, ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం క్రింద ఇల్లు మంజూరు చేయదు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే పూనుకుని, ఆయా జిల్లాలలో ఉన్న ప్రభుత్వ భూముల నుండీ కొంత భాగాన్ని, ముందుగా స్థానికంగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలంగా కేటాయించాలి. రెవెన్యూ, గ్రామ పంచాయితీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఈ పని పూర్తిచేయవచ్చు. ప్రస్తుతం దీనికి బడ్జెట్ నుండీ నిధుల కేటాయింపు అవసరం లేదు. స్థలాల కేటాయింపు పూర్తయ్యాక అక్కడ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించవచ్చు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో రైతుల నుండీ వందల ఎకరాల భూమి లాక్కుని పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడానికి పరుగులు పెడుతున్న ప్రభుత్వం పేద కుటుంబాలకు ఇళ్ల స్థలం ఇవ్వడానికి కూడా అదే వేగంతో పనిచేయాలి.

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 'అభయ హస్తం' పేరుతో ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నో అంశాల అమలుకు పెద్దగా బడ్జెట్ కేటాయింపులు కూడా అవసరం లేదు. కానీ ప్రభుత్వం ఏర్పడి పద్నాలుగు నెలలు దాటినా అవి ఇప్పటివరకూ చర్చకు కూడా రాలేదు. పౌర సమాజ ప్రతినిధులు కొన్ని అంశాలను చర్చకు పెట్టినా, అవి ఇంకా ఆచరణకు నోచుకోలేదు.



కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్లుగా– లాభసాటి వ్యవసాయమే లక్ష్యంగా తెలంగాణ వాతావరణ పరిస్థితులకు అనువుగా, నూతన వ్యవసాయ విధానం, పంటల ప్రణాళిక వెంటనే తయారు చేయవచ్చు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థక, మత్స్య, మార్కెటింగ్ శాఖలకు, రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాల యూనివర్సిటీలకు ఉమ్మడిగా ఈ బాధ్యత అప్పగించవచ్చు. అగ్రికల్చర్ యూనివర్సిటీని ఇందుకు నోడల్ ఏజెన్సీగా పెట్టవచ్చు. ఈ సంస్థలు, రైతు సంఘాలు, రైతు సహకార సంఘాల భాగస్వామ్యంతో రూపొందించే నివేదికలను వచ్చే ఖరీఫ్ నుండీ అమలు చేయవచ్చు. దీనికి బడ్జెట్‌లో తక్షణమే నిధుల కేటాయింపు అవసరం లేదు.

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగ నిర్మూలన అంశం క్రింద "ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేట్ కంపెనీలలో తెలంగాణ యువతకు 75శాతం రిజర్వేషన్ కల్పన" అనే హామీ ఉంది. ఇది మంచి హామీ. కానీ ఆచరణలోకి రాలేదు. గత ఏడాదిగా రాష్ట్రంలోకి తరలివస్తున్న పరిశ్రమల గురించి రోజూ ముఖ్యమంత్రి, మంత్రులు ఆట్టహాసంగా ప్రకటిస్తున్నారు కానీ, వస్తున్న ప్రైవేట్ పెట్టుబడిదారులు స్థానికంగా యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారా లేదా అనేది చూడడం లేదు.

చేవెళ్ళ ఎస్.సి. ఎస్.టి డిక్లరేషన్‌లో 5వ అంశంగా ఒక హామీ ఉంది: "బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకున్న ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను తిరిగి అసైనీలకే అన్ని హక్కులతో పునరుద్ధరిస్తాం. ప్రజా ప్రయోజనార్థం భూసేకరణ చట్టం 2013 ప్రకారం భూములను సేకరించినప్పుడు, అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం అందిస్తాం". నిజానికి ఇవి విప్లవాత్మక హామీలు. గత ఏడాదిగా వీటిని అమలు చేసి ఉంటే గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ లభించేది. ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకున్న అసైన్డ్ భూములను ఆయా కుటుంబాలకు వెనక్కు ఇవ్వడం అద్భుతమైన ప్రతిపాదన. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అందుకు పూనుకోవాలి. ఈ అంశంలో ఇచ్చిన రెండవ హామీ కూడా ముఖ్యమైనదే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీని మర్చిపోయి, 2013 చట్టం ప్రకారం కాకుండా, కేసీఆర్ తెచ్చిన అన్యాయమైన 2017 భూసేకరణ చట్టం ప్రకారం ఆయా జిల్లాలలో భూములను సేకరించడానికి నోటిఫికేషన్లు ఇస్తున్నది. అవసరమైన, అనివార్య స్థితిలో మాత్రమే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నోటిఫికేషన్‌లు ఇచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి.

మేనిఫెస్టోలో మద్యపాన విధానం అంశం క్రింద "బెల్టు షాపులను రద్దు చేస్తాం. మత్తు బానిసలకు ప్రతి జిల్లా ఆసుపత్రిలోనూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తాం" అని ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం మర్చిపోయింది. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ హామీలను అమలు చేస్తే బెల్టు షాపులు నాశనమై మద్యం అమ్మకాలు తగ్గి ప్రభుత్వానికి కొంత ఎక్సైజ్ పన్ను ఆదాయం తగ్గవచ్చు. కానీ రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా కోలుకుంటాయి. నిజానికి ఈ హామీలను అమలు చేయడానికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల కేటాయింపు అవసరం లేదు.

• కన్నెగంటి రవి
తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

చెక్కిళ్ళపై చెమ్మని తుడిచిన జీవో 6

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి. దాన్నే ప్రజాప్రభుత్వం అంటారు. నీళ్ళూ నిధులే కాదు. విద్య, ఆరోగ్యం, నియామకాలు కూడా ముఖ్యమే. ప్రత్యక్ష నియామకాలు ఎంత అవసరమో కారుణ్య నియామకాలూ అంతే అవసరం. ఒక ఉద్యోగి మరణిస్తే ప్రభుత్వం ఆ కుటుంబానికి చేయూతనందించాలి. 2013లో పంచాయత్‌రాజ్ శాఖలో పనిచేసే వారికి జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉద్యోగాలను ఇచ్చే అధికారం జిల్లా పరిషత్ ఛైర్మన్ పరిధిలోకి తెచ్చారు. 2015 నుండి కారుణ్య నియామకాల ఫైలు పెండింగ్‌లో పడిపోయింది.

పదవీ విరమణ వయస్సు పెంచడం, వీఆర్వోలను సంస్కరణల పేరుతో వేరే శాఖలకి పంపించడం కారణాలుగా చూపి కారుణ్య నియామకాలను అమలుపరచలేదు. గత ప్రభుత్వం ఈ విషయంలో దయ లేకుండా ప్రవర్తించింది. ప్రత్యేక రాష్ట్రం ఉద్యమంలో చాలామంది కారుణ్య నియామకాలను కూడా చేపట్టాలని కోరుకున్నారు. రాష్ట్రం సిద్ధించి పదేళ్ళయినా వారి కోర్కె తీరలేదు. భర్తలు పోయిన భార్యలు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల బాధ వర్ణనాతీతం.

G.O.No.79 ద్వారా ఒక మూడు జిల్లాల్లో కొన్ని నియామకాలు జరిగాయి. కాని సుమారు 600 మంది సుదీర్ఘ నిరీక్షణలో ఉండిపోయారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ తన తప్పులకు తానే బలయ్యింది. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. సామాన్యుల సమస్యలను అర్థం చేసుకునే వాళ్ళ సంఖ్య పదిరెట్లు పెరిగింది. పౌరసమాజం స్వరాల్ని వినేవాళ్ళు పెరిగారు. కొంతమంది ఆలోచనాపరులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలు విడమరిచి చెప్పారు. అధికారులలో కొందరు మానవతా దృష్టితో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయారు. వారి సమస్యను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చజెండా ఊపారు. ప్రభుత్వానికి కారుణ్య నియామకాల సమస్యని తీసుకెళ్ళిన అధికారులలో పోలీసుశాఖ అధికారులు కూడా ఉన్నారు. G.O.Ms.No.6 ద్వారా 582 మంది పెండింగ్ దరఖాస్తుదారులకు నియామకాలు దక్కాయి. దశాబ్దాల పాటుగా పెండింగ్‌లో ఉన్న వారి కళ్ళల్లో, జీవితాల్లో వెలుగులు విరజిమ్మాయి. నేడు రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందుకోబోతున్నవారికి అభినందనలు.

– జి. తిరుమలకుమార్



డీలిమిటేన్షన్!

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై సర్వత్రా ఉత్కంఠ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12స్థానాలు
- కొత్తగా నాలుగైదు నియోజకవర్గాలు పెరుగుతాయని అంచనా
- పొరుగు జిల్లాల నుంచి 12 మండలాలు ఉమ్మడి జిల్లా పరిధిలోకి విలీనమయ్యే అవకాశం
- ఒకే జిల్లా పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఉండేలా కసరత్తు
- వరంగల్ నగరంలో ఒకటి, చుట్టు పక్కల ప్రాంతాల్లో మరొకటి ఏర్పడే ఛాన్స్
- భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో మరో మూడు!
- రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం కసరత్తు చేస్తోంది. 2011 జనాభా లెక్కల ఆధారంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉన్నట్టు గా అంచనా. దీంతో నియోజకవర్గాల పునర్విభజనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. వరంగల్ నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయని, కొత్త నియోజకవర్గాలు, రిజర్వేషన్ల మార్పుతో పాటు నియోజకవర్గాల హద్దులు కూడా మారే అవకాశం ఉందన్న సమాచారంతో ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికలనాటికి ఓరుగల్లులోని అసెంబ్లీ నియోజకవర్గాల లెక్కలు తేలనుండటంతో.. ఆశావహులు తమ రాజకీయ భవిష్యత్ ఏంటా అన్న ఉత్కంఠలో ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ప్రతీ 20ఏళ్లకు ఒకసారి అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. 2008లో జరిగిన పునర్విభజనలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న 13 అసెంబ్లీ స్థానాల సంఖ్య 12 స్థానాలకు పడిపోయింది. అలాగే శాయంపేట, చెన్నూరు, చేర్యాల, హనుమకొండ, వరంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల స్థానంలో కొత్తగా పాలకుర్తి, భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, వరంగల్‌తూర్పు పేరుతో నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. శాయంపేట నియోజకవర్గం మొత్తానికే కనుమరుగైంది. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంది. అయితే రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో నియోజకవర్గాలను పెంచాలనే ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని ప్రతీ ఎంపీ స్థానంలో రెండు అసెంబ్లీ స్థానాలను పెంచాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ లెక్కన తెలంగాణలో కొత్తగా 34 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. అంటే ప్రస్తుతం ఉన్న 119తో 34 కొత్తవాటిని కలిపితే 153 స్థానాలవుతాయి. ఈ నేపథ్యంలో 2011 జనాభా ప్రకారం రాష్ట్రంలో 3,51,93,978మంది జనాభా ఉండగా.. ఈ మొత్తాన్ని 153నియోజకవర్గాలతో భాగిస్తే.. ప్రతీ నియోజకవర్గంలో 2,30,064జనాభా ఉండాలి. అయితే పునర్విభజన చట్టం ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో 10శాతం తక్కువ లేదా ఎక్కువ ఉండవచ్చు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలున్నాయి. ఈ లెక్కన నాలుగు అసెంబ్లీ స్థానాలు పెరుగాల్సి ఉంది. అయితే జనగామ నియోజకవర్గం భువనగిరి ఎంపీ స్థానంలో కలుస్తుండగా, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల పరిధిలోని కొన్ని మండలాలు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాలో విలీనమయ్యాయి. వీటన్నింటిని కూడా ఒకే పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి తీసుకరానున్నారు. పార్లమెంట్ పరంగా చూస్తే నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరిగే ఛాన్స్ ఉంది. ఇక జనాభా పరంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 39,17,048మంది జనాభా ఉంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 2,30,064మంది ఉండాలి.. అంటే 17 స్థానాల వరకు పెరిగే అవకాశం ఉంది. ఇందులో ఒకటి అటు ఇటుగా మారే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా, పునర్విభజనతో కొత్తగా నాలుగైదు స్థానాలు పెరుగుతాయనే చర్చ జరుగుతోంది.

ఒకే జిల్లా పరిధిలో ఒక నియోజకవర్గం సాధ్యమేనా?

ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఒకే జిల్లా పరిధిలో ఉండేలా అధికారయంత్రాంగం కసరత్తు చేస్తోంది. అయితే ఆరు చిన్న జిల్లాలుగా ఉండటంతో అంతటా ఇది సాధ్యపడకపోవచ్చుననే అభిప్రాయాలున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక జనాభా ఉన్న హనుమకొండ పరిధిలో ఎక్కువ అసెంబ్లీ స్థానాలు వచ్చే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లాలో 11,35,707 జనాభా ఉండగా, వరంగల్ జిల్లాలో 7,16,457 జనాభా ఉంది. అలాగే జనగామ జిల్లాలో 5,82,457 మంది జనాభా, మహబూబాబాద్ జిల్లాలో 7,70,170 మంది, భూపాలపల్లిలో 4,16,763 మంది, ములుగు జిల్లాలో 2,95,494 జనాభా మాత్రమే ఉంది. అయితే వరంగల్ నగరం హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో ఉండటంతో పాట్లు గ్రేటర్ వరంగల్ జనాభా

మిగతా 7వ పేజీలో..

2011లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో జనాభా.. ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాలు.. కొత్తగా ఏర్పడేందుకు అవకాశం ఉన్న స్థానాల వివరాలు

జిల్లా	జనాభా (2011లెక్కలు)	ప్రస్తుత నియోజకవర్గాలు	కొత్తగా	మొత్తం
వరంగల్	7,16,457	03	01	04
హనుమకొండ	11,35,707	02	02	04
జనగామ	5,82,457	03	01	02
మహబూబాబాద్	7,70,170	02	01	03
భూపాలపల్లి	4,16,763	01	01	02
ములుగు	2,95,494	01	01	02
మొత్తం	39,17,048	12	06	17



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, తదితరులు

దేవాదులతో సాగునీరందిస్తాం

పదేళ్లలో కేసీఆర్ చేసిన నిర్లక్ష్యం వల్లే నీటి ఎద్దడి

- కమీషన్ల కోసం కొత్త ప్రాజెక్టులు తెచ్చారు
- ఎన్ని నిధులైనా వెచ్చించి దేవాదుల పూర్తిచేస్తాం
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

7

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి

రైతులకు కలెక్టర్ సత్యశారద సూచన

వరంగల్ కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తక్కువ నీటి వినియోగంతో అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సత్యశారద కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ ముద్రించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. వరి, మొక్కజొన్న పంటల సాగుపై రైతులు ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారని, ఈ పంటలకు ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలను, డ్రిప్‌ను ఇవ్వడంతో పాటు పంటను కూడా కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి పామాయిల్ దిగుమతి చేసుకుంటున్నామని, అదే మనమే సాగు చేస్తే రాబోవు రోజుల్లో ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా ఉద్యానవన అధికారి సంగీతలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో టీజీ ఐపాస్ ద్వారా వివిధ శాఖలకు సంబంధించి పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇప్పటి వరకు 84 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో 52 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని, మిగతా దరఖాస్తులు అసంపూర్తిగా ఉండటంతో పూర్తి సమాచారం కోరామని తెలిపారు. ఆరు ప్రతిపాదనలను తిరస్కరించామన్నారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ జీఎం రమేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫామ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫామ్ 7 ద్వారా ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో ప్రతిపాదిత పేరును చేర్చడం, తొలగించడం కోసం, అభ్యంతరాలకు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

సంబంధించిన వివరాలను పొందుపర్చినట్లయితే వారి పేరును ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. కాగా, ఒకే బూత్‌లోనే కుటుంబ సభ్యుల పేర్లు ఉండాలని, ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, ఎలక్షన్ డీటీ రంజిత్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 41422 దరఖాస్తులు రాగా అందులో 14899 క్రమబద్ధీకరణకు మంజూరు చేశామని, ఫీజు చెల్లించిన 665 మందికి క్రమబద్ధీకరణ పత్రాలు అందజేశామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం 2020 ఆగస్టు 26కు ముందు దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈ నెల 31లోగా 25శాతం రిబేట్‌తో ఫీజు చెల్లించేలా ప్రోత్సహించాలన్నారు. అవసరమైన చోట అదనపు లాగిన్ల ద్వారా అధికారులు సమన్వయంతో దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక వ్యవస్థను కాపాడేది రాజ్యాంగమే..

- ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ
- కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భారత సామాజిక వ్యవసను కాపాడేది రాజ్యాంగమేనని ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ అన్నారు. మంగళవారం కాకతీయ వర్సిటీ సెనెట్ హాల్‌లో కేయూ ఎస్సీ ఎస్టీ సెల్ నేతృత్వంలో రెండు రోజులు పాటు జరిగే 'భారత రాజ్యాంగం -మైలురాళ్లు -సమస్యలు, సవాళ్లు' అనే అంశంపై జాతీయ సదస్సు ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన జస్టిస్ నారాయణ ప్రసంగించారు. దేశంలోని ప్రజలంతా రాజ్యాంగ పరిధిలో జీవిస్తున్నారని పేర్కొన్నారు. సమసమాజ స్థాపనకు రాజ్యాంగం దోహదపడుతుందన్నారు. సెక్యులర్ భావాలు కల్గిన భారతీయ రాజ్యాంగం గొప్పదన్నారు. హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్



సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ

జి.చంద్రయ్య మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధికి రిజర్వేషన్లు దోహదపడుతాయన్నారు. నాణ్యమైన విద్యతో సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. భగద్గీత, వేదాలతో పాటు రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలని కోరారు. విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక నిధులు కేటాయించి బలోపేతం

మిగతా 8వ పేజీలో..

బహుమతులిచ్చి.. మత్తుకు బానిసలుగా చేసి..

- బాలికలను వ్యభిచార ఊబిలోకి దింపిందుకు కిలాడీ లేడీ స్కెచ్
- ఓ మహిళ, అనాథ బాలికతో పాటు నలుగురు నిందితుల అరెస్టు
- గంజాయి, కారు, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

6



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర సర్వీస్‌లో అమలు చేయాలి

- ఎస్సీ రిజర్వేషన్స్‌ను 18 శాతానికి పెంచాలి
- అసెంబ్లీలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను కేంద్ర సర్వీస్‌లలో అమలు చేయాలని ఆ దిశగా అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో వర్గీకరణ అంశం పైన కడియం ప్రసంగించారు. వర్గీకరణపై ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును వెంటనే దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వం దళితుల జీవితాలలో కొత్త వెలుగులు నింపే ప్రయత్నం చేస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన షెడ్యూల్ కులాల రిజర్వేషన్‌ను 18శాతానికి పెంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. దళిత సామాజిక వర్గం మొత్తం కూడా కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి అండగా నిలబడుతుందని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదంతో ఎమ్మార్పీఎస్ సంబరాలు



జనగామ చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులతో ఎమ్మెల్యే

జనగామ కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీ ఆమోదం తెలపడంతో జనగామలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. చౌరస్తాలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సంబరాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది మాదిగ బిడ్డలందరి విజయమన్నారు. వర్గీకరణ పోరాటాన్ని మంద కృష్ణ అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. వర్గీకరణ ఉద్యమాన్ని తెలంగాణ ఎస్సీ నాయకులే ముందుండి నడిపించారని, దేశంలోని ఎస్సీలంతా తెలంగాణ నాయకులను గుర్తుంచుకోవాలన్నారు. వర్గీకరణ అమలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాను ముందుండి సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న 13 మిడ్ లెవెల్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ అనుమతితో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం చదివి 18 నుంచి 46 సంవత్సరాలలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను హనుమకొండ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోపు సమర్పించాలన్నారు.

బహుమతులిచ్చి.. మత్తుకు బానిసలుగా చేసి..

- బాలికలను వ్యభిచార ఊబిలోకి దింపేందుకు కిలాడీ లేడీ స్కెచ్
- ఓ మహిళ, అనాథ బాలికతో పాటు నలుగురు నిందితుల అరెస్టు
- గంజాయి, కారు, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్



మీడియాతో మాట్లాడుతున్న సీపీ



నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

పోలీసులకు సీపీ ప్రత్యేక అభినందనలు

ఇతర బాలికలు ఎవరు వారి మాయలో పడకుండా, జీవితాలు ఆగం కాకముందే తొలిదశలోనే నిందితులను గుర్తించి అరెస్టు చేసిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ నందిరాంనాయక్, సీఐ వెంకటరత్నం, ఎస్ఐలు శ్రీకాంత్, సురేశ్‌ను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

వరంగల్ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అభం శుభం తెలియని బాలికలతో పరిచయం చేసుకుని.. వారికి బహుమతులు ఇచ్చి.. మత్తుకు బానిసలుగా చేసి తాను చేసే వ్యభిచారం ఊబిలోకి దింపి వారి భవిష్యత్‌ను అంధకారం చేయాలనుకున్న ఓ కిలాడీ లేడీ ఆగడాలకు పోలీసులు చెక్‌పెట్టారు. ఆ ముఠా గుట్టురట్టు చేశారు. ఇందులో ప్రధాన సూత్రధారి అయిన మహిళ, ఆమెకు సహకరించిన ఓ అనాథ బాలిక, మరో నలుగురు యువకులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.80కిలోల గంజాయి, 4,300 కండోమ్స్ ప్యాకెట్లు, రూ.75వేల నగదు, కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. మార్చి 11న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే ఓ బాలిక అదృశ్యమైనట్లుగా ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు బాలిక కోసం వెతుకుతుండగా ఆ బాలిక హనుమకొండ ములుగు రోడ్డు క్రాస్‌లో తారసపడిందని, ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా తనను ఎవరో కిడ్నాప్ చేసి గంజాయి తాగించి అత్యాచారం చేశారని వెల్లడించిందన్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఆధ్వర్యంలో ఏసీపీ నందిరాం నాయక్ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. దామెర మండలం ల్యాదెల్లకు చెందిన ముస్కు లత (38) తల్లితండ్రులు లేని ఓ అనాథ బాలికను చేరదీసి తన ఇంట్లో ఉంచుకుంటోంది. బాలికలను ఈ వృత్తిలోకి దింపితే విటుల నుంచి ఎక్కువ డబ్బు డిమాండ్ చేయొచ్చన్న ఉద్దేశంతో పాఠశాలల బాలికలను ట్రాప్ చేసి తీసుకరావాలని సదరు అనాథ బాలికకు చెప్పేది. ఈ క్రమంలో అనాథ బాలిక మైనర్ అయిన తన స్నేహితురాలిని ట్రాప్ చేసేందుకు ప్రయత్నించగా ఆమె తన దారిలోకి రాకపోవడంతో ఆమె ద్వారా పరిచయమైన లేబర్‌కాలనీకి చెందిన 9వ తరగతి చదువుతున్న ఓ బాలికను ఇన్‌స్టా గ్రామ్ ద్వారా పరిచయం చేసుకుని.. తరచూ ఆ బాలిక చదివే పాఠశాల వద్దకు వెళ్తూ మాయ మాటలు చెప్పి దగ్గరైంది. ఆ తర్వాత బహుమతులు ఇచ్చి మచ్చిక చేసుకుంది. ఆ తర్వాత తనకు సహాయకురాలైన అనాథ బాలిక, ఆమె ప్రియుడు అబ్దుల్ అఫ్నాన్ సాయంతో బాధిత బాలికకు గంజాయి తాపించి.. నూతన వస్త్రాలు ఇప్పించారు. ఈ నెల 11న బాధిత బాలికను ఇంట్లో నుంచి అనాథ బాలిక ద్వారా బయటకు రప్పించి అబ్దుల్ అఫ్నాన్, అతడి స్నేహితులు శంభునిపేటకు చెందిన షేక్ షైలానీ, మహ్మద్ ఆఫ్జల్ సాయంతో కారులో ఎక్కించుకొని తమకు గంజాయి విక్రయించే వరంగల్‌లోని మీర్జా ఫైజ్ బేగ్ అలియాస్ వదూద్ అనే వ్యక్తి వద్దకు వెళ్లారు. అక్కడ గంజాయి కొనుగోలు చేసి నర్సంపేటలోని షేక్ షైలాని ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ బాధిత బాలికకు గంజాయి తాగించి ఆమె మత్తులోకి జారుకున్న సమయంలో ఆమెపై షేక్ షైలానీ బాబా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత గంజాయి తాగుతున్నప్పుడు, షైలానీబాబా అత్యాచారం చేసినప్పుడు వీడియోలు తీశామని, తాము చెప్పినట్టు వినకపోతే వాటిని సోషల్‌మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించారని నిందితులు విచారణలో అంగీకరించారన్నారు. నిందితులపై పోక్సో, ఎన్‌డీపీఎస్ యాక్టు, మానవ అక్రమ రవాణా సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించడం జరిగిందని సీపీ తెలిపారు.

నిందితులంతా పాత నేరస్థులే..

ముఠాలోని నలుగురు యువకులు గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లుగా పోలీసుల విచారణలో తేలినట్లు సీపీ వెల్లడించారు. నలుగురు ఆటోడ్రైవర్లుగా పనిచేస్తూ స్నేహితులయ్యారు. వీరిలో ముగ్గురు ఆటో డ్రైవర్లుగా కొనసాగుతుండగా అబ్దుల్ అఫ్నాన్ డ్రైవర్‌గా వెళ్లకుండా వేరే పనిచేసుకుంటున్నాడు. హనుమకొండ, గీసుగొండ, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్లలో రెండు డెకాయిట్ కేసులతో పాటు హత్యాయత్నం కేసులో షేక్ షైలాని బాబా నిందితుడిగా ఉన్నాడు. మీర్జా ఫైజ్ బేగ్ అనే వ్యక్తి పోక్సో, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడిగా ఉన్నాడు. మహ్మద్ ఆఫ్జల్‌పై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన సెక్షన్ 324 కేసులో నిందితుడిగా ఉన్నాడు. అబ్దుల్ అఫ్నాన్ హత్యాయత్నం కేసులో నిందితుడుగా ఉన్నాడు.

ఆదర్శ రైతులకు ఉగాది పురస్కారాలు

- గో ఆధారిత వ్యవసాయంపై సదస్సు
- ఈనెల 23న గూడెప్పాడులో నిర్వహణ

హనుమకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం (జేబీడీ) ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ఆత్మకూరు మండలం గూడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు, ఆదర్శ రైతులకు ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జేబీడీ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సరికొండ తిరుపతి రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గౌరవ అతిథిగా, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ఎల్ జలపతిరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. వ్యవసాయాభివృద్ధికి, రైతుల ఆదాయం పెంపునకు నిరంతరం కృషి చేస్తున్న వ్యవసాయ రంగనిపుణులకు, సహకార సంఘాల ఏర్పాటుకు శ్రమిస్తున్న ప్రముఖులకు, సేంద్రియ, గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులకు ఈ పురస్కారాలను అందచేయనున్నట్టు ఆయన తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు వ్యవసాయ రంగ నిపుణులు, సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను ఈ వేడుకలకు ఆహ్వానిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 96035 96275, 93945 99300 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుంది. రైతులకు అవసరమైన సేంద్రియ, సహజ, గో ఆధారిత, స్వదేశీ, గ్రామీణ, చేతి వృత్తుల తయారీదారులు సభా ప్రాంగణంలో ఉచితంగా స్టాల్స్ ఏర్పాటు చేసి ఉత్పత్తులను ప్రదర్శించుకోవచ్చునన్నారు.

గార్లలో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేత

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



గార్ల రైల్వేస్టేషన్ సమీపంలోని ఐబీ సిగ్నల్ వద్ద నిలిచి పోయిన ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు

గార్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రం సమీపంలోని ఐబీ సిగ్నల్ వద్ద మంగళవారం రెండుగంటల పాటు ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలును సం బంధిత అధికారులు నిలిపి వేశారు. గార్ల-గుండ్రాతి మడుగు మధ్యలో ఉదయం సాంకేతిక లోపంతో గూడ్స్‌రైలు నిలిచి పోయింది. ఈ సమయంలో విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీ వెళ్లాల్సిన 20805 నెంబర్ గల ఏపీ ఎక్స్‌ప్రెస్‌ను గార్లలో ఎగువ లైనుపై ఉదయం 6గంటల ప్రాంతంలో నిలిపివేసి, 8 గంటలకు పంపించారు. దీంతో 2గంటల పాటు రైలులోనే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు అంతరాయం

డోర్నకల్, (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్-మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌ల మధ్య సెక్షన్‌లోని గుండ్రాతి మడుగు స్టేషన్ సమీపంలో అప్‌లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు ఇంజన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దీంతో గుండ్రాతిమడుగు సమీపంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్, గార్లస్టేషన్ సమీపంలో ఏపీ ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో కాకతీయ ఎక్స్‌ప్రెస్, హోం సిగ్నల్ వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. అలాగే భద్రాచలం రోడ్ టు సిర్పూర్‌కాగజ్‌నగర్ వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను రెండు గంటల పాటు పోచారం స్టేషన్‌లో నిలిపివేశారు. మహబూబాబాద్ నుంచి మరో ఇంజన్‌ను తీసుకువచ్చి గూడ్స్ రైలును గుండ్రాతి మడుగు స్టేషన్‌కు చేర్చిన తర్వాత రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

టీఎన్‌జీవోస్ మెడికల్ ఫోరం అధ్యక్షుడిగా మల్లారెడ్డి



వరంగల్ మెడికల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవోస్ మెడికల్ ఫోరం ఉపాధ్యక్షుడిగా గంగాడి మల్లారెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు టీఎన్‌జీవోస్ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ నియామక పత్రం విడుదల చేశారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీజీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పలువురికి నియామక పత్రాలు అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖలోని హనుమకొండ జిల్లా టీబీ నియంత్రణ అధికారి కార్యాలయంలో మల్లారెడ్డి సీనియర్ అసిస్టెంట్‌గా నిర్వర్తిస్తున్నారు. ఈయన నియామకంపై పలువురు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

నర్సింగ్ కళాశాలను సీజ్ చేసిన బల్దియా అధికారులు

- మూడు సంవత్సరాలుగా పన్ను చెల్లించని వైనం



జయకళాశాలను సీజ్ చేస్తున్న బల్దియా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జయనర్సింగ్ కళాశాలపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. గత మూడు సంవత్సరాలుగా బల్దియాకు ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో రెడ్ నోటీజులు జారీ చేసినా స్పందించక పోవడంతో చివరికి మంగళవారం బల్దియా అధికారులు మూకుమ్మడిగా వెళ్లి కళాశాలకు సీజ్ చేశారు. వరంగల్ డీజీ రవికుమార్ మాట్లాడుతూ.. జయనర్సింగ్ కళాశాల యాజమాన్యం కళాశాల విషయం కోర్టులో విచారణ కొనసాగుతుందని చెబుతూనే కళాశాలను నడుపుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు రూ.44 లక్షల బకాయి ఉందన్నారు. బల్దియా అధికారులు పన్ను చెల్లించాలని చాలా సార్లు చెప్పినా పట్టించుకోవడంతో పాటు ఏవో సాకులు చెప్పి తప్పించుకు తిరుగుతున్నట్టు వెల్లడించారు. చివరికి మంగళవారం కళాశాల విద్యార్థులను బయటకు పంపించి కళాశాల మేయిన్ గేటుకు తాళం వేసి సీజ్ చేసినట్టు తెలిపారు. గత వారం రోజులుగా బల్దియా అధికారులు మొండి బకాయిలు ఉన్న 356 ప్రాపర్టీలను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఆర్‌వో యూసుఫుద్దీన్, ఆర్ఐలు సురేష్, రజిని, భరత్‌చంద్రారెడ్డి, శ్రీకాంత్‌తో పాటు బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపిక



బి.ప్రవీణ్



జి.శిరీష

వడ్డెపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ అధికారుల నియామకం కోసం జరిగిన పరీక్షల్లో వరంగల్ ఉమ్మడి జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం (వడ్డెపల్లి)లో ఉచిత కోచింగ్ తీసుకున్న ఇద్దరు అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన బి.ప్రవీణ్, వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామానికి చెందిన జి. శిరీష హాస్టల్ వెల్ఫేర్ అధికారులుగా ఎంపికయ్యారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ హనుమకొండ జిల్లా అధికారిణి ఎ. శ్రీలత, షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డాక్టర్ కొంగర జగన్మోహన్ తదితరులు వీరిని అభినందించారు.

విద్యుత్ వినియోగదారులకు సీఎండీ ఫోన్

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కొత్త సర్వీసులు పొందిన వ్యవసాయ, కమర్షియల్, వ్యవసాయ, గృహ, పరిశ్రమలు నిర్వహించే వినియోగదారులకు సీఎండీ మంగళవారం ఫోన్ చేసి మాట్లాడారు. కొత్త సర్వీసుల మంజూరులో ఏమైనా జాప్యం జరిగిందా... కాల పరిమితికి లోబడి మంజూరు చేస్తున్నారా... విద్యుత్ అధికారులు నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తున్నారా... అనే పలు విషయాలను వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ నాణ్యమైన విద్యునందించడంలో భాగంగా వినియోగదారులతో మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. వినియోగదారులతో మాట్లాడటం వల్ల వారిలో మరింత నమ్మకం పెరిగి, సత్సంబంధాలు బలోపేతం అవుతాయన్నారు. వినియోగదారుల అభిప్రాయాలతో మరింత మెరుగైన సేవలందించడానికి కంకణబద్దులమై పనిచేస్తామన్నారు.

ఆర్ట్స్ కళాశాల దూరవిద్య కోఆర్డినేటర్‌గా మంజుల



దూర విద్య కోఆర్డినేటర్ నియామక ఉత్తర్వులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్ట్స్ కళాశాల దూర విద్య (ఎస్డీఎల్‌సీఈ) కోఆర్డినేటర్‌గా కళాశాలలో గణిత అధ్యాపకురాలు డాక్టర్ మంజులను నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపాల్ చాంబర్‌లో మంజులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పుల్లా రమేష్, శ్రీధర్‌కుమార్, ఫిరోజ్, నహీదా, రమేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమేష్ (ఫైల్)

ఐనవోలు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని కొండపర్తి గ్రామ శివారు కొత్త చెరువు కాలువ సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బాల్నే రమేష్(45) కొత్త చెరువు కింద ఉన్న వ్యవసాయ క్షేత్రానికి ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. పొలానికి నీటిని అందించే విద్యుత్ మోటర్ పనిచేయకపోవడంతో స్టార్టర్ ద్వారా మోటర్‌ను ఆన్ చేస్తుండగా తెగిపోయిన వైరు తగిలి విద్యుదాఘాతంతో పక్కనే ఉన్న వాగులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రమేష్‌కు భార్య శోభారాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం కాగా రెండో కుమార్తె చదువుకుంటోంది. రమేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2160	2100
పల్లికాయ (సూక)	7390	6500
పల్లికాయ (పచ్చిది)	4500	3400
కందులు	6921	5540
పెసళ్లు	7407	4645
పత్తి	6975	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13650	9000
వండర్‌హాట్	16000	11500
యూఎస్341	13100	9500
దేశీ	30000	25500
సింగిల్ పట్టి	33000	28000
దీపిక	15800	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం









మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న మానుకోట, కురవి రహదారి , మధ్యాహ్నం జనసంచారం తక్కువగా ఉన్న వరంగల్ నగరంలోని రోడ్లు



← తొర్రూరులో ఎండ నుంచి ఉపశమనం పొందేలా తాటి కొమ్మలు నెత్తిన పెట్టుకుని బైక్‌పై వెళ్తున్న వాహనదారుడు, ముఖానికి రక్షణగా వస్త్రాలు కట్టుకున్న దృశ్యం

సుర్రుమంటోంది..

రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత

- 40 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలు
- వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- వేసవి ప్రణాళికకు సిద్ధమవుతున్న వైద్యఆరోగ్యశాఖ



పోచమ్మమైదాన్ /మహబూబాబాద్ టౌన్ /వర్ధన్నపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎండ సుర్రుమంటోంది. ఉదయం 9గంటల నుంచే భానుడు భగ్గుమంటుండగా.. మధ్యాహ్నం సమయంలో మాడు పగులుతోంది. దీంతో జనం రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడిజిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు చేరువయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం 39.6 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదవగా.. వరంగల్‌లో 38డిగ్రీలు, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లో 37డిగ్రీలు, ములుగు, జనగామ జిల్లాలో 36డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. క్రమంగా ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం పెద్దవంగర మండలం ఉప్పరిగూడెంకు చెందిన దుంపల రాజు (48) వడదెబ్బతో మృతి చెందాడు. ఎండల వేడిమితో ఏసీల వాడకం, విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలు కూలర్ల ద్వారా ఉపశమనం పొందుతున్నారు. అలాగే జనం శీతల పానియాలను(జ్యూస్) ఆశ్రయిస్తుండటంతో ఆయా దుకాణాల వద్ద రద్దీ కనిపిస్తోంది. ముస్ముందు ఎండలు మరింత తీవ్రమవుతాయన్న అంచనాల నేపథ్యంలో వాతావరణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది. అలాగే జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా అప్రమత్తమవుతున్నారు. వడదెబ్బకు గురవకుడా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

వేసవి కాలంలో వడదెబ్బకు గురైన సమయంలో ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిశాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం గాఢ పసుపురంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా అపస్మారక స్థితిలోకి వెళ్లే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కన్పిస్తాయి.

ప్రథమ చికిత్స..

వడ దెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఎండదెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, పప్పుకట్టు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి, సత్వర చర్యలకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స అనంతరం దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం, ఆడడం చేయవద్దు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు, నూలు వస్త్రాలు ధరించాలి. నీరు, ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా ఇంటి వద్ద ఉండే పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు అనారోగ్యంతో బాధ పడేవారు తరుచుగా మంచినీరు, ఓఆర్ఎస్ తాగాలి. ఒక వేళ నోరు ఎండుకపోవడం, దాహం వేయడం లక్షణాలు ఉంటే ఆశా కార్యకర్తను సంప్రదించాలి. ఉద యం 12 గంటల్లోపు.. సాయంత్రం 4 గంటల తర్వాత బయటకు వెళ్లి పనులు చూసుకోవాలి.

అప్రమత్తమవుతున్న వైద్య, ఆరోగ్యశాఖ...

జిల్లాల్లో వేసవి ప్రణాళిక అమలు చేయడానికి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఏటా మార్చి నెల చివరికల్లా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమ్మర్ అలర్ట్ ప్రకటించి పలు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆర్ఎల్, ఎన్ఎస్ ద్రవణాలను అందుబాటులో ఉంచాలి. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సైతం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సమ్మర్ ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలస్తోంది. పీహెచ్‌సీ నిర్వాహకులు, ఆశా కార్యకర్తలు సైతం వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

గోవిందా.. గోవిందా..

వైభవంగా నరసింహుడి రథోత్సవం

- కొమ్మాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన క్యూ లైన్‌లు

గీసుగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాల లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించడానికి ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలతో తరలి వచ్చారు. దీంతో ఆలయప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచియున్నారు. సాధారణ దర్శనానికి గంటలు సమయం పట్టింది. ప్రత్యేక, శీఘ్ర దర్శనాల క్యూ లైన్‌లు కూడా భక్తులు గంటకు పైగా వేచి ఉండి దర్శించుకున్నారు. మంగళవారం ఒక్కరోజే 20 వేల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వరావు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ మహేందర్, ఎస్‌ఐలు కుమార్, ప్రశాంత్‌బాబు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. స్వామివారిని 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మార్మోగిన గోవిందా.. నామస్మరణలు



రథంలో ఆసీనులైన ఉత్సవమూర్తులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టం ఉత్సవమూర్తుల రథోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. 25 ఫీట్లు ఎత్తులో ఉన్న రాతి చక్రరథంను రంగులు, పూలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీలక్ష్మీనరసింహస్వామిని, భూదేవి, నీలాదేవిలను పట్టువస్త్రాలతో అందంగా ముస్తాబు చేసి రథంలో కూర్చొబెట్టి ఆలయగుట్ట చుట్టు ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తులు గోవిందా నామస్మరణలు మార్మోగాయి. దివ్యతేజోవంతమైన కల్యాణమూర్తులు ఆసీనులైన రథాన్ని ఆలయం గుట్ట చుట్టూ తిప్పేందుకు భక్తులు పోటీపడ్డారు. రథ ప్రదక్షణలో కోలాట బృందాలు, యక్షగానం ప్రత్యేక ఆకర్షణగా నాలిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, ఫణీంద్ర, విష్ణు, ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఉగాది వరకు జాతర కొనసాగుతుందని జాతర నిర్వహకులు తెలిపారు.

దేవాదులతో సాగునీరందిస్తాం

- పదేళ్లలో కేసీఆర్ చేసిన నిర్లక్ష్యం వల్లే నీటి ఎద్దడి
- కమీషన్ల కోసం కొత్త ప్రాజెక్టులు తెచ్చారు
- ఎన్ని నిధులైనా వెచ్చించి దేవాదులను పూర్తిచేస్తాం
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



దేవన్నపేట పంపు హౌజ్‌లో పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, చిత్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తదితరులు

హనుమకొండ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా భూములకు దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరందించి సస్యశ్యామలం చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండలోని దేవన్నపేట పంప్ హౌస్ ఫేజ్ -3 మోటార్లను ఆన్ చేసేందుకు మంగళవారం సాయంత్రం 5.10 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో దేవాదుల ప్రాజెక్టు వద్దకు వచ్చిన మంత్రులకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నీటి పారుదల శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పంప్ హౌస్ వద్దకు చేరుకున్న మంత్రులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్యాకేజీ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు పనులు 2014 వరకు జరిగాయని, ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, రాష్ట్రంలో నీటి ఎద్దడికి కారణం కేసీఆరే కారణమన్నారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలు ఎండిపోకుండా ఉండేందుకు ఫేజ్-3లో మోటార్లను ఆన్‌చేసేందుకు తాము వచ్చామన్నారు. కాగా మోటార్ల పనులు జరుగుతున్నందున ప్రస్తుతం మోటార్లు ఆన్‌చేయలేదని, అర్ధరాత్రి వరకు ఉండైనా పనులు పూర్తి కాగానే మోటార్లు ఆన్‌చేసి వెళ్తామన్నారు. దేవాదులతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ నియోజకవర్గాలకు సాగునీరు అందిస్తామన్నారు. మోటార్లు ఆన్ చేస్తే సుమారు 65 నుంచి 70వేల ఎకరాల వరకు సాగు నీరు అందించవచ్చన్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి బుధవారం రావాల్సి ఉండగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఉన్నందున మంగళవారం పంప్‌హౌస్ మోటార్లు ప్రారంభించేందుకు వచ్చినట్లు అసెంబ్లీ బడ్జెట్ సమావేశం కంటే రైతుల పంటలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చామన్నారు. 18 నెలల్లో పెండింగ్‌లో ఉన్న దేవాదుల పనులను పూర్తి చేస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌కు అసెంబ్లీని ఎదుర్కొనే దమ్ములేదని, అందుకే చర్చల సమయంలో, బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చి పోతున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కమీషన్ల కోసం శిలాఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారని, పదేళ్లలో దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని అన్నారు. బడ్జెట్ సమావేశాలకంటే రైతుల సమస్యలే ముఖ్యమని పంప్ హౌస్ పనులను పరిశీలించినట్లు తెలిపారు. నాటి ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే రైతులకు ఈ స్థితి వచ్చేది కాదన్నారు. 2004లో రూ.6వేల కోట్లతో ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.13వేల కోట్లకు కేసీఆర్ ప్రభుత్వం పెంచారని తర్వాత రూ. 18 వేల కోట్లకు పెరిగిందని దీనికి కారణం కేసీఆరేనని విమర్శించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో దేవాదుల పంప్ హౌస్ పనులు వేగవంతంగా పూర్తి చేసినట్లు దీంతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంతోపాటు పాలకుర్తి, జనగామ నియోజక వర్గాల్లోని రైతులకు సాగు నీరు అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మించకుండా నిర్వీర్యం చేసిందని, కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతుల కోసం సమీక్ష సమావేశం నిర్వహించి అవసరమైన నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టు పూర్తి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యతో ట్రయల్ రన్ ఆలస్యం

సాంకేతిక సమస్య కారణంగా హనుమకొండలోని దేవన్నపేట పంప్ హౌస్ ఫేజ్-3 ట్రయల్ రన్ ఆలస్యమైంది. దీంతో తాము రాత్రి ఎంత ఆలస్యమైనా ఉండి మోటార్లను ఆన్‌చేసి వెళ్తామని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆస్ట్రియ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం మరమ్మతు పనులను కొనసాగిస్తుండగా.. మరమ్మతులు మరో నాలుగు గంటల్లో వాటిని పూర్తి చేస్తామని సాయంత్రం వారు చెప్పడంతో పనులు పూర్తయ్యేవరకు నిట్ గెస్ట్ హౌస్‌లో ఉండి మోటార్లు ఆన్‌చేసి వేళ్తామని మంత్రులు తెలిపారు.

మంత్రుల పర్యటనలో ఆకస్మిక మార్పులు

దేవాదుల ప్యాకేజీ ఫేజ్ -3 పంప్ హౌస్ పనులు పూర్తి కాకుండానే మంత్రులు మోటార్ల ప్రారంభానికి రావడం గమనార్హం. పనులు పూర్తికాకపోవడంతో మోటార్లు ఆన్‌చేయకుండానే పూజలు నిర్వహించిన మంత్రులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వాస్తవానికి బుధవారం మోటార్లు ఆన్ చేస్తామని ప్రకటించగా.. అసెంబ్లీ సమావేశాల కారణంగా పర్యటనలో ఆకస్మికంగా మార్పులు చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమ షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే హడావుడిగా మంత్రుల పర్యటన ఖరారవడంతో అధికారులు, పోలీసు సిబ్బంది కొంత ఇబ్బంది పడ్డారు.

డీలిమి'టెన్షన్'!

(5వ పేజీ తరువాయి)

పది లక్షకు పైగా ఉంది. ఈ లెక్కన చుట్టు పక్కల మండలాలను కలుపుకుని నాలుగు నియోజకవర్గాలు ఇక్కడే ఏర్పడే అవకాశం ఉంది. అంటే వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమతో పాటు వరంగల్ సెంట్రల్ నియోజకవర్గం ఏర్పాటు చేసే ఛాన్స్ ఉందనే చర్చ ఉంది. అలాగే హసన్‌పర్తి కేంద్రంగా హసన్‌పర్తి, కమలాపూర్, ఎలుకతుర్తి, భీందేవరపల్లి, ధర్మసాగర్, వేలేరు మండలాలతో కలిపి మరో కొత్త నియోజకవర్గం ఏర్పడేందుకు అవకాశం ఉంది. అలాగే ఈ నాలుగుతో పాటు పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలు వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోకి రానున్నాయి. మొత్తం ఏడు నియోజకవర్గాలు ఈ రెండు జిల్లాల పరిధిలో ఏర్పడే అవకాశం ఉంది. ఇక మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలుండగా.. ఇక్కడ తొర్రూరు లేదా కేసముద్రం కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పడవచ్చునని అంచనాలున్నాయి. కాదంటే మహబూబాబాద్ రూరల్ పేరుతో నియోజకవర్గ కేంద్రం ఏర్పాటుకు ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఏటూరునాగారం కేంద్రంగా కొత్తగా మరో నియోజకవర్గం ఏర్పాటు కానుందనే ప్రచారం జరుగుతోంది. అలాంటప్పుడు ములుగు నియోజకవర్గం పరిధిలో ఏయే మండలాలను చేర్చుతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని కొన్ని మండలాలను ములుగులో కలపొచ్చనే చర్చ ఉండగా.. భూపాలపల్లి జిల్లా కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో లక్ష యాభై వేల జనాభా ఉంది. చుట్టు పక్కల ఉన్న మరో ఒకటిరెండు మండలాలను కలిపి కాళేశ్వరం కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటుకు అవకాశం ఉందని సమాచారం. మొత్తంగా నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరగటం ఖాయంగా కనిపిస్తుండగా.. ఇప్పుడున్నట్లుగానే మండలాలు ఉంటే.. ఒకే జిల్లా పరిధిలో ఒక నియోజకవర్గం ఉండటం మాత్రం సాధ్యం కాకపోవచ్చునని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలో 4,16,763 మంది జనాభా ఉంది. ఒక నియోజకవర్గానికి కావాల్సిన జనాభాకంటే 1,86,699మంది జనాభా ఎక్కువగా ఉంది. అంటే మరో జిల్లాలోని నియోజకవర్గంలో ఈ జనాభాను కలపటం లేదంటే.. పొరుగు జిల్లాలోని ఒకటిరెండు మండలాలను కలిపి రెండో నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒకే జిల్లాలో ఒకే నియోజకవర్గం ఏర్పాటు చేయటం సాధ్యం కాదని, నియోజకవర్గాల ఆధారంగా జిల్లా సరిహద్దుల్లో మార్పు చేయాల్సి వస్తుందనే చర్చ జరుగుతోంది.

రిజర్వేషన్లలోనూ మార్పులకు ఛాన్స్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, వీటిలో ములుగు, మహబూబాబాద్, డోర్నకల్ ఎస్టీ రిజర్వుడు కాగా, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట ఎస్సీ రిజర్వుడు స్థానాలు. విగతా ఏడు జనరల్‌గా కొనసాగుతున్నాయి. అ యితే కొత్తగా నాలుగైదు స్థానాలు పెరుగుతుండటం తో మరొక రిజర్వుడు స్థానం పెరిగే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న రిజర్వుడు స్థానాల్లో కూడా మార్పులు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. అలాగే మహిళలకు 33శాతం రిజర్వేషన్ కూడా 2028 నుంచి అమలు చేస్తే ఐదారు స్థానాలు మహిళలకు రిజర్వుడు కానున్నాయి.

ఆశావహుల్లో.. అ'టెన్షన్'..

కొత్తగా అసెంబ్లీ స్థానాలు పెరుగుతుండటం, రిజర్వేషన్ల మార్పులు జరుగుతాయనే ప్రచారంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రధానంగా మహిళ రిజర్వేషన్లు అమలు చేస్తే తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోననే టెన్షన్‌లో కొందరు తాజా, మాజీ ఎమ్మెల్యేలున్నారు. ఇప్పటికే ఓ మాజీ తనతో పాటు తన సతీమణి కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని సన్నిహితుల వద్ద చెప్పుకొంటున్నారు. అలాగే తనకు కాకుంటే తన సతీమణిని బరిలో దించుతానని ఓ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఇప్పటికే క్యాడర్‌కు సంకేతాలు పంపిస్తున్నారట. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు ఇప్పటికే తన వారసులను తెరపైకి తీసుకొస్తున్నారు. వీరితో పాటు రాజకీయాల్లో అడుగుపెట్టి ఒక్క ఛాన్స్ కోసం ఎదురు చూస్తున్న నేతలు కూడా డిలిమిటేషన్‌పై ఆసక్తితో ఉన్నారు. అలాగే రాజకీయాలపై ఆసక్తి ఉన్న పలువురు ఇప్పుడిప్పుడే తమతమ కార్యాచరణను రూపొందించుకుంటూ.. పునర్విభజన జరగనున్న తీరును నిశితంగా గమనిస్తూ.. తమ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నట్టు సమాచారం. 2026లో ఈ డిలిమిటేషన్‌ను ప్రారంభించి, 2028లోపు పూర్తి చేయనున్నారు. దీంతో నియోజకవర్గాల పునర్విభజన ఎవరికి కలిసి వస్తుందో.. ఎవరికి అవకాశాలను దూరం చేస్తుందో అనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా సాగుతోంది.

మేడారానికి ప్రత్యేక నిధులు!

- రూ.50కోట్ల మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం
- శాశ్వత అభివృద్ధి పనులకు మరింత చేయూత
- మెరుగు పడనున్న భక్తుల సౌకర్యాలు



మహాజాతర సమయంలో మేడారం వ్యూ

తాడ్వాయి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరు ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ ఆలయాల జాబితాలో ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల దేవస్థానం కూడా ఉండగా.. సుమారు రూ.50 కోట్లు మంజూరుకు సర్వం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ నిధులతో వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. ప్రతీ రెండేళ్ళకోసారి జరిగే మహా జాతర, మరుసటి సంవత్సరం జరిగే మినీ జాతరలకు వివిధ రాష్ట్రల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలొస్తుంటారు. జాతరల నిర్వహణకు ప్రభుత్వం రూ.కోట్లలో ఖర్చు చేసి మౌలికసదుపాయాలు ఏర్పాటు చేస్తోంది. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో ఇవ్వబోతున్న రూ.50కోట్ల ప్రత్యేక నిధులతో ఇప్పటికే ప్రతిపాదించిన శాశ్వత పనులకు మరింత చేయూత దక్కనున్నట్టు తెలుస్తోంది. పక్క ప్రణాళికలతో రోడ్ల విస్తరణ, దేవస్థానం విస్తరణ, అతిథి గృహాల ఏర్పాటు, క్యూలైన్లలో కనీస సౌకర్యాలు మరుగుదొడ్లు, తాగునీరు, విశ్రాంతి గదులు వంటి ఏర్పాట్లకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ట్రాఫిక్ జామ్ లేకుండా రోడ్ల విస్తరణ

మేడారం మహాజాతరకు లక్షల సంఖ్యలో తరలివచ్చే వాహనాలను ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు మూడు కిలో మీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేస్తున్నారు. జంపన్న వాగుకు ముందుగానే ఊరట్టం క్రాస్ వద్ద వాహనాలు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు తరలించి కాలినడకన భక్తులు గద్దెలకు చేరుకుంటారు. కాగా జంపన్నవాగు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు మినీ జాతర సమయంలో పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, అటవి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖా తెలిపారు. మేడారం వచ్చే భక్తులకు దేవస్థానం సమీపంలో వాహనం వచ్చేలా అధికారులు ప్రణాళికలతో పనులు చేపట్టనున్నారు.

గద్దెల విస్తరణ

మేడారం మహాజాతరకు కోటికి పైగా తరలివచ్చే భక్తులు గద్దెల పరిసరాల్లో రద్దీ అధికంగా ఉంటుందని గద్దెల విస్తరణ చేపట్టాలని గతంలో పలుసార్లు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కాగా జాతర సమయంలో పనులు సాధ్యం కాకపోవడంతో పనులు వాయిదాపడుతూ వచ్చాయి. 2026 మహాజాతర లోగా శాస్వత ప్రతిపాదికన పనులు చేపట్టి జాతర నిర్వహణ పనులతో చేపట్టాలనే ప్రభుత్వ లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో 19.20ఎకరాల భూమిని సేకరించి దేవస్థానం విస్తరణ పనులు చేపట్టనున్నట్లు సమాచారం. అదేవిధంగా విఐపీలు, వివిఐపీలు, ప్రోటోకాల్ దర్శనాలు, ప్రత్యేక అతిథులకు వసతి, విశ్రాంతి సౌకర్యాల కోసం అతిథి భవనాలు ఏర్పాటు చేయడం భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించే పనులు చేపట్టనున్నారు.

క్యూ లైన్లలో మౌలిక సదుపాయాలు

మహాజాతర సమయంలో రూ.కోట్లలో తరలివచ్చే భక్తులు రెండు ధర్మదర్శనాల క్యూలైన్ల నుంచి గద్దెలకు చేరుకుంటారు. ఒకటిన్నర కిలో మీటర్లకు పైగా ఉన్న క్యూలైన్ల ద్వారా గంటల సమయంలో భక్తులు ఎత్తు బంగారం మోస్తూ భక్తి శ్రద్ధలతో సమ్మక్క సారలమ్మల గద్దెలకు చేరుకుంటారు. అయితే క్యూ లైన్ల పై షెడ్ల నిర్మాణం చేపట్టి సీలింగ్ ప్యాన్‌లు, త్రాగునీరు వసతులు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు ఏర్పాట్లతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. జాతర సమయంలో విఐపి, వివిఐపి, ప్రోటోకాల్, అతిథుల దర్శనాలతో సాదరణ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం.

పూజారుల హర్షం

మేడారం దేవస్థాన అభివృద్ధికి రూ.50కోట్ల ప్రత్యేక నిధులు మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం పట్ల వనదేవతల పూజారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముస్ముందు జాతీయ హోదా వస్తే మేడారంలో సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో ప్రచారం జరుగుతుందని సమ్మక్క సారలమ్మల జాతరకు మరింత పేరు ప్రఖ్యాతలు దక్కాలని ఆకాంక్షించారు. దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి ఉంటుందని అన్నారు.

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య కోరారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో ఉన్న జిల్లా ఖజానా కార్యాలయం ప్రాంగణం వద్ద మంగళవారం తలసేమియా బాధితుల కోసం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా ఖజానా కార్యాలయ అధికారి ఆకవరం శ్రీనివాస్‌కుమార్, డీఆర్‌డీఓ మేన శ్రీనుతో పాటు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెద్ది వెంకటనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వ్యవస్థను కాపాడేది రాజ్యాంగమే..

(5వ పేజీ తరువాయి)

చేయాలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వాన్ని పాటించాలన్నారు. పాలకులు రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలని చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ.. భిన్న సంస్కృతి, ఆచార వ్యవహారాలు కల్గిన దేశంలో సెక్యులర్ భావాలను కాపాడుకోవాలన్నారు. వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగ హక్కులు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. సెక్యులర్ వ్యవస్థతో పాటు భావాలకు రాజ్యాంగం కీలక భూమికగా నిలుస్తోందన్నారు. కేయూ మాజీ రిజిస్ట్రార్ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో విలువలు మృగ్యంగా మారాయని ఆందోళన వెలిబుచ్చారు. ప్రజలందరూ ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ఆలోచనలు చేయాలని అన్నారు. సదస్సు ఉద్దేశ్యాలు, లక్ష్యాలను సదస్సు డైరెక్టర్‌గా తుమ్మల రాజమణి తెలిపారు. సదస్సు సందర్భంగా వెలువరించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఓయూ రిటైర్డు ప్రొఫెసర్ ద్వారకనాథ్, కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, బి. రమ, చిర్ర రాజుగౌడ్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, డీన్లు గాదె సమ్మయ్య, ఎం. శ్రీనివాస్, అకూట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, ఎల్‌పీ రాజ్‌కుమార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ వీరన్ననాయక్, మామిడి లింగయ్య, సంకినేని వెంకట్, డాక్టర్ మంద వీరస్వామి, పాలమాకుల కొమురయ్య, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు



సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నేతలు

రెడ్డికాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ నేతలను మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకొని సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కంజర్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్యమాలకు గుండెకాయ లాంటి ఓయూలో ధర్నాలు, రాస్తారోకో, ర్యాలీలను నిషేధించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉస్మానియా విద్యార్థుల పోరాట, ప్రాణత్యాగాలతోనే తెలంగాణ సాధించుకున్నామన్నారు. అలాంటి ఓయూలో ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమన్నారు. అరెస్టు అయిన వారిలో టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నేతలు డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, జోరిక రమేశ్, రామ్మూర్తి, మాచర్ల శరత్‌చంద్ర, గంద్రతి రాకేశ్ యాదవ్, బండి రజనీ కుమార్ ఉన్నారు.

సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌కు అభినందనల వెల్లువ



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రిటైర్డ్ పోలీసు అసోసియేషన్ నాయకులు

వరంగల్ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సన్‌ప్రీత్‌సింగ్‌ను వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు ఎస్. రాజు, ఎల్. రాజులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రిటైర్డ్ పోలీస్ సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ పులి వీరారెడ్డి, జనరల్ సెక్రటరీ ఎండీ. మస్తాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నన్నపు సంజీవరావు, సెక్రెటరీ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ మాజీ పోలీసు బలగాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ కేంద్ర సాయుధ పోలీసు బలగాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీపీని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌నాథ్, జనరల్ సెక్రటరీ ఎలిగేటి శ్రీనువాస్, కోశాధికారి కిషోర్, వంగారి రాజేశ్, రాతిపెల్లి రాజు, కందిక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన మునిసిపల్ కమిషనర్

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : సీపీని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో మర్యాపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పెంచిన జీతాలు అమలు చేయాలి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ బడ్జెట్‌లో బల్దియా కార్మి కులకు గతంలో పెంచిన జీతాలు వెంటనే అందించాలని సీఐటీయూ వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెంచిన వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు జన్ను ప్రకాశ్, మహేశ్, సింగారపు బాబురావు సంయుక్తంగా మాట్లాడారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు వారి ఆరోగ్యాలను ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం కార్మికులకు రూ. 16,600 వేతనం వస్తుందని గతంలో పెంచిన అదనపు వేతనాన్ని అందించాలన్నారు. అనంతరం సీఎంహెడ్‌వో రాజారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాప బాబు, కృష్ణ, భిక్షపతి, జీవన్, సువర్ణ, శ్రీలత, రాధికతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను పీల్చేస్తున్నారు !

- సినిమా థియేటర్లలో ఇష్టారాజ్యంగా ధరలు
- టికెట్ రేట్లను మించిపోతున్న తినుబండారాల ఖర్చు
- చుక్కలు చూపిస్తున్న స్నాక్స్, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ రేట్లు
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు

మట్టెవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో మల్టీప్లెక్స్, సినిమా థియేటర్లలో తినుబండారాల ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. స్నాక్స్, వాటల్ బాటిల్స్, క్రూల్ డింక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సినిమా టికెట్ల కంటే పాప్‌కార్న్, చిప్స్, క్రూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్‌కే ఎక్కువ ఖర్చు చేయాల్సివస్తోంది. దీన్ని కట్టడి చేయాల్సిన తూనికలు కొలతల శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీంతో థియేటర్ల యాజమానులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతూ ప్రేక్షకులను నిలువుదోపిడీ చేస్తున్నారు.

సినిమాకెళితే జేబు గుల్ల..

ఒక కుటుంబం థియేటర్‌లో సినిమా చూడలంటే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో సామాన్య ప్రజలు టాకీస్‌లకు వెళ్లాలంటే భయపడుతున్నారు. స్నాక్స్, కూల్‌డ్రింక్స్ వాటర్ బాటిల్స్ బయట మార్కెట్ రేటు కంటే 2 నుంచి 3 రెట్లు పెంచి విక్రయిస్తున్నారు. రెండున్నర గంటల సినిమా చూసేందుకు ఎంత టికెట్ ఖర్చు పెడతామో.. కొద్దిపాటి విరామ సమయంలో అంతకు మించి ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రేక్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారు నిర్ణయించిందే ధర..

చట్టానికి విరుద్ధంగా థియేటర్లలో తినుబండారాల విక్రయాలు సాగుతున్నాయి. నిర్దేశించిన ధరలకే అన్ని రకాల ఆహార పదార్థాలు విక్రయించాలన్న ప్రభుత్వ ఆదేశాలు కాగితాలకే పరిమితమవుతు న్నాయి. వాటర్ బాటిల్స్‌తో పాటు ఇతర తినుబండారాలపై ఇష్టారీతిన ధరల స్టిక్కర్లు వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఐఎస్ఐ బ్రాండ్ వాటర్ బాటిల్ ధర మార్కెట్‌లో రూ.20 ఉంటే.. మల్టీప్లెక్స్ థియేటర్లతో రూ.40 నుంచి రూ.70లకు అమ్ముతున్నారు. క్రూల్‌డ్రింక్స్ రూ.100 ఉంటే థియేటర్లలో రూ. 240 నుంచి 270 వరకు అమ్ముతున్నారు. ఎగ్‌పఫ్స్ బయట రూ.20కి విక్రయిస్తే థియేటర్లలో రూ.50 నుంచి 60లు, సమోస మార్కెట్‌లో రూ.10అయితే థియేటర్లలో రూ.40కి విక్రయిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

వాస్తవానికి వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ నిర్ణీత ధరలకు విక్రయించాలి. తినుబండారాలు అందించే కంటైనర్లపై బరువు, పరిమాణం, తయారీ గడువు తేదీలతో పాటు ఎమ్మార్పీ స్పష్టంగా కనిపించేలా స్టిక్కర్ ఉండాలి. కాని థియేటర్ల యజమానులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఒకే బ్రాండ్ కాకుండా వివిధ బ్రాండ్‌ల తినుబండారాలను అందుబాటులో ఉంచాలి. ప్యాకేజ్డ్ రూపంలో ఉన్న వస్తువులపై తయారుదారు పూర్తి చిరునామా, వస్తువు పేరు, తయారు తేదీ, నికర బరువు, ఎమ్మార్పీ, తయారుదారు, కస్టమర్ కేర్ వివరాలు ఉండాలి. ఎమ్మార్పీ ఉన్న ఫుడ్స్ మాత్రమే విక్రయించాలి. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబరు, వాట్సాప్ నెంబర్లను ప్రదర్శించాలి.



పాప్‌కార్న్ బహిరంగంగా రూ. 30కి లభిస్తే సినిమా థియేటర్లలో 330 నుంచి 500 వరకు విక్రయిస్తున్నారు. ప్యాకేజీ ఫుడ్ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ దోపిడీని అరికట్టాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్రేక్షత పాత్ర పోషించడం విస్మయానికి గురిచేస్తోంది.

థియేటర్లలో స్నాక్స్ రేట్లు

ఐటెమ్ పేరు	మార్కెట్ రేటు	థియేటర్లలో
వాటర్ బాటిల్	రూ.20	రూ.40 నుంచి రూ.70
క్రూల్‌డ్రింక్స్	రూ.100	రూ.240 నుంచి 270
ఎగ్ పఫ్స్	రూ.20	రూ.50 నుంచి 60
సమోస	రూ.10	రూ.40
పాప్‌కార్న్	రూ.30	రూ.330 నుంచి 500

ఘనంగా ముగిసిన ఎర్రగట్టు వెంకన్న జాతర



స్వామి వారికి పూజలు చేస్తున్న పూజారి, భక్తులు

- ఇరు గ్రామాలకు తరలిన ఉత్సవమూర్తులు
- హసన్‌పర్తి, భీమారం ఆలయాల్లో కొలువు

హసన్‌పర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి, భీమారం గ్రామాల ఉమ్మడి జాతర ఎర్రగట్టు వెంకన్న జాతర మంగళవారంతో ముగిసింది. ఈనెల 14 నుంచి 18 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా మొదటి రోజు శుక్రవారం శ్రీవారి కల్యాణంతో ప్రారంభమై రెండో రోజు చిన్న రథచక్రాల బండ్ల ప్రదిక్షణ, మూడో రోజు విశేషపూజ, కుంకుమార్చనలు, హారతి, ప్రసాద వినియోగము, నాల్గవ రోజు స్వామివారికి క్షీరాభిషేకం, ఐదో రోజు శ్రీఅలివేలు, మంగమ్మ, పద్మావతి సమేత శ్రీనివాసుడి ఉత్సవ మూర్తులను పెద్ద రథచక్రాల బండి మీద హసన్‌పర్తికి, చిన్న రథచక్రాల బండి మీద భీమారంనకు ఊరేగింపుగా ఆయా గ్రామాల ఆలయాలకు చేర్చడంతో ఎర్రగట్టు వెంకన్న ఉమ్మడి గ్రామాల జాతర ముగిసింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు శ్రీఅలివేలుమంగమ్మ పద్మావతి సమేత శ్రీనివాసుడి ఉత్సవమూర్తులకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకట్రావ్, ఆలయ అర్చకులు వేదాం తం పార్థసారధాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు, ఎర్రగట్టు జాతర ఉత్సవ కమిటీ ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, శీలం రమేష్, కనపర్తి రాజు, పోలరాజు శ్యామల, చింతల రమేష్, బిగుళ్ల సురేష్, మానుపాటి విజేందర్, శాగంటి సదానందం, తోట శ్రీనివాస్, కొండమీది సంతోష్, అటికం శ్రీనాథ్ గౌడ్, సంగాల ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండ జడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవం

మడికొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని జడ్పీ పాఠశాల వార్షికోత్సవం హెచ్ఎం సంధ్యారాణి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి కోరుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో బి. మనోజ్ కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎర్రగట్టుస్వామి, రిటైర్డ్ లెక్చరర్, స్కూల్ అడ్వైజర్ పుల్యా నాయక్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు సీఐటీడీ శిక్షణను ఉపయోగించుకోవాలి

కేయూ కో ఎడ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ రమణ

కేయూ క్యాంపస్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్. రమణ సూచించారు. మంగళవారం కేయూ కో ఎడ్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఐటీడీ ఆరు వారాల పైథాన్, ఆటో క్యాడ్ కోర్సులపై విద్యార్థులకు నిర్వహించిన నైపుణ్యాల శిక్షణ ఇచ్చారు. శిక్షణ ఫిబ్రవరి 5 నుంచి మార్చి 18 వరకు కళాశాలలో నిర్వహించారు. సీఐటీడీ హైదరాబాద్ డైరెక్టర్ ఉదయ్‌భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సీఐటీడీ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని చెప్పారు. సమావేశంలో ఐసీటీడీ ట్రైనర్లు లలిత్, అశోక్ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. సమావేశంలో కార్యక్రమ సమన్వయకర్తలు లక్ష్మణ్‌నాయక్, దయాకర్, రమణబాబు, ఆర్‌డీ ప్రసాద్, డాక్టర్ ఎ.కుమారస్వామి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

రెవెన్యూ జిల్లా అధికారి విజయలక్ష్మి

వరంగల్ మెడికల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల ఆరోగ్యం కోసం వైద్యులు అంకితభావంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి అన్నారు. వరంగల్ ఎంజీఎం పిల్లలవార్డు నవజాత శిశువుల ఆరోగ్యం కోసం బిలియన్ హార్ట్ బీటింగ్ ఫౌండేషన్ అందజేసిన రేడియంట్ వర్మర్స్, ఫొటో థెరపి యంత్ర పరికరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, పిల్లల విభాగం అధిపతి డాక్టర్ అపర్ణ, ప్రొఫెసర్ అలివేలు, ఆర్ఎంవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

వడ్డెపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) అనుబంధ సంఘం తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్టుల అవార్డుల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా వరంగల్ జిల్లాలోని ఫొటో జర్నలిస్టులు వీరగోని హరీష్, గొట్టె వెంకన్న, దాసరి శ్రీనివాసులు అవార్డులను అందుకున్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు బుడిగె శ్రీను, యాంసాని శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు గుంటి విద్యాసాగర్ తదితరులు మెమెంటోలు అందజేసి శాలువాలు కప్పి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, ఫొటో జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, కె. నరహరిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఫొటో జర్నలిస్టులను సన్మానిస్తున్న ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఒకటిన్నర సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల బిల్లులను వెంటనే చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిర్వహించిన వరంగల్ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో లింగారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరాలు అయినా గత ప్రభుత్వం మాదిరిగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అయిదు డీఏ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పదవీ విరమణ పొందిన వారికి ఇప్పటికి బెనిఫిట్స్ రావడం లేదన్నారు. పీఆర్సీ గడువు జూలై 2023తో ముగిసిందని, ఇప్పటికైనా నివేదికను తెప్పించుకొని వేతనాలు సవరించాలన్నారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ. గోవిందరావు అధ్యక్షతన జరిగిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ఎం. గంగాధర్, పి.సుదర్శన్‌రెడ్డి, డి. రవీందర్, కె. నర్సింహులు, కొమ్మయ్య, రామస్వామి, సదానందం, అరుణాదేవి, రామిరెడ్డి, మహేందర్‌రెడ్డి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం నిరంతర పోరాటం

ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్



నినాదాలు చేస్తున్న ఎంహెచ్‌పీఎస్ నాయకులు

వడ్డెపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాదిగల హక్కుల కోసం నిరంతరం పోరాడడమే తమ సంస్థ లక్ష్యమని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని గౌతమ బుద్ధుడి విగ్రహం కూడలిలో ఎంహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైస ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ రిజర్వేషన్ల ప్రకారం మాదిగలకు వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు అనుకూలంగా ప్రత్యేక సీట్లు కేటాయించాలని కోరారు. మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి అనుకూల ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు గజ్జెల మల్లేష్, పుల్ల రమేష్, అవినాష్, కందుకూరి ప్రభాకర్, మంద ఆరోగ్యం, చిలుముల్ల రాజు, బరిగెల బాబు, బాషపాక రవి పాల్గొన్నారు.

మాదిగల అభ్యున్నతే మంద కృష్ణ లక్ష్యం

టీ-ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి

వడ్డెపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాదిగల అభ్యున్నతే ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ లక్ష్యమని తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల హక్కుల పరిరక్షణ కోసం, ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్న మంద కృష్ణ మాదిగను మాదిగ సమాజంలోని కొందరు ఇతర రాజకీయ పార్టీలకు వంత పాడుతూ మంద కృష్ణను విమర్శిస్తున్నారని అన్నారు. మంద కృష్ణను విమర్శించే వారంతా మాదిగ ద్రోహులేనని భిక్షపతి మాదిగ హెచ్చరించారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ జాక్ గౌరవ అధ్యక్షుడు ఎ. ధర్మరాజు, తెలంగాణ ఎమ్మార్పీఎస్ నేతలు మున్నంగి రఘు, వై. మూర్తిరాజు, బొక్క ఏలియా, డెంగూ దామోదర్, కట్ల స్వామి, శ్యామ్, రాజు, ప్రభాకర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

మోదీ విద్యా సంస్కరణలు దేశానికి ప్రమాదకరం

రిటైర్డు ప్రొఫెసర్ వి నాయకరెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్రమోదీ తెస్తున్న విద్యా సంస్కరణలు దేశానికి ప్రమాదకరమని కేయూ రిటైర్డు ప్రొఫెసర్ ఎ.వినాయకరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కేయూ కామర్స్ సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ తెలంగాణ కమిటీ నేతృత్వంలో సదస్సు జరిగింది. యూజీసీ నూతన ముసాయిదాతో వర్సిటీలు ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నాలు అనే అంశంపై జరిగిన సదస్సుకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వినాయకరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం సూచనల మేరకు కేంద్రం విద్యపై కేంద్రం పెత్తనం తగదన్నారు. మతోన్మాదం, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోదీ విద్యలో సంస్కరణలు తెస్తున్నారని మండిపడ్డారు. గవర్నర్లకు వీసీల నియామకం చేసే అధికారం లేదన్నారు. అదాని, అంబానీలతో పాటు కార్పొరేట్ పెట్టుబడిదారులకు వర్సిటీలకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ చర్యలతో వర్సిటీల మనుగడ, స్వయం ప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారుతోందని చెప్పారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోల మాట్లాడుతూ.. మనువాద రాజ్యస్థాపనకు బీజేపీ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు విద్య, ఉద్యోగాల అవకాశాలను దూరం చేస్తున్నారని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహరావు, భాస్కర్, ఎర్ర అఖిల్, నరేందర్, సాయి, సహాయ కార్యదర్శులు వెంకటేశ్, సంధ్య, రాకేశ్, కోశాధికారి మహేందర్ మాట్లాడారు. సదస్సులో భాగంగా కేయూలో విద్యార్థులు ప్రదర్శనలు చేపట్టారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సదస్సులో పీడీఎస్‌యూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేశ్, పి. అనూష, కేయూ అధ్యక్ష కార్యదర్శులు బి. బాలకృష్ణ, వి. కావ్య, గణేశ్, యాదగిరి, వంశీ, వినయ్, శ్రీజ, సాధన, మల్లేశ్, చారి, పెరియార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కేయూలో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థులు

చల్లటి నీళ్లు తాగవచ్చా..?

వేసవి వచ్చేసింది. మధ్యాహ్నం బయటకు వెళ్తే ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో చల్లటి నీళ్లు తాగితే ప్రాణం లేచి వస్తుంది. అయితే రిఫ్రిజిరేటర్ నుంచి తీసిన చల్లటి నీళ్లను తాగవద్దని.. తాగితే ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వెనకున్న కారణాలు వివరిస్తున్నారు.

- ఎండ వేడికి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శరీరంలో నీటి శాతం తగ్గి దాహంగా అనిపిస్తుంది. అలాంటి సమయంలో బాగా చల్లగా ఉన్న నీళ్ల తాగితే వాటిని శరీరం శోషించలేదు. దీని వల్ల తలనొప్పి, మూత్రం రాకపోవడం, అలసట, కండరాల తిమ్మిరి లాంటి సమస్యలు ఏర్పడతాయి. అందువల్ల బాగా దాహంగా ఉన్న సమయంలో మామూలు నీళ్ల లేదా కుండలోని నీళ్ల తాగడం మంచిది.
- బాగా చల్లగా ఉన్న నీళ్ల తాగడం వల్ల జీర్ణాశయం పనితీరు మందగిస్తుంది. తిన్న ఆహారపదార్థాలు త్వరగా జీర్ణం కావు. దీంతో అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలు ఏర్పడతాయి.



- బాగా చల్లగా ఉన్న నీళ్ల తాగడం వల్ల శ్వాసకోశంలోని రక్తనాళాలు సంకోచిస్తాయి. దీంతో ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలు ఏర్పడతాయి. అందుకే ఎండలో తిరిగి ఇంటికి రాగానే చల్లటి నీళ్ల తాగితే వెంటనే జలుబు చేయడం, గొంతు మంట లాంటివి గమనించవచ్చు. ఎక్కువ సార్లు ఈ నీళ్ల తాగితే ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుని ముక్కు దిబ్బడ, పొడిదగ్గు వేధిస్తాయి.
- దాహం అనిపించినప్పుడు బాగా చల్లగా ఉన్న నీళ్ల తాగితే నాడీ వ్యవస్థ ప్రభావితమవుతుంది. దీని వల్ల దంతాలపై ఉండే ఎనామిల్ పొర, చిగుళ్లలో ఉండే సున్నితమైన నరాలు దెబ్బతిని పళ్లు జివ్వుమంటాయి.

బహుముఖ ప్రతిభ



లక్ష్యం పట్ల నిబద్ధత, చక్కటి ప్రణాళిక ఉంటే అభిరుచులు కొనసాగిస్తూనే... చదువులో, పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు అందుకోవడం సాధ్యమేనంటున్నారు ప్రతిభా శేఖర్. కవిత్వం, యాంకరింగ్, ఫిలిమ్‌మేకింగ్, ఫొటోగ్రఫీ... ఇలా అనేక అంశాల్లో రాణిస్తున్న ఆమె ఎక్కడా శిక్షణ తీసుకోకుండా, స్వయం సన్నద్ధతతోనే గ్రూప్-1లో మంచి స్కోర్ సాధించారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, ప్రకృతిని ఆస్వాదించడం ఇష్టమంటున్న ప్రతిభ 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి...

"మా నాన్న శేఖర్... ఎల్ఐసిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్. అమ్మ సుజాత తెలంగాణ ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా పని చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్నత స్థానాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వారిద్దరినీ చూశాక.. పబ్లిక్ సర్వెంట్ కావాలన్న కోరిక నాకు చిన్న వయసులోనే కలిగింది. అదే లక్ష్యంగా నిర్దేశించుకున్నాను. 'నిట్- వరంగల్‌'లో బీటెక్ చేశాను. నాలుగేళ్ళ క్రితం నుంచి యుపిఎస్‌సికి ప్రిపేర్ కావడం ప్రారంభించాను. ఆ తరువాత తెలంగాణ గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో... దానికీ సన్నద్ధమయ్యాను. అందుకోసం నేను ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. 'ఎలా చదవాలి? ఏది ఎప్పుడు చదవాలి?' అని కచ్చితంగా ప్రణాళిక వేసుకొని, దాన్నే అనుసరించాను. తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్, మా కుటుంబానికి సన్నిహితుడు మామిడి హరికృష్ణగారు నాకు మెంటార్‌గా వ్యవహరించారు. ప్రశ్నలకు నేను రాసిన జవాబులను ఆయన మూల్యాంకన చేసేవారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో నాకు 483.5 స్కోర్ వచ్చింది.

ఒత్తిడి తగ్గాలంటే...

సొంతంగా ప్రిపేర్ కావడం చాలా కష్టమని చాలామంది అనుకుంటారు. సరైన ప్రణాళిక ఉంటే అది ఏమాత్రం ఇబ్బంది కాదు. సాధారణ రోజుల్లో నాలుగైదు గంటలు చదివేదాన్ని. పరీక్షలు దగ్గరవుతున్నప్పుడు... నాలుగు నెలలపాటు ఏడెనిమిది గంటలు చదివాను. అలాగని పూర్తిగా దానికే అంకితం అయిపోలేదు. పెద్ద పరీక్షలకు సన్నద్ధం అవుతున్నప్పుడు సహజంగానే ఒత్తిడి ఉంటుంది. ఖాళీలు వందల్లో ఉంటే... పోటీపడేవారు లక్షల్లో ఉంటారు. పెద్ద లక్ష్యాల వెనుక పరిగెడుతున్నప్పుడు... మానసిక ఆరోగ్యం మీద కూడా ఆ ప్రభావం ఉంటుంది. ఇతర యాక్టివిటీస్ ద్వారా దాన్ని తగ్గించుకోవచ్చు. నా వరకూ నేను ట్రావెలింగ్‌ను ఇష్టపడతాను. మూడు-నాలుగు నెలలకు ఒకసారి ఏదో ఒక ప్రదేశానికి వెళ్తాను. లద్దాఖ్, కేరళ, గోవా... ఇలా చాలా ప్రదేశాలను చూశాను. వీటిలో లద్దాఖ్ నాకు బాగా నచ్చిన ప్రదేశం. అక్కడ జనాభా తక్కువగా ఉంటుంది, ప్రకృతి సౌందర్యంతో అలరారుతూ ఉంటుంది. టూర్లకు వెళ్ళినప్పుడు... మిగిలిన వాటి గురించి ఆలోచనలన్నీ వదిలేస్తాను. ఆ పర్యటనను ఆస్వాదించడం మీదే మనసు లగ్నం చేస్తాను. తిరిగి వచ్చాక మళ్ళీ పనిలో పడడానికి కావలసిన ఉత్తేజాన్ని నాలో నింపుకొంటాను.

> **విజయానికి అయిదు మెట్లు**
>
> జీవితంలో ఏది సాధించాలన్నా అయిదు 'సి'లు చాలా ముఖ్యమని నేను నమ్ముతాను. వాటిలో మొదటిది కాన్ఫిడెన్స్... ఎప్పుడూ మనమీద మనకున్న నమ్మకాన్ని వదులుకోకూడదు. రెండోది కంటిన్యుటీ... అనుకున్నది సాధించేదాకా ఎన్ని అవరోధాలు ఎదురైనా దాన్ని కొనసాగించాలి. మూడోది కన్సిస్టెన్సీ... ఏ పనినైనా స్థిరత్వంతో, నిలకడగా చేయడం ముఖ్యం. నాలుగోది కర్టెసీ... అన్ని సమయాల్లో మర్యాదగా, వినయంతో నడుచుకోవడం ప్రధానం. అయిదోది కమ్యూనికేషన్... మనకి తెలిసిన విషయాన్ని, మన అభిప్రాయాన్ని స్పష్టంగా వివరించే సామర్థ్యం ఉండాలి. ఏ రంగంలోనైనా విజయానికి ఈ అయిదు అంశాలు సోపానాలవుతాయనేది నా అభిప్రాయం.



గొప్ప గౌరవంగా భావిస్తున్నా..

నేను పుట్టిందీ, పెరిగిందీ హైదరాబాద్‌లో. అన్ని విషయాల్లోనూ నన్ను ఎంతగానో నా తల్లితండ్రులు ప్రోత్సహించారు. ఇతర యాక్టివిటీస్ వల్ల పిల్లలు చదువులో వెనుకబడతారని చాలామంది తల్లితండ్రులు భావిస్తూ ఉంటారు. అది నిజం కాదు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కేవలం చదువు మాత్రమే సరిపోదు. చదువును, మన అభిరుచులను బ్యాలన్స్ చేసుకోవడం తెలిస్తే... దేన్నీ వదులుకోనక్కర్లేదు. నాకు కవిత్వం చదవడం, రాయడం ఇష్టం. దినపత్రికల్లో ప్రచురితమయ్యే కవితల్ని చదవడం ద్వారా ఈ అభిరుచి మొదలయింది. హైస్కూల్‌లో ఉన్నప్పటి నుంచే తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో కవితలు రాసేదాన్ని. కాలేజీకి వచ్చాక... అది మరింతగా పెరిగింది. నాలో కదిలే భావాలతో మలచిన హిందీ-ఉర్దూ కవితలతో 'మాన్ షాయరానే కా' అనే సంకలనాన్ని 2021లో విడుదల చేశాను. రిలాక్స్ కావాలనుకున్నప్పుడు కవితలు చదువుతాను, రాస్తాను. స్ఫూర్తిని, ప్రేరణను కలిగించే కవితలంటే ఇష్టం. ఉర్దూలో గాలిబ్, తెలుగులో శ్రీశ్రీ కవితలంటే ఇష్టం. రాబోయే రోజుల్లో మరికొన్ని కవితా సంకలనాలను తీసుకొస్తాను. ఇక, 2020లో 'నిట్- వరంగల్' యువజనోత్సవం సందర్భంగా నిర్వహించిన షార్ట్ ఫిలిమ్ మేకింగ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచాను. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ కోసం ఒక డాక్యుమెంటరీని రూపొందించాను. యాంకరింగ్ నాకు ఇష్టమైన మరో అంశం. స్కూల్లో, కాలేజీలోనే కాదు, అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు యాంకర్‌గా వ్యవహరించాను. 'తెలంగాణ బతుకమ్మ ఫిల్మోత్సవ్' పేరిట నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీలకు యాంకరింగ్ చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. పర్యటనల్లో కనిపించిన మంచి దృశ్యాలను ఫొటోలు తీయడం నాకున్న ఇంకో హాబీ. సినిమాలు సెలక్టివ్‌గా చూస్తాను. సందేశాత్మక చిత్రాలు వస్తే వదిలిపెట్టను. గ్రూప్-1లో నాకు వచ్చిన మార్కుల ప్రకారం... మంచి పోస్టింగే వస్తుందని ఆశిస్తున్నాను. రాబోయే రోజుల్లో యుపిఎస్‌సిలో ర్యాంక్ సాధించాలనేది నా లక్ష్యం. దానికోసం సిద్ధమవుతున్నాను."

• కృష్ణశర్మ

పిల్లల్ని ఇంట్లో ఒంటరిగా వదిలి వెళుతున్నారా?

ఒక్కోసారి పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి తల్లిదండ్రులు బయటికి వెళ్లాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో, ముఖ్యమైన పనుల వల్ల ఇంటికి రావడం ఆలస్యం కావచ్చు కూడా! తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులైతే ఇలాంటి సందర్భాలు తరచుగా ఎదురవుతూ ఉంటాయి. ఇలా పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్లడం వల్ల వాళ్ల స్వతంత్రంగా, బాధ్యతగా, ఆత్మవిశ్వాసంతో ఎదుగుతారని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ ఇలాంటప్పుడు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

- ప్రస్తుతం పిల్లలంతా మొబైల్స్ వాడుతున్నారు. వాటిలో అమ్మ, నాన్న ఫోన్ నెంబర్లతో పాటు దగ్గరి బంధువులు, పక్కింటివారి ఫోన్ నెంబర్లను సేవ్ చేసి పెట్టాలి. అలాగే ఈ నెంబర్లను ఓ నోట్‌బుక్‌లో రాసి పిల్లలకు అందుబాటులో ఉంచడం మంచిది. ఏదైనా అవసరం వచ్చినప్పుడు ఎవరికి ఫోన్ చేయాలో పిల్లలకు ముందుగానే చెప్పాలి. బయటికి వెళ్లిన తరవాత కనీసం అరగంటకు ఒకసారైనా పిల్లలకు ఫోన్ చేసి వాళ్ల ఎలా ఉన్నారో తెలుసుకుంటూ ఉండాలి.



- పిల్లలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఎక్కువగా టీవీ లేదా యూట్యూబ్ చూస్తూ, వీడియో గేమ్‌లు ఆడుతూ సమయం గడిపేస్తూ ఉంటారు. ఇలా ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఎక్కువగా వాడడం వల్ల వచ్చే అనర్థాల గురించి పిల్లలకు వివరించి చెప్పాలి. స్క్రీన్ టైమ్ విషయంలో కాస్త కఠినంగా వ్యవహరించడం మంచిది.
- పిల్లలు తినడానికి చిరుతిండి, అల్పాహారం లాంటివి వేర్వేరు బాక్సుల్లో సర్ది ఏది ఎప్పుడు తినాలో చెప్పాలి. గ్యాస్ స్టవ్, స్విచ్ బోర్డుల దగ్గరికి వెళ్లవద్దని చెప్పాలి. పదునైన చాకులు, కత్తెరలు పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలి.
- ఎవరైనా తలుపు తట్టినప్పుడు బయట ఎవరు ఉన్నారో తెలిసేవరకూ తలుపు తెరవవద్దని పిల్లలకు గట్టిగా చెప్పాలి. ఒకవేళ తెలిసిన వారు వచ్చినా వెంటనే అమ్మానాన్నలకు ఫోన్ చేసి తలుపు తీయాలా ?వద్దా? అనేది అడగాలని చెప్పాలి. ఇంటి ముందు సెక్యూరిటీ కెమెరా అమర్చుకుంటే తలుపు ఎవరు తట్టారో సులభంగా తెలుసుకోవచ్చు. మీరు ఇంట్లో లేని సమయంలో బంధువులు లేదా స్నేహితులను ఇంటికి రానీయకపోవడం మంచిది.

ఫ్యాషన్

మది దోచే మండల



వైవిధ్యంగా కనిపించాలనుకునే ఫ్యాషన్ ప్రియుల కోసం కొత్త కొత్త ధోరణులు పుట్టుకొస్తూనే ఉంటాయి. వాటిలో తాజాగా ఆదరణ పొందుతున్న ఫ్యాషన్ స్టైల్... 'మండల'. దీని గురించి తెలుసుకుందామా?

సంస్కృత భాషలో 'మండల' అంటే వృత్తం అని అర్థం. విశ్వం లేదా వివిధ లోకాల్లోని దేవతలను సూచించే రేఖాగణిత నమూనాలు లేదా ఆకృతులను మండల అని సంబోధిస్తారు. అయితే కంటికి ఇంపుగా కనిపించడం, వైవిధ్యంగా ఉండడం మూలంగా మండల డిజైన్లతో దుస్తుల రూపకల్పన ఊపందుకుంది. నలుపు మీద తెలుపు గీతలతో రూపొందించే మండల డిజైన్లు సర్వత్రా ఆదరణ పొందుతూ ఉంటాయి. ఇవే కాకుండా ఆకట్టుకునే రంగులు, డిజైన్లలో కూడా మండల డిజైన్లు రూపొందుతూ ఉంటాయి.

నప్పే సొబగులతో...

అంగీలు, ఫ్రాక్‌లు, పొడవాటి గౌన్లు, లెహంగాలు.. ఇలా మండల డిజైన్‌తో ఎన్నో రకాల దుస్తులు రూపొందుతున్నాయి. అలాగే కాటన్‌తో పాటు లెనిన్, శాటిన్ వస్త్రాల మీద ముద్రించిన మండల డిజైన్లకు కూడా ఆదరణ పెరుగుతోంది. సౌకర్యం ప్రధానంగా రూపొందే బీచ్ వేర్, మండల డిజైన్లలోనే ఎక్కువగా రూపొందుతూ ఉంటాయి.

అయితే ఏ రకం దుస్తులు వేసుకున్నా, వాటికి నప్పే ఆభరణాలూ, ఇతరత్రా యాక్సెసరీస్‌లను జోడించినప్పుడే మండల డిజైన్లు చూడముచ్చటగా మారతాయి. కాబట్టి టెర్రకోట లేదా ఉడెన్ ఆభరణాలు, కొల్హాపురి చెప్పులు లాంటి వాటిని ఈ రకం దుస్తులకు జోడిస్తూ ఉండాలి.



అందమైన అనుబంధం

దుబాయ్ అంతర్జాతీయ స్టేడియం... చాంపియన్స్ ట్రోఫీ అంతిమ సమరం... భారత జట్టు అద్భుత విజయం తరువాత అక్కడ అత్యంత ఆకట్టుకున్నది... విరాట్ కోహ్లీ, అనుష్కాశర్మల జంట. అరమరికలు లేని వారి అన్యోన్యత. మైదానంలో మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసినవారు... రోజంతా టీవీలకు అతుక్కుపోయిన అభిమానులు... దాదాపు అందరి దృష్టీ.. విరుష్కాల మీదే.

ఒకరు క్రికెట్‌లో కింగ్. మరొకరు ఒకప్పటి బాలీవుడ్ క్వీన్. ఇద్దరి దారులు... లక్ష్యాలు వేరైనా... ప్రేమ వారిని ఒక్కటి చేసింది. 36 ఏళ్ల అనుష్కా పుట్టింది ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో. ఆమె తండ్రి కల్నల్ అజయ్‌కుమార్ శర్మ. ఆర్మీ అధికారి. తల్లి అషిమాశర్మ గృహిణి. 'నటిగా కంటే ఒక ఆర్మీ అధికారి కూతురునని చెప్పుకోవడానికి నేను గర్వపడతా' అంటూ ఓ సందర్భంలో అనుష్కా చెప్పింది. బెంగళూరులో పెరిగిన ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం... కొన్నాళ్లు అసోమ్‌లో సాగింది. భారత క్రికెట్ జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోనీ సతీమణి సాక్షి... ఆమె సహవిద్యార్థిని. తిరిగి బెంగళూరుకు వచ్చిన అనుష్కా... అక్కడే ప్రాథమికోన్నత విద్య, డిగ్రీ పూర్తి చేసింది. తొలుత మోడలింగ్ లేదంటే జర్నలిజమ్‌లో కెరీర్‌ను ఎంచుకోవాలని అనుకుంది. రెండిటిలో మోడలింగ్‌కు వైపు మొగ్గు చూపి... ముంబయి వెళ్లింది. అక్కడ మోడలింగ్ చేస్తూనే నటనలో శిక్షణ తీసుకుంది. బాలీవుడ్‌లోకి ఘనంగా అడుగుపెట్టింది. తొలి చిత్రమే షారూక్‌ఖాన్‌తో. ఎన్నో వడపోతల తరువాత 'రబ్ నే బనాదీ జోడీ'లో అతని సరసన నటించే అద్భుత అవకాశం దక్కించుకుంది. ఆ బ్లాక్‌బస్టర్‌తో అగ్రతారల్లో ఒకరిగా నీరాజనాలు అందుకుంది.



ఇక క్రికెట్‌లో వేలకొద్దీ పరుగులు సాధించిన విరాట్ కోహ్లీది భిన్నమైన కథ. అతడి తండ్రి ప్రేమ్‌నాథ్ కోహ్లీ క్రిమినల్ లాయర్. తల్లి సరోజ్ గృహిణి. ఢిల్లీలో పుట్టిన విరాట్‌కు ఊహ తెలిసినప్పటి నుంచి క్రికెట్టే ప్రపంచం. అతడి ఆసక్తిని గమనించిన తండ్రి అకాడమీలో చేర్పించి, శిక్షణ ఇప్పించారు. ఢిల్లీ అండర్-15 జట్టులో చోటు దక్కించుకున్న కోహ్లీ... అసమాన ప్రతిభతో అంచలంచెలుగా ఎదిగాడు. 2006లో తండ్రి మరణించడంతో... ఆయన తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడానికి మరింత శ్రమించాడు. 2008లో అండర్19 ప్రపంచ కప్‌లో భారత్‌ను విజయ తీరాలకు చేర్చాడు. అదే ఏడాది శ్రీలంక పర్యటనకు భారత సీనియర్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. సిరీస్‌లో తొలి వన్డేతో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన కోహ్లీ, టన్నుల కొద్దీ పరుగులతో క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ తరువాత అంతటి బ్యాట్స్‌మన్‌గా పేరు గడించాడు.

విభిన్న నేపథ్యాల నుంచి వచ్చి, విభిన్న లక్ష్యాల వైపు పయనిస్తున్న విరాట్, అనుష్కా తొలిసారి కలిసింది కూడా కెరీర్ పరంగానే. ఓ షాంపూ యాడ్ కోసం కలిసి నటించారు. అక్కడ వీరి పరిచయం ఆ తరువాత ప్రేమగా చిగురించింది. కొన్నేళ్ల సహజీవనం తరువాత 2017లో వివాహ బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఈ జంటకు 2021లో కూతురు పుట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో అనుష్కా మగ బిడ్డకు జన్మనిచ్చింది. విరాట్ ఎక్కడ ఉంటే అక్కడ అనుష్కా ప్రత్యక్షమవుతుంది. అతడు మైదానంలో ఉన్నప్పుడు... గ్యాలరీలో కూర్చొని ఉత్సాహపరుస్తుంది. అతడి గెలుపు తన గెలుపులా భావిస్తుంది. సగటు అభిమానిలా కేరింతలు కొడుతుంది. ఇవన్నీ క్రికెట్ ప్రేమికులకు కొత్తేమీ కాదు. విరాట్ కూడా అంతే. అతడి మనసులో ఆమె స్థానం అత్యున్నతం. క్రికెట్, కుటుంబం... ఇవే అతడి లోకం.



దీనికి కొనసాగింపుగా ఈ నెల తొమ్మిదిన ముగిసిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో విరుష్కాల అనురాగ బంధం మరోసారి కేంద్రబిందువైంది. తొలి బంతి నుంచి వీఐపీ గ్యాలరీలో కూర్చొని మ్యాచ్‌ను తిలకిస్తున్న అనుష్కా... మ్యాచ్ గెలవగానే ఒక్కసారిగా మైదానంలోకి పరుగెత్తుకొచ్చింది. వస్తూనే విరాట్‌ను హత్తుకొని ఆనందాన్ని పంచుకుంది. విరాట్ కూడా అంతే ప్రేమగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. కప్ గెలిచిన మధుర క్షణాలను ఆమె సమక్షంలో ఆస్వాదించాడు. తొలుత భారత్ గెలవగానే మైదానంలో ఉన్న విరాట్... గ్యాలరీలో కూర్చున్న అనుష్కా వైపు చూసి చేయి ఊపుతూ పలుకరించాడు. వెంటనే ఆమె చిరునవ్వుతో అతడికి అభివాదం చేసింది. కాసేపటికి మైదానంలోకి వచ్చి, విరాట్ చేయిలో చేయి వేసి ఎంతో అపరూపంగా అతడిని చూస్తూ నిలుచుంది.

ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. కానీ ఒకరి భావాలను ఒకరు పంచుకున్నారు. పక్కపక్కనే ఉన్నా... పెదవులు కదలకుండా కళ్లతోనే సంభాషించుకున్నారు. ఒకరికి ఒకరుగా... ఎంతో సౌకర్యంగా కనిపించారు. ఒక అందమైన బంధం దృఢంగా, కలకాలం నిలబడాలంటే ఏమేం కావాలి? అవన్నీ వీరి అనుబంధంలో ప్రతిబింబించాయి. ఇది ఆరోగ్యకరమైన ఒక మంచి వైవాహిక బంధానికి ప్రతీక అనేది ఫ్యామిలీ కౌన్సిలర్ల మాట. బయటకు వచ్చినప్పుడే కాదు... ఇంట్లో కూడా విరుష్కాలు ఎంత అన్యోన్యంగా ఉంటున్నారనేది ఇన్‌స్టాలో వాళ్ల ఫొటోలు, వీడియోలు చూస్తే అర్థమవుతుంది. ఒకరి ప్రతిబింబం మరొకరిలో ప్రతిబింబిస్తుంది.

ఫ్యాన్ శబ్దం చేస్తోందా?

ఎండాకాలం వచ్చేసింది. ఇళ్లలో రోజంతా సీలింగ్ ఫ్యాన్ తిరుగుతూనే ఉంటోంది. ఫ్యాన్ తిరుగుతున్నప్పుడు ఒక్కోసారి శబ్దాలు వస్తుంటాయి. చిన్న చిట్కాలతో ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు.

- సీలింగ్ ఫ్యాన్ రెక్కలపై విపరీతంగా దుమ్ము చేరుతూ ఉంటుంది. దీనివల్ల ఫ్యాన్ తిరిగేటప్పుడు శబ్దం రావచ్చు. వారానికి ఒకసారి ఫ్యాన్‌ని, రెక్కలను పొడి గుడ్డతో తుడుస్తూ ఉంటే సమస్య తీరుతుంది.
- రోజుల తరబడి ఫ్యాన్ తిరుగుతూ ఉండడం వల్ల రెక్కలకు ఉండే స్క్రూలు లూజవుతాయి. దీని వల్ల కూడా ఫ్యాన్ నుంచి శబ్దాలు రావచ్చు. ఒకసారి వాటిని పరిశీలించి బిగిస్తే శబ్దాలు ఆగిపోతాయి.
- రెక్కలు కొద్దిగా వంగినా కూడా ఫ్యాన్ నుంచి పెద్ద పెద్ద శబ్దాలు రావచ్చు. ఫ్యాన్ రెక్కలను వంకర లేకుండా సరిచేస్తే సమస్య తీరుతుంది.
- ఫ్యాన్ తిరగడానికి ఉపకరించే భాగాలు పొడిగా మారినప్పుడు కూడా ఇదే సమస్య ఎదురుకావచ్చు. వాటిలో కొద్దిగా కొబ్బరి నూనె వేస్తే ఫలితం కనిపిస్తుంది.



- ఫ్యాన్‌ని నేరుగా సీలింగ్‌కు బిగించినా కూడా శబ్దాలు రావచ్చు. ఫ్యాన్‌కు, సీలింగ్‌కూ మధ్య రబ్బర్ కుషన్ అమరిస్తే సమస్య తీరుతుంది.



'తెలుగుజాడలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, చిత్రంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాహుల్‌కుమార్, ఉమామహేశ్వరరావుతో పాటు ఆయన కుటుంబసభ్యులు

ఆంధ్రజ్యోతి వేదికగా 'తెలుగు జాడలు' పుస్తకావిష్కరణ

హైదరాబాద్ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వివిధ దేశాల్లోని తెలుగు వారి భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, జీవన విధానంపై ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం. ఉమామహేశ్వరరావు రాసిన 'తెలుగు జాడలు' యాత్రానుభవాల సంపుటిని మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఇందులోని వ్యాసాలన్నీ ఇది వరకు ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో ప్రచురితమయ్యాయి. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాహుల్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ, తెలంగాణ నెట్‌వర్క్ ఇంచార్జి ఆర్. కృష్ణప్రసాద్, జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్, కవి యార్లగడ్డ రాఘవేంద్రరావు, ఏబీఎన్ అసోసియేట్ ఎడిటర్ సువర్ణకుమార్, ఆర్ఎం. ఉమామహేశ్వరరావు జీవిత సహచరి విష్ణుప్రియ, కుమార్తె రాగలీన పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

- కాంగ్రెస్, బీజేపీలు ఏకమై తప్పుడు కేసు.. బనాయించాయన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొత్తపేట, ఎల్‌బీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఎల్‌బీనగర్ పోలీసుస్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది. తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సోమవారం హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆమె ఫిర్యాదుతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏసీపీ కృష్ణయ్య తెలిపారు. కాగా రాజకీయ దురుద్దేశంతోనే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడబలుక్కుని తనపై అక్రమ కేసు బనాయించారన్నారు.

పదో తరగతి పరీక్షలకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్

- ఆన్సర్ బుక్‌లెట్ ఇక 24 పేజీలు.. 2,650 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 5,09,403 విద్యార్థులు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష మొదలయ్యే సమయం 9.30 గంటల తర్వాత 5 నిమిషాలపాటు గ్రేస్ పీరియడ్ ఇస్తున్నామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,650 కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,09,403 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈసారి అన్ని కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్ల గదుల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు రాసే ఆన్సర్ బుక్‌లెట్‌లో పేజీల సంఖ్యను ఈసారి పెంచారు. గతంలో 4 పేజీల మెయిన్, అడిషనల్ ఆన్సర్ షీట్లు ఉండగా.. ఇకపై వాటిస్థానంలో 24 పేజీల మెయిన్, 12 పేజీల అడిషనల్ ఆన్సర్ షీట్‌లు అందించనున్నామని అధికారులు తెలిపారు. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు పంపామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

బెట్టింగ్ యాప్‌లపై ఫైటింగ్!

(మొదటిపేజీ తరువాయి)

మహమ్మారిని అరికట్టడానికి ఎవరి అనుమతీ అక్కర్లేదు. సమాజంలో మార్పు తీసుకురావాలనుకుంటే ఇలానే ముందుకు సాగండి. మనమంతా కలిసి సోషల్ మీడియాలో బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి వ్యతిరేకంగా పోరాడదాం. అనేక మంది ప్రాణాలను కాపాడదాం. ఈ సందేశాన్ని విస్తృతంగా చేరవేయండి" అనే సజ్జనార్ మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా ప్రచారంలోకి వచ్చాయి. ఫలితంగా మోసపూరిత యాప్‌లకు ప్రచారం చేస్తున్న 11 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఒకేరోజు పోలీసులు కేసులు నమోదు చేశారు. సజ్జనార్ తాజా ఉద్యమంతో ఇన్‌ఫ్లూయెన్సర్లు దిగొచ్చారు. ఇకపై బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేయబోమని ప్రకటిస్తున్నారు. కొందరు సెల్ఫీ వీడియోలనూ పోస్టుచేశారు.

ప్రమోషన్లతో సంపాదన ఇలా..

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో కొందరు యూట్యూబర్లపై కేసులు నమోదయ్యాయి. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌తో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తున్నాయి. దీంతో కొందరు డబ్బు సంపాదనకు దీన్ని సులువైన మార్గంగా ఎంచుకుంటున్నారు. అదేసమయంలో వారి ప్రచారం చూసి.. బెట్టింగ్ యాప్‌ల్లో డబ్బులు పెట్టి సర్వం కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. డబ్బు అవసరం ఎక్కువగా ఉండే వ్యక్తులు ఆశతో ఈ జూదానికి అలవాటుపడతారు. తర్వాత రుణ భారం ఎక్కువ కావడంతో తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో చాలామంది బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేయడానికి సెలబ్రిటీలను ఉపయోగించుకుంటున్నారు. ఈ యాప్‌ల్లో ఓ వ్యక్తి చేసిన డిపాజిట్‌పై పర్సంటేజీలు, కమీషన్లను ప్రమోటర్లకు ఇస్తున్నారు. ఈ ప్రచారం ద్వారా కొందరు రోజుకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్లు, బల్లితెర నటులు నెలకు సంపాదించే మొత్తం తక్కువగానే ఉంటుంది. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం ద్వారా ఎంత ఎక్కువ మందితో డిపాజిట్ చేయిస్తే అంత ఎక్కువ కమీషన్ వస్తుంది. దీంతో ఎక్కువమంది ఈ యాప్‌లకు ప్రచారం చేస్తున్నారు. ఇన్‌ఫ్లూయెన్సర్లు చాలామంది టెలిగ్రామ్‌లో గ్రూపులు సృష్టిస్తున్నారు. వాటిలో ఎక్కువ మంది చేరుతుంటారు. తర్వాత ఆ గ్రూపులో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. మొదట యాప్‌లో జాయిన్ అయితే బోనస్ వస్తుందని, ఆ తర్వాత డిపాజిట్లపై ఇన్సెంటివ్ అంటూ బెట్టింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ అయ్యేలా ఆకర్షిస్తుంటారు. ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

యోలో 24/7 యాప్‌కు మంచు లక్ష్మి ప్రమోషన్

ప్రముఖ యూట్యూబర్లే కాకుండా కొందరు సినీ నటులు కూడా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా మంచు లక్ష్మి యోలో24/7 యాప్‌ను ప్రమోట్ చేసినట్లు సోషల్ మీడియా వేదికగా వీడియోలు వైరల్ అవుతున్నాయి. వాటిని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆమెపై కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

బాధితులు ఫిర్యాదు చేస్తేనే చర్యలు: సజ్జనార్

బెట్టింగ్ యాప్‌లతో ఆర్థికంగా కుదేలవుతున్న వారు వేలల్లో ఉన్నారని సజ్జనార్ అన్నారు. ఆత్మహత్యలూ చేసుకుంటున్నారని, తీవ్రంగా పరిగణించాల్సిన ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతోనే సోషల్ మీడియా వేదికగా స్పందించినట్లు చెప్పారు. ఈ ఘటనలకు కారణం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు చేస్తున్న ప్రచారమేనని గుర్తించినట్లు తెలిపారు. అలా తెలుగు రాష్ట్రాల పరిధిలో పేరొందిన ఇన్‌ఫ్లూయెన్సర్లను గుర్తించి, వారిపై ఫిర్యాదు చేస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నించామని వివరించారు. ఫలితంగానే 11 మందిపై కేసులు నమోదయ్యాయన్నారు. బెట్టింగ్ యాప్‌ల కారణంగా నష్టపోయిన బాధితులంతా ఫిర్యాదు చేస్తేనే పోలీసులకు ఈ యాప్‌ల తీవ్రత తెలుస్తుందని చెప్పారు. ఎక్కువ ఫిర్యాదులు, ఎక్కువ మంది బాధితులు ముందుకు వస్తేనే పోలీసులు కూడా స్పందించి బెట్టింగ్ యాప్‌లను ప్రమోషన్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఆవకాశం ఉంటుందని తెలిపారు.

తప్పుడు ప్రచారాలతో సెలబ్రిటీలకు తిప్పలు!

మూడేళ్ల క్రితం మోసపూరితమైన స్కీములు క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్, ఫ్యూచర్ మేకర్ పథకాలతో నిర్వాహకులు రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారు. అప్పట్లో సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సజ్జనార్ ఈ కుంభకోణాలను బయటకు తీసి, మోసగాళ్ల భరతం పట్టారు. పదుల సంఖ్యలో నిర్వాహకులను అరెస్టు చేశారు. ఆ స్కీములను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలకూ నోటీసులు జారీ చేశారు. వారిలో అనిల్‌కపూర్, షారుక్ ఖాన్, బొమన్ ఇరానీ, వివేక్ ఒబెరాయ్, జాకీ ష్రాఫ్, పూజా హెగ్డే, యువరాజ్ సింగ్ తదితరులు ఉన్నారు. సజ్జనార్ నోటీసులకు స్పందించిన సెలబ్రిటీలు కొందరు స్వయంగా వచ్చి సంజాయిషీ ఇచ్చుకున్నారు. మరోసారి ఇలాంటి మోసపూరిత పథకాలకు ప్రచారం చేయబోమని చెప్పారు. కొంతమంది సెలబ్రిటీలు తమ లాయర్ల ద్వారా సమాధానాలు ఇచ్చారు. ఇప్పుడు మోసపూరిత బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌లపైనా సజ్జనార్ దృష్టి సారించారు.

శిక్షలు ఇలా..

వినియోగదారుల ఫోరం సవరణ చట్టం 1986 ప్రకారం సెలబ్రిటీలు మోసపూరితమైన ప్రకటనలతో ప్రచారం చేస్తే వారిపై ఏడాది నుంచి మూడేళ్ల పాటు నిషేధం విధించే అవకాశం ఉంటుంది. అలాగే రూ.10 లక్షల జరిమానా కూడా వేయొచ్చు. చేసిన తప్పే మళ్లీ చేసినా, తీర్పును ధిక్కరించినా జైలు శిక్షతో పాటు జరిమానా రెట్టింపు అయ్యే అవకాశం ఉందని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

యూనిఫాంలోనే కానిస్టేబుల్ ప్రమోషన్!

బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన 11 మంది యూట్యూబర్లపై కేసు నమోదు చేసిన పంజాగుట్ట పోలీసులు.. విచారణకు హాజరు కావాలంటూ మంగళవారం వారందరికీ నోటీసులు జారీ చేశారు. వైసీపీ అధికార ప్రతినిధి శ్యామలతోపాటు ఇమ్రాన్ ఖాన్, విష్ణుప్రియ, హర్ష సాయి, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు శేషయాని సుప్రీత, కిరణ్‌గౌడ్, అజయ్, సన్నీ, సుధీర్‌లపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీరందరికీ నోటీసులు జారీ చేశారు. కాగా, కిరణ్‌గౌడ్ హబీబ్‌నగర్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన యూనిఫాంలో ఉండి టెలిగ్రామ్ చానెల్‌లో బెట్టింగ్ టిప్స్ ఇస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు టేస్టీ తేజను పోలీసులు మంగళవారం విచారించినట్లు తెలిసింది.

'బెట్టింగ్ యాప్' ప్రమోటర్లపై ఈడీ నజర్!

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై ఈడీ దృష్టి సారించింది. ఆ యాప్‌లను తమ టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ప్రచారం చేసి, రూ.లక్షల్లో కమీషన్లు తీసుకుంటున్న వారి వివరాలను ఈడీ అధికారులు సేకరిస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్లపై తెలంగాణలో నమోదైన అన్ని కేసుల వివరాలను మంగళవారం తెప్పించుకున్నారు. తమత మ వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాల ద్వారా బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న పలువురిపై ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ యాప్‌లను ప్రచారం చేస్తున్న వారు ముందుగా తమ ఖాతాలను ఫాలో అవుతున్న వారికి ఒక లింక్ పంపిస్తారు. ఆ లింక్ ద్వారా వెల్‌కం బోనస్ వస్తోంది. ఆ తర్వాత బెట్టింగ్ ఆడడానికి నిర్ణయించుకున్న వ్యక్తి డబ్బును డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అలా డబ్బు కట్టిన ప్రతి ఒక్కరి ఖాతాకు సంబంధించిన కమీషన్‌ను నిర్వాహకులు ఆ ప్రమోటర్‌కు చెల్లిస్తున్నారు. ఇలా చాలామందికి రోజూ రూ.వేలు, లక్షల్లో డబ్బు వస్తోంది. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్ల ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది.



నాతో మాట్లాడించింది

'సాక్షి' మీడియానే!

- స్క్రిప్టు, ఫొటోలు నాకు వారే ఇచ్చారు
- సీఐడీ కస్టడీలో పోసాని కృష్ణ మురళి వెల్లడి

గుంటూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లపై నాతో మాట్లాడించింది సాక్షి మీడియా వాళ్లే. అందులో నా పాత్ర ఏమీ లేదు" అని సీఐడీ విచారణలో సినీ నటుడు పోసాని కృష్ణమురళి చెప్పినట్లు తెలిసింది. గత వైసీపీ హయాంలో హైదరాబాదులో మీడియా సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ అధినేత చంద్రబాబుపై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ టీడీపీ కార్యకర్త బండారు వంశీకృష్ణ గత అక్టోబరు 9న సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదు చేశారు. దీంతో గుంటూరు సీఐడీ అధికారులు పోసానిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న పోసానిని సీఐడీ అధికారులు పీటీ వారెంట్‌పై గుంటూరు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరచగా కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. కాగా, ఆ కేసులో మరిన్ని వివరాలు, ఆధారాలు రాబట్టాల్సి ఉందన్న సీఐడీ అధికారుల అభ్యర్థన మేరకు పోసానిని మంగళవారం ఒకరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కోర్టు కస్టడీకి అనుమతించింది. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు సీఐడీ అధికారులు గుంటూరు జిల్లా జైలు నుంచి పోసాని కృష్ణమురళిని అదుపులోకి తీసుకున్నారు. తొలుత జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించాక సీఐడీ కార్యాలయానికి తరలించి డీఎస్పీ గోలి లక్ష్మయ్య ఆధ్వర్యంలో పోసానిని విచారించారు. అయితే ఓ దశలో పోసాని అనవసరంగా రాజకీయాల్లోకి వచ్చానని, ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయని ఊహించలేకపోయానని ఆవేదన చెందినట్లు తెలిసింది. హైదరాబాదులో మీడియా సమావేశం ఏర్పాటు చేసి చంద్రబాబు ఇతర నేతలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీవద్ద ఉన్న ఆధారాలు ఏమిటని సీఐడీ ప్రశ్నించగా తను మాట్లాడిన అంశానికి సంబంధించి ఏమీ తెలియదని, సాక్షి మీడియా వాళ్లే మీడియా సమావేశం ఏర్పాటు చేశారని వాళ్లు ఇచ్చిన స్క్రిప్టే తాను చదివానని, వారిచ్చిన ఫొటోలనే చూపించానని పోసాని చెప్పినట్లు తెలిసింది.

సాక్షి మీడియాకు సీఐడీ నోటీసులు!

హైదరాబాదులో మీడియా సమావేశం ఏర్పాటు చేయించి తనతో టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు ఇతర నేతలపై సాక్షి మీడియా వారే అనుచిత వ్యాఖ్యలు చేయించారని పోసాని కృష్ణమురళి వెల్లడించిన నేపథ్యంలో సీఐడీ అధికారులు సాక్షి మీడియాకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



మెగాస్టారుకో ముద్దు

తనదైన నటనతో కోట్లాది మంది అభిమానుల హృదయాలను చూరగొన్నారు చిరంజీవి. ఒక్కసారి ఆయన్ను చూస్తే చాలు అనుకొనే అభిమానులకు కొదవలేదు. ఎన్నో ఏళ్లుగా తెరపైన చూస్తూ ఆరాధించిన మెగాస్టార్ కళ్లముందు ప్రత్యక్షమైతే అభిమానుల ఆనందానికి అవధులుండవు. ఇలాంటి ఓ అపురూపమైన దృశ్యానికి లండన్ ఎయిర్‌పోర్ట్ వేదికైంది. యూకే పార్లమెంట్‌లో సన్మానం కోసం చిరంజీవి లండన్ వెళ్లారు. ఆయనను చూడడానికి విమానాశ్రయానికి అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. చిరంజీవిని చూడగానే భావోద్వేగానికి గురైన ఓ మహిళా అభిమాని ఆయన్ను దగ్గరకు తీసుకొని బుగ్గను ఆత్మీయంగా ముద్దాడారు. 'మీ ఆనందమే నా ఆనందం' అన్నట్లు ఆ క్షణాలను చిరంజీవి సైతం సంతోషంగా ఆస్వాదిస్తున్నట్లు కనిపించారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరలవుతోంది. యూకే పార్లమెంట్ నేడు చిరంజీవిని సత్కరించనుంది. అలాగే బ్రిడ్జ్ ఇండియా సంస్థ జీవిత సాఫల్య పురస్కారం అందించనుంది.

ఈ తరానికీ నచ్చే చిత్రమిది



శివలెంక కృష్ణప్రసాద్

బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ఆదిత్య 369'. ఈ సినిమా అప్పట్లో ఎంతటి ఘనవిజయాన్ని సాధించిందో తెలిసిందే. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీదేవి మూవీస్ నిర్మించిన ఈ సినిమా రీరిలీజ్‌కు సిద్ధమైంది. ఏప్రిల్ 11న 'ఆదిత్య 369' సినిమాను విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ "నేటి సాంకేతికతకు తగ్గట్లు చిత్రాన్ని ఆధునీకరించాం. విడుదలై 34 ఏళ్లు అవుతున్నా ఈ సినిమాకు ఇప్పటికీ ఏ మాత్రం ఆదరణ తగ్గలేదు. ఇప్పటి తరానికీ గొప్పగా కనెక్ట్ అవుతుంది. మా శ్రీదేవి మూవీస్ సంస్థకు ఎంతో గుర్తింపు తెచ్చింది. ఈ సినిమా మళ్లీ థియేటర్లలో సందడి చేయడం నందమూరి అభిమానులకే కాదు, తెలుగు ప్రేక్షకులకూ మరిచిపోలేని కానుక" అన్నారు. ఈ చిత్రంలో రెండు విభిన్న పాత్రల్లో ప్రేక్షకులను అలరించారు బాలకృష్ణ. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఆదిత్య 999 మ్యాక్స్'ను తెరకెక్కిస్తాననీ.. తన తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా నటిస్తాడనీ బాలకృష్ణ ఓ సందర్భంలో వెల్లడించారు.

కల్కి 2.. సెట్స్‌పైకి వెళ్లేది అప్పుడే



నాగ్ అశ్విన్

'ఎవడే సుబ్రహ్మణ్యం' చిత్రం నేటి సమాజంలో ఉన్న పరిస్థితులకూ అద్దం పడుతుంది. ఇప్పుడు ఈ చిత్రానికి మరింత ప్రాధాన్యం పెరిగింది. మంచి సినిమాను చూసిన అనుభూతిని ప్రేక్షకులు పొందుతారు' అని దర్శకుడు నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. 2015లో నాని హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన సినిమా 'ఎవడే సుబ్రహ్మణ్యం'. స్వప్న దత్, ప్రియాంక దత్ నిర్మించారు. దీనిని ఈనెల 21న థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కొన్ని సినిమాలపై మమకారం ఎక్కువ ఉంటుంది. 'ఎవడే సుబ్రహ్మణ్యం' చిత్రం కూడా అలాంటిదే. ప్రస్తుతం కల్కి-2 స్ర్కిప్ట్ వర్క్ జరుగుతోంది. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్తుంది. ప్రభాస్ స్ర్కీన్ ప్రజెన్స్ పార్ట్-2లో ఎక్కువగానే ఉంటుంది. పదేళ్ల నా కెరీర్ సంతృప్తిగానే ఉంది. ఇప్పటివరకూ ఎవరూ ప్రయత్నించని కొత్త తరహా కాన్సెప్ట్‌తోనే నా సినిమాలు చేస్తున్నాను' అని అన్నారు.

అతీంద్రియ శక్తుల నేపథ్యంలో



సుశాంత్ కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. పృథ్వీరాజ్ చిట్టేటి దర్శకత్వంలో సంజీవని క్రియేషన్స్ బేనర్‌పై వరుణ్‌కుమార్, రాజ్‌కుమార్ నిర్మిస్తున్నారు. మంగళవారం సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. సుశాంత్ విభిన్నమైన లుక్‌లో ఆకట్టుకున్నారు. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో సాగే చిత్రమిదని పోస్టర్‌ను బట్టి తెలుస్తోంది. అనిరుధ్ కృష్ణమూర్తి స్ర్కీన్‌ప్లే అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వైవీబీ శివసాగర్.

మీమ్సే... రీల్సే



సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. విజయవంతమైన 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తోంది. ఈ నెల 28న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం మరో గీతాన్ని విడుదల చేసింది. 'ఏసుకోండ్రా మీమ్సే.. చేసుకోండ్రా రీల్సే' అంటూ సాగే ఈ హుషారైన గీతానికి భీమ్స్ సిసిరోలియో సంగీతంతో పాటు స్వరాన్నందించారు. అనుదీప్ కె.వి రచించారు. ఈ చిత్రంలో ప్రియాంక జవాల్కర్, మురళీధర్ గౌడ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారికా సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పిస్తున్నారు.

ఆకట్టుకునే నాన్న కథ



సీనియర్ నటుడు సత్యప్రకాశ్ ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'నాన్నా మళ్లీ రావా'. నిర్దేశ్ దర్శకత్వంలో డా. ఉమారావు నిర్మించారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో సత్యప్రకాశ్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి. కుటుంబ సమేతంగా చూడతగ్గ చిత్రమిది' అని అన్నారు. ఒక మంచి సినిమా తీసిన అనుభూతి దక్కింది అని దర్శకుడు చెప్పారు. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులున్న చిత్రమిదని నిర్మాత చెప్పారు.



ప్రధాని మోదీతో ఇళయరాజా భేటీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఇసైజ్ఞాని ఇళయరాజా మంగళవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ మేరకు ఫోటోలను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. 'ప్రధానమంత్రి మోదీతో ఒక చిరస్మరణీయమైన సమావేశం. నా సింఫనీ 'వాలియంట్'తో సహా అనేక విషయాల గురించి మేం చర్చించుకున్నాం. ఆయన అభినందనలు, మద్దతుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కాగా, ఈ నెల 8వ తేదీన లండన్‌లో ఇళయరాజా తన తొలి సింఫనీ అరంగేట్రాన్ని విజయవంతంగా నిర్వహించి పలువురి ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమాన్ని ముగించుకుని స్వదేశానికి వచ్చిన ఆయన.. తొలుత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపరాష్ట్రపతి ప్రశంస

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. లండన్ వేదికగా ఇళయరాజా సాధించిన ఘనత యావత్ దేశం గర్వించేలా చేసింది అంటూ కొనియాడారు. రాజ్యసభ సభ్యుడైన ఇళయరాజాకు రాజ్యసభ కూడా అభినందనలు తెలిపింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

హంతకుడి ఆత్మ కథ



సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటించిన చిత్రం 'కిల్లర్ ఆర్టిస్ట్'. రతన్ రిషి దర్శకత్వంలో జేమ్స్ వాట్ కొమ్ము నిర్మించారు. ఈనెల 21న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో సంతోష్ మాట్లాడుతూ 'ట్రైలర్‌ను దర్శకుడు బోయపాటి గారికి చూపించాం. బాగుందని ఆయన ప్రశంసించారు. ఓటీటీలో చూడాల్సిన చిత్రం కాదిది. థియేటర్లలోనే చూడాలి. సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి సినిమాకు ప్రాణం పోశారు. సినిమా విజయవంతమవుతుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత జేమ్స్ వాట్ కొమ్ము మాట్లాడుతూ 'ఈ సినిమా ఫలితం మీద చాలా మంది భవిష్యత్తు ఆధారపడి ఉంది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు రతన్ రిషి మాట్లాడుతూ 'హత్య చేయడాన్ని కళగా భావించే ఓ వ్యక్తి జీవిత కథ ఇది. ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ కథ రాసుకున్నాను' అని తెలిపారు.




'ఫ్యామిలీ'కి ఓకే.. కానీ

న్యూఢిల్లీ: క్రికెటర్ల విదేశీ పర్యటనలో కుటుంబసభ్యులు ఉంటే మంచిదేనని, అయితే జట్టు ప్రయోజనాలు కూడా ముఖ్యమని దిగ్గజ ఆటగాడు కపిల్ దేవ్ అన్నాడు. ఇటీవల విరాట్ కోహ్లీ బీసీసీఐ ఫ్యామిలీ నిబంధనపై అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 'ఫ్యామిలీని దూరంగా ఉంచాలనేది క్రికెట్ బోర్డు నిర్ణయం. నా దృష్టిలో క్రికెటర్లతో పాటు కుటుంబసభ్యులు ఉండడం అవసరమే. అదే సమయంలో వారు జట్టుకు కూడా ప్రాధాన్యమివ్వాలి. మా సమయంలో బోర్డుతో పనిలేకుండా టూర్ ఆరంభంలో మేమే కుటుంబాలను దూరం పెట్టేవాళ్లం. ఆ తర్వాత టూర్ ద్వితీయార్థంలో నెమ్మదిగా కుటుంబాలు వచ్చి కలిసేవి. అలా సమతూకంగా వ్యవహరించేవాళ్లం' అని కపిల్ వివరించాడు.

మద్యం, పొగాకు ప్రకటనలపై నిషేధం!

బీసీసీఐ సుముఖం

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఇకనుంచి మద్యం, పొగాకు, క్రిప్టో కరెన్సీ సంబంధిత ప్రకటనలు కనిపించే ఆస్కారం ఉండకపోవచ్చు. ఈమేరకు బీసీసీఐ త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది. ఐపీఎల్‌లో మద్యం, పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించాలని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ సూచించిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈనెల 22న కోల్‌కతాలో జరిగే బోర్డు అపెక్స్ కౌన్సిల్‌లో మార్గదర్శకాలు విడుదల చేయనుంది. అలాగే భారత్‌లోనే జరిగే 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్ నిర్వహణపై నిర్వాహక కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఈ మెగా టోర్నీ వేదికలపై కూడా చర్చ జరుగనుంది.



గిల్

ఐపీఎల్ 3 రోజుల్లో

గుజరాత్ మళ్లీ మెరిసేనా?

మూడేళ్ల క్రితం ఐపీఎల్ అరంగేట్రంలోనే టైటిల్‌తో అదరగొట్టిన జట్టు గుజరాత్ టైటాన్స్ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో నిలకడైన ప్రదర్శనతో ఆ తర్వాతి ఏడాది (2023) కూడా రన్నరప్‌గా నిలిచింది. కానీ, మూలాధారమైన పాండ్యాను ముంబై ఇండియన్స్ తీసుకోవడం గుజరాత్‌కు పూడ్చలేని లోటుగా మారింది. అంతగా అనుభవంలేని శుభమన్ గిల్‌కు జట్టు పగ్గాలు అప్పగించడం కూడా ప్రదర్శనపై ప్రభావం చూపింది. దీంతో 2024 టోర్నీలో ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఏడు ఓడిన టైటాన్స్.. ఎనిమిదో స్థానంతో సరిపెట్టింది. ఈ నేపథ్యంలో గిల్, రాహుల్ తెవాటియా, రషీద్‌ఖాన్, సాయి సుదర్శన్‌లతో కోర్ టీమ్‌ను రిటైన్ చేసుకొన్న మేనేజ్‌మెంట్.. అనుభవానికి కూడా పెద్దపీట వేసింది. మెగా వేలంలో బట్లర్, రబాడ, సిరాజ్ లాంటి ప్లేయర్లను కొనుగోలు చేసి సమతుల్యమైన జట్టును తయారు చేసింది. కానీ, నిలకడలేని పవర్ హిట్టర్ షారుఖ్ ఖాన్‌ను రిటైన్ చేసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. గుజరాత్ ప్రధాన బలం బ్యాటింగ్. అయితే, గత సీజన్‌లో పవర్‌ప్లే, మధ్య ఓవర్లలో ఆశించినంత రన్‌రేట్ రాబట్టలేక పోయింది. అయితే, ఈసారి బట్లర్ రాకతో దూకుడు పెరిగే అవకాశం ఉంది. బ్యాటింగ్‌కు సాయి సుదర్శన్ కీలకంగా మారగా.. తెవాటియా, షారుఖ్ ఫినిషర్ పాత్ర పోషించనున్నారు. రబాడ, గెరాల్డ్ కొట్జీతోపాటు టీమిండియా పేసర్లు సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, వరల్డ్‌క్లాస్ స్పిన్నర్ రషీద్‌తో బౌలింగ్ విభాగం మెరుగ్గానే కనిపిస్తోంది. అయితే, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవడాన్ని జట్టు అలవాటు చేసుకోవాలి. కోచ్‌గా ఆశిష్ నెహ్రాను కొనసాగించడం కూడా ప్లస్‌గానే చెప్పుకోవాలి.

జట్టు

బ్యాటర్లు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, గ్లెన్ ఫిలిప్స్; **వికెట్ కీపర్లు:** జోష్ బట్లర్, కుమార్ కుశాగ్ర, అనూజ్ రావత్; **ఆల్‌రౌండర్లు:** సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, నిశాంత్ సింధు, మహిపాల్ లోమ్రోర్, వాషింగ్టన్ సుందర్, అర్షద్ ఖాన్, సాయి కిశోర్, జయంత్ యాదవ్, కరీమ్ జనత్, షారుఖ్ ఖాన్; **బౌలర్లు:** రబాడ, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కొట్జీ, మానవ్ సుతార్, గుర్నూర్ సింగ్ బ్రార్, ఇషాంత్ శర్మ, కుల్వంత్ కేజ్రోలియా, రషీద్ ఖాన్.

తొలి టైటిల్ వేటలో..

పంత్ సారథ్యంలో బలంగా లఖ్‌నవూ



పంత్

గుజరాత్ తరహాలో మూడేళ్ల క్రితం మెగా లీగ్‌లోకి అడుగుపెట్టిన జట్టు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ). కేఎల్ రాహుల్ కెప్టెన్సీలో 2022, 2023లో ప్లేఆఫ్స్ చేరిన లఖ్‌నవూ.. గతేడాది ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఏడు విజయాలతో ఏడో స్థానంతో సరిపెట్టింది. దీంతో రాహుల్‌ను వదిలేసిన యాజమాన్యం.. తాజా సీజన్ కోసం యువరక్తంతోపాటు అనుభవజ్ఞులైన బౌలర్లతో బలమైన జట్టును తయారు చేసింది. ఈసారి టైటిల్ నెగ్గాలన్న పట్టుదలతో వేలంలో డ్యాషింగ్ బ్యాటర్ రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసి అతడికి పగ్గాలు అప్పజెప్పింది. కోచ్ జస్టిన్ లాంగర్ కూడా గొప్ప వ్యూహకర్త కావడంతో లఖ్‌నవూపై ఈసారి భారీ అంచనా లున్నాయి. మ్యాచ్ విన్నర్లు పంత్, నికోలస్ పూరన్, మార్‌క్రమ్, మిల్లర్‌తో జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. ఓపెనర్లు శుభారంభాన్ని అందిస్తే.. వీరు మరింతగా విరుచుకుపడే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొన్న ఆస్ట్రేలియా పేస్ ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ ఈసారి బ్యాటర్‌గా మాత్రమే ఆడే అవకాశాలున్నాయి. ఇక, మయాంక్ యాదవ్ తన బుల్లెట్‌లాంటి బంతులతో ఇప్పటికే అందరి దృష్టినీ తనవైపునకు తిప్పుకొన్నాడు. కానీ, అతడి ఫిట్‌నెస్ సమస్య ఎక్కువగా ఆందోళనకు గురి చేస్తోంది. అవేశ్ ఖాన్, షమర్ జోసెఫ్, ఆకాశ్ దీప్‌లతో పేస్ విభాగం మెరుగ్గానే ఉంది. రవి బిష్ణోయ్ చెప్పుకోదగ్గ స్పిన్నర్. కాగా, మిడిలార్డర్‌లో ఎక్కువగా హిట్టర్లు ఉండడంతో.. ఒకవేళ ఇన్నింగ్స్ నిర్మించాల్సి వస్తే క్రీజులో నిలబడి ఆడే ప్లేయర్ లేని లోటు కనిపిస్తోంది. డెత్ ఓవర్లలో బౌలింగ్ పదును తేలాల్సి ఉంది.

జట్టు

బ్యాటర్లు: డేవిడ్ మిల్లర్, మార్‌క్రమ్, హిమ్మత్ సింగ్, మాథ్యూ బ్రీజ్‌టెక్; **వికెట్ కీపర్లు:** రిషబ్ పంత్ (కెప్టెన్), నికోలస్ పూరన్, ఆర్యన్ జుయల్; **ఆల్‌రౌండర్లు:** మిచెల్ మార్ష్, అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, యువరాజ్ చౌదరి, రాజ్‌వర్ధన్ హంగ్రేకర్, అర్షిన్ కులకర్ణి, ఆయుష్ బదోని; **బౌలర్లు:** అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్, సిద్దార్థ్, దిగ్వేష్ సింగ్, ఆకాశ్ సింగ్, షమర్ జోసెఫ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, మొహిసిన్ ఖాన్, రవి బిష్ణోయ్.

ఎండవేడిమికి తాళలేక పిచ్‌పైనే ప్రాణాలు విడిచి..



అడిలైడ్: ఎండవేడిమిని తట్టుకోలేక ఓ క్రికెటర్ పిచ్‌పైనే ప్రాణాలు విడిచాడు. పాకిస్థాన్ మూలాలున్న క్లబ్ క్రికెటర్ జునైద్ జాఫర్ ఖాన్ (40) డీహైడ్రేషన్‌తో మ్యాచ్ మధ్యలోనే కుప్పకూలాడు. 41.7 డిగ్రీల ఉష్ణోగ్రతలో జరిగిన ఈ మ్యాచ్‌లో ద ఓల్డ్ కాంకార్డియన్స్ క్లబ్ తరపున ఆడుతున్న జునైద్ దాదాపు 40 ఓవర్లపాటు ఫీల్డింగ్ చేసిన అనంతరం బ్యాటింగ్‌కు దిగాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా స్పృహతప్పి పిచ్‌పైనే పడిపోయాడు. తక్షణం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినా వైద్యులు ప్రాణాలు కాపాడలేక పోయారు. రంజాన్ నెల కావడంతో అతడు ఉపవాసం ఉన్నాడని అంటున్నారు. అయితే, సహచరులు మాత్రం అతడు మంచినీరు తాగినట్టు చెప్పారు.

పాక్.. అదే తీరు

కివీస్‌తో రెండో టీ20లోనూ చిత్తు



సీఫర్ట్ (45)

డ్యునెడిన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. మంగళవారం ఇరు జట్ల మధ్య జరిగిన రెండో టీ20లోనూ పాక్ 5 వికెట్ల తేడాతో ఓడింది. దీంతో కివీస్ 2-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించగా.. పాక్ 9 వికెట్లకు 135 పరుగులు చేసింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (46), షాదాబ్ ఖాన్ (26), షహీన్ (22 బ్యాటింగ్) మాత్రమే రాణించారు. స్పిన్నర్ సోధి, పేసర్లు డఫీ, సియర్స్, నీషమ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 13.1 ఓవర్లలో 5 వికెట్లకు 137 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్లు సీఫర్ట్ (45), అలెన్ (38) మెరుపు ఇన్నింగ్స్‌తో తొలి వికెట్‌కు 20 బంతుల్లోనే 66 పరుగులు అందించారు. పేసర్ రౌఫ్‌కు రెండు వికెట్లు దక్కాయి.



అర్చనపై నాలుగేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: డోప్ పరీక్షలో విఫలమైన భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ అర్చనా జాదవ్ (20)పై నాలుగేళ్ల నిషేధం విధించారు. గతేడాది డిసెంబరులో పుణె హాఫ్ మారథాన్ సందర్భంగా నిర్వహించిన డోప్ పరీక్షలో అర్చన నిషేధిత ఆక్సాన్‌డ్రోలోన్ తీసుకున్నట్టు రుజువైంది. అంతేకాదు.. డోప్ తీసుకున్నట్టు అర్చన స్వయంగా అంగీకరించింది. దీంతో ఆమె నాలుగేళ్లు ఎలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్టు ప్రపంచ అథ్లెట్ల స్వచ్ఛత విభాగం (ఏఐయూ) మంగళవారం ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 7 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని తెలిపింది. అర్చన చివరిసారిగా గతేడాది అక్టోబరులో ఢిల్లీ హాఫ్ మారథాన్ రేసులో పోటీపడింది. ఆ రేసులో నాలుగోస్థానంలో నిలిచింది.

కళ్లన్నీ ఛెత్రిపైనే

మాల్దీవులతో భారత పోరు నేడు



షిల్లాంగ్: జట్టు కోసం రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కితీసుకొన్న భారత స్టార్ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి మరోసారి అభిమానులను అలరించనున్నాడు. బుధవారం మాల్దీవులతో జరిగే అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో ఛెత్రి బరిలోకి దిగనున్నాడు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో ఈనెల 25న జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. దీనికి సన్నాహకంగా ఈ మ్యాచ్‌ను భావిస్తున్నారు. సునీల్‌ను సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దించే అవకాశాలున్నాయి. గతేడాది జూలైలో ఛెత్రి కెరీర్‌కు వీడ్కోలు పలికాడు.

'స్విస్' మెయిన్ డ్రాకు ఆయుష్, శంకర్

బాసెల్: స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, శంకర్ ముత్తుస్వామి సింగిల్స్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. క్వాలిఫయర్స్ చివరి రౌండ్లో ఆయుష్ 21-12, 21-15తో చోలన్ (ఇంగ్లండ్)పై, శంకర్ 21-7, 21-10తో భారత్‌కే చెందిన తరుణ్‌పై గెలిచారు. దీంతో పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాలో మొత్తంగా ఆరుగురు భారత షట్లర్లు బరిలో నిలవడం విశేషం. సీనియర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్‌తో పాటు వర్ధమాన షట్లర్లు ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్ నేరుగా మెయిన్ డ్రా ఆడుతున్నారు. కాగా, ఆరంభ రౌండ్‌లో ప్రణయ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనుండగా.. నిషిమోటోతో ఆయుష్, మాగ్నస్ జొహాన్నెసెన్‌తో శంకర్, రాస్మస్ జెమ్‌కెతో కిరణ్, టొబియాస్‌తో ప్రియాన్షు తలపడనున్నారు.

మళ్లీ 75,000 పైకి సెన్సెక్స్

- ఒక్క రోజులో 1,131 పాయింట్ల పెరుగుదల
- 22,800 ఎగువ స్థాయిలో ముగిసిన నిఫ్టీ
- గ్లోబల్ మార్కెట్ల ర్యాలీతో కొనుగోళ్ల జోష్
- 2 రోజుల్లో రూ.8.67 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ ఏకంగా 1,131.31 పాయింట్ల (1.53 శాతం) వృద్ధితో 75,301.26 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 325.55 పాయింట్లు (1.45 శాతం) బలపడి 22,834.30 వద్ద స్థిరపడింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడనుందన్న అంచనాలు, ఫెడ్ రేట్ల తగ్గింపు ఆశలు, అమెరికా, చైనాలో రిటైల్ విక్రయాల తాజా గణాంకాలు అత్యంత సానుకూలంగా ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ట్రేడింగ్ ట్రెండ్ బుల్లిష్‌గా మారింది. దాంతో దేశీయ మదుపరులూ జోరుగా కొనుగోళ్లకు పాల్పడటం సూచీల ర్యాలీకి ప్రధానంగా దోహదపడింది. ముడి చమురు సెగలు కాస్త తగ్గడంతో పాటు డాలర్ సూచీ బలహీనపడటం కూడా మార్కెట్లకు కలిసివచ్చింది. క్రితం సెషన్‌లోనూ సూచీలు మోస్తరుగా లాభపడ్డాయి. గడిచిన రెండు రోజుల్లో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8.67 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.399.85 లక్షల కోట్లకు (4.61 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మంగళవారం ఒక్కరోజే మార్కెట్ సంపద రూ.7 లక్షల కోట్ల మేర పుంజుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 రాణించాయి.



రూ.91,000 దాటిన బంగారం

దేశీయంగా పసిడి ధర తొలిసారిగా రూ.91,000 దాటింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం రేటు మరో రూ.500 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠ స్థాయి రూ.91,250కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం ధర కూడా రూ.450 పెరుగుదలతో రూ.90,800 స్థాయికి ఎగబాకింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించనుందన్న అంచనాలు, ఇజ్రాయెల్-గాజా మధ్య మళ్లీ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు కొత్త రికార్డు స్థాయికి చేరడం ఇందుకు కారణమైంది. కిలో వెండి మాత్రం క్రితం రోజు స్థాయి రూ.1,02,500 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 3,047.50 డాలర్లు, సిల్వర్ 35 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

ఫిజిక్స్‌వాలా రూ.4,600 కోట్ల ఐపీఓ

ప్రముఖ ఎడ్యుటెక్ స్టార్టప్ ఫిజిక్స్‌వాలా పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.4,600 కోట్ల వరకు సమీకరించేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి గోప్య ప్రీ-ఫైలింగ్ విధానంలో ప్రాథమిక ముసాయిదా పత్రాలు(డీఆర్‌హెచ్‌పీ) సమర్పించినట్లు తెలిసింది.

ఎల్‌జీ ఐపీఓకు సెబీ ఆమోదం

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ రూ.15,000 కోట్ల ఐపీఓతో పాటు మ్యాన్‌పవర్ అండ్ టోల్ ప్లాజాల నిర్వహణ సేవల సంస్థ ఇన్నోవిజన్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనకు కూడా సెబీ ఆమోదం లభించింది. ఐపీఓ ద్వారా ఇన్నోవిజన్ రూ.255 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లకు చెందిన 17.72 లక్షల ఈక్విటీ షేర్లను సైతం విక్రయించనుంది.

ఈ నెలాఖరు నాటికి ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ

ముంబై: వచ్చే రెండు వారాల్లో ఓ ఆరోగ్య బీమా సంస్థలో వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు. అయితే, ఏ కంపెనీలో వాటా కొనుగోలు చేయబోతున్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వాటా కొనుగోలుకు సంబంధించి చర్చలు తుది దశలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి ఒప్పందం కుదరవచ్చని మొహంతి ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఆరోగ్య బీమా కంపెనీలో ఎల్ఐసీ మెజారిటీ వాటా (51 శాతం, అంతకు పైగా) మాత్రం కొనుగోలు చేయబోదని స్పష్టం చేశారు. మంగళవారం 'జీసీఏ25' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాల్ని వెల్లడించారు. ఎంత వాటా కొనుగోలు చేయాలనేది ఎల్ఐసీ బోర్డు నిర్ణయంతో పాటు లక్షిత ఆరోగ్య బీమా సంస్థ మార్కెట్ విలువపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం జీవిత కంపెనీలు ఆరోగ్య బీమా కవరేజీ ఆఫర్ చేసేందుకు అనుమతి లేదు.



ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి

అయితే, బీమా కంపెనీలు జీవిత, ఆరోగ్య, సాధారణ బీమా సేవలందించేందుకు వీలుగా కాంపోజిట్ లైసెన్సులను ప్రవేశపెట్టాలని ఇండస్ట్రీ వర్గాలు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశాయి. ఇందుకు సంబంధించి ఈసారి బడ్జెట్లో ప్రకటన వెలువడవచ్చని మార్కెట్ వర్గాలు భావించినప్పటికీ, అది జరగలేదు.

స్టాండ్‌ఎలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలు

ఎల్ఐసీ ఆరోగ్య బీమా విభాగంలోకి ప్రవేశించేందుకు మణిపాల్ సిగ్నాలో వాటా కొనుగోలుకు ప్రయత్నిస్తోందని, వాటా కొనుగోలు ఒప్పందం విలువ రూ.4,000 కోట్ల స్థాయిలో ఉండవచ్చని ఇటీవల మీడియాలో కథనాలు వచ్చాయి. ఆ వార్తలపై స్పందించిన ఎల్ఐసీ.. కేవలం ఆరోగ్య బీమా సేవలందిస్తోన్న స్టాండ్‌ఎలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతున్నట్లు వివరణ ఇచ్చింది.

100 ఏళ్ల ప్రభుత్వ బాండ్లను ప్రవేశపెట్టాలి..

వందేళ్ల కాలపరిమితితో కూడిన ప్రభుత్వ బాండ్ల (జీ-సెక్)ను ప్రవేశపెట్టాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)ని ఎల్ఐసీ అభ్యర్థించింది. ప్రస్తుతం 40 ఏళ్ల వరకు టర్మ్ బాండ్ల జారీకి ఆర్‌బీఐ అనుమతించింది. 50 ఏళ్లు, 100 ఏళ్ల టర్మ్ బాండ్లను కూడా జారీ చేయాలని ఆశిస్తున్నట్లు ఎల్ఐసీ ఎండీ మొహంతి అన్నారు. ఇందుకోసం ఆర్‌బీఐతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని, ఆర్‌బీఐ కూడా ఈ దిశగా ఆలోచన చేస్తోందన్నారు. పూర్తిగా జీవిత బీమా పాలసీలు విక్రయించే ఎల్ఐసీ.. పాలసీదారుల నుంచి సమీకరించిన ప్రీమియం సొమ్మును ప్రధానంగా ప్రభుత్వ దీర్ఘకాలిక బాండ్లు, ఈక్విటీలతో పాటు భిన్న ఆర్థిక సాధనాల్లో పెట్టుబడులుగా పెడుతుంది.

బిజినెస్

కియా, టాటా కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ: కార్ల ధరలు ఏప్రిల్ 1 నుంచి పెంచుతున్నట్టు మెర్సిడెస్ బెంజ్, కియా, టాటా మోటార్స్ ప్రకటించాయి. ముడి సరుకుల ధరలు పెరగడంతో పెరిగిన ఉత్పత్తి వ్యయాలను కొంత మేరకైనా పూడ్చుకునేందుకు కార్ల ధరలు పెంచక తప్పడంలేదని కియా, టాటా మోటార్స్ ప్రకటించాయి. ఏప్రిల్ 1 నుంచి తమ కార్ల ధరలు 3 శాతం మేరకు పెంచుతున్నట్టు కియా ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలియచేశారు.

ఈవీలతో సహా అన్ని కార్ల ధరలు పెంపు: టాటా మోటార్స్ విద్యుత్ కార్ల నుంచి అన్ని రకాల కార్ల ధరలు ఏప్రిల్ 1 నుంచి పెంచబోతున్నట్టు ప్రకటించింది. మోడల్, వేరియెంట్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని తెలిపింది. అయితే ఎంత శాతం మేరకు పెంచుతున్నట్టు కంపెనీ వెల్లడించలేదు. టాటా మోటార్స్ కార్ల ధర పెంచడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి.

రూపాయి బలహీనతే కారణం: మెర్సిడెస్

కరెన్సీ మార్కెట్లో రూపాయి బలహీనత కొనసాగినట్టయితే ఏప్రిల్ నుంచి కార్ల ధరలు పెంచక తప్పదని లగ్జరీ కార్ల కంపెనీ మెర్సిడెస్ బెంజ్ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. డిమాండ్ అంతగా లేని కారణంగా కనీసం రెండు త్రైమాసికాల పాటు అమ్మకాల్లో ఒత్తిడి కొనసాగుతుందని ఆయన చెప్పారు. గత 20 రోజుల కరెన్సీ కదలికలు ఆందోళన కలిగిస్తున్నాయంటూ యూరో మారకంలో రూపాయి ఇప్పటికే 95కి చేరిందని, ప్రస్తుతం తమ కార్ల ధరలు 90 స్థాయిలో ఉన్నాయని అయ్యర్ తెలిపారు. ఈ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు తాము ధరలు పెంచక తప్పకపోవచ్చని అయ్యర్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	435
వరంగల్	417	గోదావరి	415
చిత్తూరు	470	విశాఖపట్నం	415
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	96	విజయవాడ	100
వరంగల్	96	గుంటూరు	100
కరీంనగర్	96	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	94
కర్నూలు	96	నెల్లూరు	99
విశాఖపట్నం	94	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,000 ▲	82,500 ▲	1,13,000 ▲
విజయవాడ	90,200 ▼	86,000 ▲	1,05,000 ▲
విశాఖపట్నం	89,080 ▲	81,660 ▲	1,01,840 ▲
రాజమండ్రి	90,000 ▲	82,500 ▲	1,03,100 ▲
ప్రొద్దుటూరు	89,200 ▲	82,600 ▲	1,00,800 ▲
ముంబై	88,354 ▲	80,932 ▲	1,00,400 ▲

రిలయన్స్ క్యాపిటల్ టేకోవర్ పూర్తి

నేడు ఐఐహెచ్ఎల్‌కు యాజమాన్య బదిలీ

ముంబై: మూడేళ్ల పాటు కొనసాగిన దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా రిలయన్స్ క్యాపిటల్ కొనుగోలు పూర్తయిందని ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్ఎల్) ఛైర్మన్ అశోక్ హిందూజా మంగళవారం ప్రకటించారు. దివాలా పరిష్కార పర్యవేక్షణదారు నుంచి రిలయన్స్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ హక్కుల బదిలీ బుధవారం జరగనుందని ఆయన వెల్లడించారు. రిలయన్స్ క్యాపిటల్‌ను ఐఐహెచ్ఎల్ రూ.9,650 కోట్లకు దక్కించుకుంది.

రెండేళ్లలో అన్ని వైడ్ బాడీ విమానాలకు కొత్త రూపం

ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్

న్యూఢిల్లీ: సంపూర్ణ ప్రక్షాళన బాటలో ఉన్న ఎయిరిండియా వారసత్వంగా వచ్చిన అన్ని వైడ్‌బాడీ విమానాలకు కొత్త రూపం కల్పించే కార్యక్రమాన్ని 2027 మధ్య నాటికల్లా పూర్తి చేయనుంది. ప్రపంచ విమానయాన మార్కెట్లో కనీసం వచ్చే నాలుగైదు సంవత్సరాల పాటు "సరఫరాల కొరత" కొనసాగుతుందని కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ చెప్పారు. నారో బాడీ విమానాలకు ఇంజన్ల కొరత, విమానాల ఫ్యూజిలేజ్‌లో ఉపయోగించే విడిభాగాలు, సీట్ల కొరత వంటివి ఇబ్బందికరంగా ఉన్న అంశాలని ఆయన తెలిపారు. అలాగే కొద్ది కాలం క్రితం ఎయిరిండియాలో విలీనమైన విస్తారా విమానాలకు కొత్తగా రంగులు వేసి అవసరమైన హంగులు చేసే పని ఏడాదిన్నర కాలంలో ముగుస్తుందని అన్నారు. విమానాలను కొత్త హంగులతో రీఫిట్ చేయడం తమ తొలి ప్రాధాన్యత అని ఆయన చెప్పారు. బోయింగ్ 777 విమానాల రీఫిట్ కార్యక్రమం గత ఏడాదే ప్రారంభం కావలసి ఉన్నప్పటికీ సీట్ల సరఫరాలో కొరత వల్ల జాప్యమైందని స్కిఫ్ట్ ఇండియా కార్యక్రమంలో మాట్లాడుతూ విల్సన్ తెలిపారు.

ఆల్ఫాబెట్ రూ.2.77 లక్షల కోట్ల డీల్

సైబర్ సెక్యూరిటీ స్టార్టప్ విజ్‌ను కొనుగోలు చేసిన గూగుల్ మాతృ సంస్థ

న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ భారీ కొనుగోలు చేపడుతోంది. సైబర్ సెక్యూరిటీ స్టార్టప్ 'విజ్'ను 3,200 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.77 లక్షల కోట్లు) చేజిక్కించుకోనుంది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. ప్రస్తుతం అమెజాన్, మైక్రోసాఫ్టే ప్రధాన పోటీదారులుగా ఉన్న క్లౌడ్ కంప్యూటింగ్ సేవల మార్కెట్‌లో పట్టు సాధించేందుకు ఆల్ఫాబెట్‌కు ఈ కొనుగోలు దోహదపడనుంది. "ఈ రోజుల్లో క్లౌడ్ సేవలందుకుంటున్న వ్యాపారాలు, ప్రభుత్వాలు మరింత పటిష్ఠమైన సెక్యూరిటీ సొల్యూషన్స్‌తోపాటు క్లౌడ్ కంప్యూటింగ్ సేవల కంపెనీల్లో గొప్ప చాయిస్ కోసం చూస్తున్నాయ"ని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. గూగుల్ క్లౌడ్, విజ్ సమ్మేళనం క్లౌడ్ సెక్యూరిటీని అత్యంత బలోపేతం చేయడంతోపాటు పలు క్లౌడ్‌లను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని పెంచనుందన్నారు. న్యూయార్క్ కేంద్రంగా నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన విజ్.. క్లౌడ్ నెట్‌వర్క్స్ కోసం సెక్యూరిటీ పరిష్కారాలను డిజైన్ చేస్తుంది.

- టాఫే (ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్) వైస్ ఛైర్మన్‌గా లక్ష్మీ వేణు నియమితులయ్యారు. ప్రస్తుతం లక్ష్మీ టాఫే డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కంపెనీ బోర్డు తనపై ఎంతో విశ్వాసం ఉంచి వైస్ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించిందని, రానున్న రోజుల్లో కంపెనీని మరింత వృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయనున్నట్లు లక్ష్మీ వెల్లడించారు. యూకేలోని యేల్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన లక్ష్మీ యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ నుంచి ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్‌ను అందుకున్నారు.
- ఎఫ్ఎంసీజీ సంస్థ రస్నా.. రస్నా రిచ్ పేరుతో ప్రత్యేకమైన ప్యాక్‌ను విడుదల చేసింది. సరికొత్తగా మామిడి ఫ్లేవర్‌తో రూ.10 ధరకే దీన్ని తీసుకువచ్చింది. ఒక ప్యాక్‌తో మూడు గ్లాసుల పానీయాన్ని తయారు చేయవచ్చని వెల్లడించింది. మామిడితో పాటు ఆరెంజ్, నిమ్మ, పైనాపిల్, మిక్స్‌డ్ ఫ్రూట్‌తో కూడా రిచ్ ప్యాక్ అందుబాటులో ఉండనుంది.
- పియాజియో వెహికల్స్.. హైదరాబాద్ మార్కెట్లోకి అప్రిలియా ట్యూనో 457 బైక్‌ను విడుదల చేసింది. యువ బైకర్స్ కోసం ఈ బైక్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. ట్విన్ సిలిండర్ ఇంజన్, అల్యూమినియం ఫ్రేమ్, ఎలక్ట్రిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ట్రాక్షన్ కంట్రోల్ రైడ్‌తో కూడిన ఈ బైక్ ధర రూ.3,96,005 (తెలంగాణ ఎక్స్‌షోరూమ్). రూ.10,000 చెల్లించి ఈ బైక్‌ను బుక్ చేసుకోవచ్చని, త్వరలోనే డెలివరీలు ప్రారంభించనున్నట్లు పియాజియో వెల్లడించింది.

చట్టసభల్లో బీసీ మహిళలకు 50% సబ్ కోటా ఇవ్వాల్సిందే

» అఖిల భారత బీసీ మహిళా సెమినార్‌లో తెలుగు ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళలకు కేటాయించిన 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 50 శాతం సబ్‌కోటా కేటాయించాలని కేంద్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. బీసీ మహిళలకు సబ్ కోటా ఇచ్చినప్పుడే వారికి రాజ్యాధికారం దక్కుతుందని అభిప్రాయపడ్డారు. మంగళవారం, ఏపీ/తెలంగాణ భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన అఖిల భారత బీసీ మహిళా సెమినార్‌లో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఈటల రాజేందర్, మాజీ ఎంపీ అజీజ్‌పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ మహిళల సబ్ కోటాకు రాజ్యాంగబద్ధంగా రక్షణ కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ సబ్ కోటా కోసం వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్యా, ఉద్యోగాల్లో కూడా బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. ఈ సెమినార్‌లో బీసీ సంఘం నేతలు పద్మలత, గుజ్జ సత్యం, రాజ్యలక్ష్మి, గుజ్జ కృష్ణ పాల్గొన్నారు.

వైటీడీఏ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట.. ట్రస్టు బోర్డు ఏర్పాటుకు వీలు

హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): యాదాద్రి ఆలయ అభివృద్ధి సంస్థ (వైటీడీఏ) బిల్లును మంగళవారం శాసనసభ ఆమోదించింది. మంత్రి కొండా సురేఖ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. యాదగిరిగుట్టలో టీటీడీ స్థాయిలో పాలక మండలిని ఏర్పాటు చేసే ఉద్దేశంతో చట్ట సవరణకు ఈ బిల్లును ప్రవేశపెట్టామని మంత్రి తెలిపారు. త్వరలో వైటీడీఏ ట్రస్టు బోర్డు ఏర్పాటవుతుందని, ఇది స్వయం ప్రతిపత్తిగల సంస్థగా ఉంటుందని చెప్పారు. గతంలో యాదగిరిగుట్టపై భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లులాంటి కనీస వసతులు ఉండేవి కావని, భక్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనే వారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోట్లాది రూపాయలు వెచ్చించి వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి మాట్లాడుతూ యాదగిరిగుట్ట ఆలయాన్ని కేసీఆర్ కట్టడం గొప్ప విషయమేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. కాకపోతే కేసీఆర్ కట్టినవన్నీ కూలిపోయాయని, ఇది దేవుడిది కాబట్టి కూలిపోలేదన్నారు. వైటీడీఏను యాదగిరిగుట్ట దేవస్థానం (వైజీడీ)గా మార్చాలని సూచించారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు రష్యా ప్రతినిధుల ఆసక్తి

» అనుకూలతలను వివరించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన రష్యా ప్రభుత్వ ప్రతినిధులకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంగళవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాజెక్టులో రష్యా కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని కోరారు. ప్రపంచంలోని అత్యుత్తమ కంపెనీల్లో అధిక శాతం తెలంగాణలో తమ కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నాయని చెప్పారు. అమెరికా తర్వాత అతిపెద్ద గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను అమెజాన్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం తమకు గర్వకారణమన్నారు.

బీసీ బిల్లు ఆమోదం బాధ్యత బీజేపీ ఎంపీలదే

» ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకెళ్లి, చట్టం చేయించాల్సిన బాధ్యత బీజేపీ ఎంపీలదేనని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీతో సమానంగా బీజేపీని ఎనిమిది లోక్‌సభ సీట్లలో గెలిపించారని.. అందువల్ల వారు ప్రధాని మోదీని కలిసి పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించేందుకు కృషి చేయాలని సూచించారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని సూచించారు.

న్యాక్‌లో రెండు కొత్త కోర్సులు ప్రారంభం

హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) రెండు కొత్త కోర్సులను ప్రకటించింది. ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఆరు నెలల సర్టిఫికేషన్‌తో పాటు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కోర్సు, ల్యాండ్‌స్కేప్ డిజైనింగ్‌లో మూడు నెలల సర్టిఫికేషన్‌తో పాటు మూడు నెలల ఇంటర్న్‌షిప్ కోర్సులను న్యాక్ ప్రారంభించింది. ఈ కోర్సులను మాదాపూర్‌లోని న్యాక్ క్యాంపస్‌లో అభ్యసించవచ్చు. ఏదైనా డిప్లమా లేదా డిగ్రీ చదువుతున్న/ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం www.nac.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

మొయినాబాద్ పీఎస్‌లో కేటీఆర్‌పై కేసు

» సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేశారని ఫిర్యాదు

మొయినాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలను బీఆర్ఎస్ నాయకులు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేశారని కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మండలాధ్యక్షుడు మాణయ్య నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేటీఆర్ సూచనలతోనే బీఆర్ఎస్ నాయకులు అలా చేశారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి జయరావు, డాక్టర్ కందుల మచ్చు, కొట్టాల యాదగిరి, మురళి, అనిల్, రవి కిరణ్, అభి, వర్ధన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం కేసు నమోదయినా పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ విషయమై వివరణ కోరగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఓయూ సర్క్యులర్‌పై ఆందోళన వద్దు: చనగాని

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన సర్క్యులర్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థి సంఘాలు సంయమనం పాటించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ పేర్కొన్నారు. త్వరలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లే బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

ఫోర్త్ సిటీ.. ఫోర్ బ్రదర్స్ సిటీ!

» శంభీపూర్ రాజు వ్యాఖ్యలపై మండలిలో గందరగోళం

» సభలో ఆదర్శంగా ఉండాలని మంత్రి శ్రీధర్‌బాబు హితవు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఫోర్త్ సిటీ.. ఫోర్ బ్రదర్స్ సిటీ అని, నలుగురు సోదరులు నిర్మిస్తున్నారనే ప్రచారం జరుగుతోందని బీఆర్ఎస్ సభ్యుడు శంభీపూర్ రాజు చేసిన వ్యాఖ్యలపై మంగళవారం శాసనమండలిలో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌ను ఆనుకుని ఫోర్త్ సిటీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయా? అని రాజు ప్రశ్నోత్తరాల సమయంలో అడిగారు. మంత్రి శ్రీధర్‌బాబు బదులిస్తూ ఫోర్త్ సిటీ ప్రతిపాదన లేదని చెప్పారు. రాజు మాట్లాడుతూ ఫోర్త్ సిటీ.. ఫోర్ బ్రదర్స్ నిర్మిస్తున్న సిటీ అని వ్యాఖ్యానించడంతో శ్రీధర్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది పెద్దల సభ.. ఆదర్శంగా ఉండాలని సూచించారు. రాజు స్పందిస్తూ శాసనసభలో సీఎం మాటలను ఉటంకించడంతో చైర్మన్ సుఖేందర్ రెడ్డి వారించే ప్రయత్నం చేశారు. మళ్లీ రాజు అదే తీరులో మాట్లాడే ప్రయత్నించగా అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 56 గ్రామాల పరిధిలోని 770 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్టు స్పష్టం చేశారు. రైతుల నుంచి ఎక్కడా బలవంతంగా భూములు సేకరించడం లేదని స్పష్టం చేశారు.

లెక్క తప్పంటే నష్టం బీసీలకే

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ బీసీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ వి.హన్మంతరావు బీసీ సంఘాల ప్రతినిధులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, దాసు సురేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఈ అభినందనలను మూటకట్టుకుని తీసుకెళ్లి రాహుల్‌గాంధీకి ఇచ్చే బాధ్యత తనదన్నారు. వాస్తవానికి 2011లో కులగణన ఆలోచన చేసిన రాహుల్ అప్పటి యూపీఏ ప్రభుత్వంతో గణన చేయించారని, కానీ ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఆ నివేదికను దాచిపెట్టిందని అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తెలంగాణలోనూ పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే కులగణన చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే, కేంద్రంలో అధికారంలోకి రాగానే రిజర్వేషన్లపై 50 శాతంగా ఉన్న పరిమితిని ఎత్తివేసి జనాభా ప్రాతిపదికన బలహీన వర్గాలకు రిజర్వేషన్ పెంచుతామనీ స్పష్టం చేశారన్నారు.

చట్టబద్ధత లేని లెక్కలతో రిజర్వేషన్ పెరగదు

కేంద్రం పదేళ్లకొకసారి చేసే జనగణనలో ఎస్సీ, ఎస్టీలు మినహా కులాల వారీగా గణన ఉండదన్నారు. తమ సంఖ్య ఇంత అని ఏ కులానికి ఆ కులం వారు చెప్పే లెక్కలకు చట్టబద్ధత ఉండదని తెలిపారు. చట్టబద్ధత లేని లెక్కలతో రిజర్వేషన్లు పెంచుకోలేమన్నారు. రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచుకోవాలని అనుకున్నప్పుడు చట్టబద్ధత కలిగిన లెక్కలు ఉండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్‌ను పెంచుకోవాలంటే ముందు బీసీ జనాభా లెక్క తేలాలన్నారు. అందుకే రాహుల్ ఇచ్చిన హామీ మేరకు 2024 ఫిబ్రవరి 4న కులగణన సర్వే ప్రారంభించి ఏడాది తిరిగే సరికి పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. భవిష్యత్తులో ఏ పరీక్షకైనా ఎదుర్కొని నిలిచేలా కులగణన డాక్యుమెంట్‌ను రూపొందించి అసెంబ్లీలో పెట్టామని చెప్పారు. భవిష్యత్తులో ఏ రాష్ట్రమైనా కులగణనపై సమగ్ర నివేదిక రూపొందించాలి అనుకుంటే తెలంగాణ, రేవంత్‌రెడ్డి వైపు చూడాల్సిందేనన్నారు. నాడు అంబేడ్కర్‌కు రాజ్యాంగాన్ని రాసే అవకాశం ఇచ్చినట్లుగానే కులగణన సర్వే నిర్వహించే బాధ్యతను తనతోపాటు మంత్రులు, ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ తదితరులకు కాంగ్రెస్ ఇచ్చిందని చెప్పారు. ఈ నివేదికను బీసీ సోదరులు తప్పు పడితే.. వారికి వారే నష్టం చేసుకున్నట్లు అన్నారు. కేంద్రం చేపట్టనున్న జనగణనలో కులగణననూ చేరిస్తే.. దేశం మొత్తం బీసీ జనాభా ఎంత ఉందో పక్కాగా తేలిపోతుందని సీఎం పేర్కొన్నారు. తొలి విడత కులగణన సర్వేలో బీసీ జనాభా 56.33 శాతంగా తేలితే.. రెండో విడత సర్వే తర్వాత అది 56.36 శాతానికి పెరిగిందన్నారు. మండల్ కమిషన్.. బీసీ జనాభా 52 శాతంగా అంచనా వేస్తే.. 56.36 శాతమని తాము లెక్క తేల్చి చెప్పానన్నారు. " దాచిపెట్టి చేయాల్సిన అవసరం మాకు లేదు. వాయిదాలే వేయాలనుకుంటే పదేళ్లు కూడా తెగని చిక్కుముడులు వేయవచ్చు. కానీ పది నెలల్లోనే ఎందుకు లెక్కలు తేల్చిన? కులగణన లెక్కలు తేల్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలనుకున్నాం. ఇందులో నాకు, ఉత్తమ్‌కు స్వలాభం ఏముంది?" అని సీఎం ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ఆలోచనని స్పష్టం చేశారు.



బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినందుకు సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ మహిళా నేతలు

రేపు రిజర్వేషన్లు 56 శాతానికీ పెరగొచ్చు

ఏమీ లేనప్పుడు బీసీలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు ఇచ్చిందని, ఆ తర్వాత అది 26 శాతానికి.. 29 శాతానికి ఇప్పుడు 42 శాతానికి చేరిందని, భవిష్యత్తులో 56 శాతానికీ చేరవచ్చునని సీఎం అన్నారు. పరిణామ క్రమంలో వచ్చేది తీసుకుని రావాల్సింది అడగాలి తప్ప.. ఏదో అడగాలని చెప్పి వచ్చేది తీసుకోకుంటే నష్టపోతామని చెప్పారు. కులగణన సర్వే ప్రక్రియ మొత్తాన్నీ తప్పు పడితే మళ్లీ మొదటికి వస్తుందన్నారు. పరిణామ క్రమంలో రాజ్యాంగాన్ని సవరించుకున్నట్లుగా భవిష్యత్తులో కులగణన సర్వేనూ సవరించుకోవచ్చు అని చెప్పారు.

కట్టిన ఇంట్లో ఉండనంటే.. ఆ ఇల్లు శిథిలమవుతుంది

"ఏడంతస్తుల మేడ కట్టుకునేంత బలమైన పునాది వేసి.. రెండంతస్తుల నిర్మాణం నేను పూర్తి చేశా. ఉన్న వ్యవస్థను వాడుకుని మిగిలిన ఐదంతస్తుల నిర్మాణం మీరు పూర్తి చేసుకోండి. లేదూ ఏడంతస్తుల నిర్మాణం పూర్తయ్యేవరకూ ఈ ఇంట్లోకి రానంటే.. ఈ లోపు కట్టింది శిథిలమైపోతుంది" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చట్టబద్ధంగా తాము తేల్చిన 56.36 శాతం లెక్కను భవిష్యత్తులో పెంచుకోవడం తేలికన్నారు. కులాల ముసుగులో కొందరు రాజకీయంగా ఎదగాలని చూస్తుంటారని, అలాంటి వారి మాయలో పడకండని బీసీలకు హితవు పలికారు. కులగణన సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అడుగుతున్న బీసీలు.. భవిష్యత్తులో చట్టసభల్లోనూ 42 శాతం రిజర్వేషన్ కోసం కొట్లాడవచ్చన్నారు. కులగణన సర్వేని తప్పు అన్న మరుక్షణం వాదించడానికి బలం ఉండదని, ఆ వాదనతో ఫలితాలూ రావని సూచన చేశారు. అందరం కలిసి జనగణనలో కులగణన చేర్చాలని కొట్లాడితే కేంద్రం ఎందుకు చేర్చదన్నారు. రిజర్వేషన్ల పెంపుతో పాటు జనగణనలో కులగణన కూడా చేయాలన్న డిమాండ్‌తో ఢిల్లీలో ధర్నా చేయాలని సూచించారు. దానికి అన్ని పార్టీలనూ ఆహ్వానించాలని, కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ఉంటుందని ప్రకటించారు. ఇక, సూర్యాపేట లేదా పరేడ్ గ్రౌండ్‌లో రాహుల్‌గాంధీకి అభినందన సభ పెడితే.. తాను, టీపీసీసీ అధ్యక్షుడు కలిసి రాహుల్ గాంధీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇక, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన సర్వేతో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ బిల్లుల ఆమోదంతో ఒక ఘట్టం ముగిసిందని, ఢిల్లీ వెళ్లాల్సిన ఘట్టం మిగిలుందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ దేశంలో ఏ రిజర్వేషన్లు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే వచ్చాయన్నారు.

కాంగ్రెస్ సంబురాలు.. సీఎంకు బీసీ, ఎస్సీ సంఘాల కృతజ్ఞతలు

ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లుల ఆమోదంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు ఆధూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, అనిల్‌కుమార్ తదితరులు అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద మిఠాయిలు పంచిపెట్టారు. మరోపక్క, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌సహా పలువురు బీసీ సంఘం నేతలు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టి చట్టబద్ధత కల్పించినందుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వంగపల్లి శ్రీనివాస్, మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ తదితరులు కూడా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నెల రోజులు సంబురాలు చేయండి!

» ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లుల ఆమోదం నేపథ్యంలో.. పార్టీ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ పిలుపు

» మంత్రి పొన్నం, టీపీసీసీ చీఫ్‌లకు సన్మానం

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్యా.. ఉద్యోగావకాశాల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ రెండు బిల్లులకు.. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభలో ఆమోదం లభించిన నేపథ్యంలో.. రాబోయే నెల రోజులూ గ్రామగ్రామాన సంబురాలు జరపాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపైన పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచించారు. మంగళవారం ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ నిర్ణయాలు తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే ఘట్టాలన్నారు. ఇవి రాష్ట్రంలో సామాజిక విప్లవానికి పునాదులు వేశాయన్నారు. ఈ నిర్ణయాలను ప్రజలకు తెలిపేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం సాయంత్రం మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌లను సన్మానించాయి.

బీసీ రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో మద్దతిస్తాం

» బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో మద్దతిస్తామని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ఆమోదం తెలపడాన్ని ఆయన స్వాగతించారు. అఖిల పక్షాన్ని ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లి పార్లమెంటులో ప్రవేశపెట్టి, అది ఆమోదం పొందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. బీసీ రిజర్వేషన్ చట్టం రూపొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. తమిళనాడులా విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలు, కాంట్రాక్టు పనులతోపాటు ఇతర అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.



తెలంగాణలో బీసీ రిజర్వేషన్ బిల్లు విప్లవాత్మకం

» దేశానికే మార్గం చూపిన తెలంగాణ

» ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని నెరవేర్చాం

» రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందడంపై కాంగ్రెస్ అగ్రనేతలు, ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ బిల్లు విప్లవాత్మకమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొనియాడారు. దేశవ్యాప్తంగా కుల గణనకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మార్గం చూపిందని అన్నారు. కుల గణన దేశానికి అవసరమని, దాన్ని తాము చేసి చూపుతామని వెల్లడించారు. తెలంగాణలో ఓబీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో జరిగిన కుల గణనలో ఓబీసీల లెక్కపై స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. ఇక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన మరో హామీని నెరవేర్చిందని ప్రియాంక గాంధీ అన్నారు. బిల్లు ఆమోదం పొందడం సామాజిక న్యాయం అమలులో కీలకమైన అడుగని హర్షం వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేధావి అని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ ప్రశంసించారు.

పన్నుల వాటాలో ఏపీ, తెలంగాణకు స్వల్పమే

» ఏపీకి 4, తెలంగాణకు 2 % మాత్రమే

» దక్షిణాదికి లభించిన మొత్తం కంటే యూపీకి రూ.80 వేల కోట్లు అధికం

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక కమిషన్ తుది నివేదిక ప్రకారం నికర పన్నుల్లో గత అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు 4.047 శాతం, తెలంగాణకు 2.102 శాతం వాటా లభించిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదురి రాజ్యసభకు తెలిపారు. 2024-25లో మార్చి 10 నాటికి పన్నులు, సుంకాల్లో ఏపీకి రూ.52080.15 కోట్లు, తెలంగాణకు రూ.27,050.25 కోట్లు, కర్ణాటకకు రూ.46,932.72 కోట్లు, కేరళకు రూ.24,772.18 కోట్ల వాటా లభించింది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటకకు 3.647 శాతం, తమిళనాడుకు 4.07 శాతం, కేరళకు 1.925 శాతం దక్కింది. గత అయిదేళ్లలో నికర పన్నుల్లో ఉత్తరప్రదేశ్‌కు 17.939 శాతం, బిహార్‌కు 10.05 శాతం, మధ్యప్రదేశ్‌కు 7.85 శాతం, పశ్చిమ బెంగాల్‌కు 7.523 శాతం, రాజస్థాన్‌కు 6.02 శాతం వాటా లభించింది. 2024-25లో దక్షిణాది రాష్ట్రాలకు కలిపి రూ.1,50,835.30 కోట్లు లభించగా, ఒక్క ఉత్తరప్రదేశ్‌కే 2,30,854.62 కోట్ల వాటా లభించం గమనార్హం.

బీసీల బిల్లులకు మండలి ఆమోదం

» రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు పార్లమెంటులో ఆమోదింపజేయాలి

» మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన

» కేంద్రం ఆమోదం అవసరమంటూ మాయమాటలు చెప్పవద్దు: కవిత



హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యా ఉపాధి రంగాల్లో, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రవేశపెట్టిన రెండు బిల్లులకు శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సోమవారం శాసనసభలో ఈ రెండు బిల్లులకు ఆమోదం లభించిన అనంతరం మండలిలో ప్రవేశపెట్టగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన 16 మంది సభ్యులు ఈ సందర్భంగా జరిగిన చర్చలో పాల్గొన్నారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే నిబంధనను రాజ్యాంగ సవరణ 103 ప్రకారం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు కోసం ఎత్తివేయడంతో.. బీసీ రిజర్వేషన్లు 29 నుంచి 42 శాతానికి పెంచడానికి మార్గం సుగమమవుతుందని పొన్నం పేర్కొన్నారు. పలు రాష్ట్రాల్లో 50 శాతం దాటి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. తమిళనాడులో జయలలిత 69 శాతం రిజర్వేషన్లు అమలు చేసినట్లు తెలిపారు. కర్ణాటకలో 66 శాతం, లక్షద్వీప్‌లో 100 శాతం ట్రైబల్ రిజర్వేషన్, రాజస్థాన్‌లో 64 శాతం, సిక్కింలో 80 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్ని పార్టీల నేతలతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్రంలోని బీజేపీని ఒప్పించాల్సి ఉందన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేసి ప్రజల ముందుంచాలని కోరారు. అంతకు ముందు బీఆర్ఎస్ సభ్యులు ఎల్.రమణ, కవిత, మధుసూదనాచారి తదితరులు మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ప్రకటించారు. కానీ బీసీలకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని విమర్శించారు. బీసీలను మభ్యపెట్టవద్దని, రాజకీయ రిజర్వేషన్లకు కేంద్ర ఆమోదం అవసరమనే మాయమాటలు చెప్పవద్దని కవిత పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి నుంచి బీసీలు అన్యాయానికి గురవుతున్నారని తీన్మార్ మల్లన్న ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు విద్యా ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత పెరగాలని ఏవీఎన్ రెడ్డి (బీజేపీ) అన్నారు. అఫెండీ (మజ్లిస్) బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు పలికారు. రాజ్యాంగం ప్రకారం బీసీలు సమాన హక్కులు పొందడానికి రిజర్వేషన్లు అవసరమని ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పారు. కుల గణన సర్వేలో కురుమల సంఖ్యను తగ్గించారని యెగ్గె మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు.

సమాధానాలు చెప్పలేక ప్రశ్నోత్తరాలను ఎత్తేస్తారా?

» ప్రభుత్వ భూములు తాకట్టు పెట్టి 50 వేల కోట్ల అప్పునకు యత్నం

» నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి

» మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతలు అడిగే ప్రశ్నలకు అసెంబ్లీలో సమాధానం చెప్పలేక ప్రభుత్వం ప్రశ్నోత్తరాలను ఎత్తివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ప్రశ్నోత్తరాలను ఎత్తివేయడంపై స్పీకర్‌కు, అసెంబ్లీ కార్యదర్శికి అభ్యంతరం తెలిపామని చెప్పారు. ఈ ప్రభుత్వం సర్కార్ భూములను తాకట్టు పెట్టి రూ. 50 వేల కోట్ల రూపాయల అప్పు తేవడానికి ప్రయత్నిస్తోందని, దీనిపై ప్రశ్నించడానికి సన్నద్ధమైతే సమాధానం చెప్పలేక తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. హెచ్ఎండీఏ భూముల ద్వారా 20 వేల కోట్లు, టీజీఐఐసీ భూముల ద్వారా 10 వేల కోట్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ భూముల ద్వారా 10 వేల కోట్లు, జీహెచ్ఎంసీ భూములను తాకట్టు పెట్టి 10 వేల కోట్లు.. మొత్తం రూ. 50 వేల కోట్లు అప్పు తేవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వివరించారు. సాగునీరు లేక పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని, దేవాదుల, మల్లన్న సాగర్ ఆయకట్టు కింద ఎండిపొలాలే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్ల తక్కువ ధరకు రైతులు పంటను అమ్ముకుని నష్టపోయారన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

అసెంబ్లీ ఆవరణలో బీజేపీ ఎమ్మెల్యేల బైఠాయింపు

» 'ఏలేటి' పట్ల పోలీసుల వైఖరికి నిరసన

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పట్ల పోలీసుల వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అంతకుముందు హెచ్‌సీయూ భూములను విక్రయించవద్దని డిమాండ్ చేస్తూ బీజేవైఎం కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడి చేపట్టారు. వీరికి మద్దతుగా మహేశ్వర్ రెడ్డి గన్‌పార్క్ వద్దకు చేరుకోగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ఆవరణలోకి పోలీసు వాహనంలో వచ్చిన మహేశ్వర్‌రెడ్డి సుమారు పావు గంట పాటు అందులోనే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు నచ్చజెప్పడంతో వాహనం దిగారు. ఇదే సమయంలో పార్టీ మిగతా ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకున్నారు. పోలీసు అధికారులు తనపట్ల వ్యవహరించిన తీరు పట్ల మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ అంశంపై సహచర ఎమ్మెల్యేలతో అక్కడే చెట్టుకింద బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కొద్దిసేపటి తర్వాత అసెంబ్లీ ప్రధాన ద్వారం మెట్లపై కూర్చుని నిరసన కొనసాగించారు. చీఫ్ మార్షల్ వచ్చి, స్పీకర్ కార్యాలయానికి సమాచారం అందించామని, నిరసన విరమించాలని కోరారు. దీంతో, ఎమ్మెల్యేలు నిరసన విరమించి సభకు హాజరయ్యారు.



సీఎంను కలిసిన గుమ్మడి నర్సయ్య

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువస్తూ.. ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. ఇటీవల సీఎంను ఆయన ఇంటి వద్ద కలిసేందుకు గుమ్మడి నర్సయ్య ప్రయత్నించిన విషయం తెలిసిందే..! అపాయింట్‌మెంట్ లేకపోవడంతో ఆయన సీఎంను కలవడం కుదరలేదు. దీనిపై మీడియాలో ప్రచారం జరగ్గా.. సీఎం రేవంత్ అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తి, తప్పకుండా గుమ్మడి నర్సయ్యను కలుస్తానన్నారు. ఆ మేరకు మంగళవారం అసెంబ్లీకి పిలిపించుకున్నారు.

శూన్యగంట.. నిరసనల మంట

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం జరిగిన జీరో అవర్‌లో పలువురు శాసనసభ్యులు అసమ్మతి రాగం వినిపించారు. ఇందులో పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను సస్పెండ్ చేసిన స్పీకర్ ప్రసాద్ కుమార్ జీరో అవర్‌లో సభ్యులకు మాట్లాడే అవకాశం ఇచ్చారు.

ఎప్పట్లానే శిలాఫలకం ధ్వంసం చేశా : దానం

నా నియోజకవర్గంలో క్యాంప్ ఆఫీస్ కోసం 15 నెలల క్రితం దరఖాస్తు చేశా ఇప్పటికీ స్పందన లేదు. నాకు తెలియకుండా నా నియోజకవర్గంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించి శిలాఫలకం వేశారు. రెగ్యులర్ స్టైల్లో దానిని ధ్వంసం చేశా. మంత్రిగా చేశా... జీరో అవర్‌లో సభ్యులు ఏం మాట్లాడినా నోట్ చేసుకొని.. బయటికి వెళ్లి చించేస్తారు. సోషల్ మీడియా పేరుతో జరుగుతున్న బెదిరింపులను అడ్డుకోవాలి.

- దానం నాగేందర్, ఖైరతాబాద్

నాలుగు సార్లు ఎమ్మెల్యేని.. ఏం ప్రయోజనం

నా నియోజకవర్గంలో అటవీ భూముల సమస్యను పరిష్కరిస్తానని ప్రతీ ఎన్నికల్లో హామీ ఇస్తున్నా. గత బల్దియా ఎన్నికల్లో జూపల్లి కృష్ణారావు కూడా 15 రోజుల్లో పట్టాలిస్తానని హామీ ఇచ్చినా కాలేదు. నాలుగు సార్లు ఎమ్మెల్యేని సమస్య పరిష్కారం కాకుంటే ఏం ప్రయోజనం.

- ప్రకాశ్ గౌడ్, రాజేంద్రనగర్

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

నా నియోజకవర్గంలో రైస్ మిల్లులు ఎక్కువ. కరెంట్ కోతలు ఉంటున్నాయి. కోతలు లేకుండా విద్యుత్ ఇవ్వాలి. మిర్యాలగూడ మునిసిపాలిటీని అప్‌గ్రేడ్ చేయాలి. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి.

- బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ

ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి

రంగారెడ్డి జిల్లాలో భూములను అమ్మి ఆ నిధులను ఇతర జిల్లాల్లో ఖర్చు పెడుతున్నారు. కొంగరకలాన్‌లో సర్వేనెం.300లో రూ.2000కోట్ల విలువైన భూమిని ఓ ఎమ్మెల్యేకు కట్టబెట్టారు. ఇవే కాదు అన్యాక్రాంతమైన భూములన్నీ వెనక్కి తీసుకొని జిల్లా అభివృద్ధికి కేటాయించాలి. మీరు(స్పీకర్) అక్కడున్నారు.. నేను ఇక్కడున్నా. మీరు మాట్లాడలేరు. నాకు మాట్లాడే అవకాశం రాదు. 2014 నుంచి అన్యాక్రాంతమైన భూముల వివరాలను ఇస్తా. ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకోవాలి.

- మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం

సీతారామలో ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి

సీతారామ ఎత్తిపోతల పథకంలోని డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-6 కింద కెనాల్‌ల కోసం రైతుల నుంచి భూసేకరణ వద్దు. పాత కెనాల్‌లను ఉపయోగిస్తే భూసేకరణ ఖర్చు తగ్గుతుంది. ఇక సింగరేణి సైలో బంకర్ అంశంలో మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలి.

- మట్టా రాగమయి, సత్తుపల్లి

చెరువుల మరమ్మతులు చేస్తలేరు

గత వర్షాకాలంలో 100 చెరువులు దెబ్బతిన్నా.. ఇప్పటిదాకా మరమ్మతులు చేయలేదు. తక్షణమే మరమ్మతులకు నిధులు ఇవ్వాలి. త్వరలో గోదావరి పుష్కరాల జరగనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చెయ్యాలి.

- రామారావు పవార్, ముథోల్

15 రోజులుగా కలుషిత నీరే

హైదరాబాద్‌లో 15 రోజులుగా కలుషిత నీటినే సరఫరా చేస్తున్నారు. కృష్ణా మూడో దశ నుంచి హైదరాబాద్‌కు నీటిని అందిస్తున్నారు. ఒక్కసారి పైప్‌లైన్ దెబ్బతింటే నాలుగైదు రోజులు నీటి సరఫరా ఆగిపోతుంది. లోప్రెషర్ సమస్య కూడా ఉంది.

- కౌసర్ మొయినుద్దీన్, కార్వాన్

కోయిల్‌కొండలో బీసీ గురుకులానికి కొత్త భవనం

కోయిల్‌కొండ బీసీ గురుకులంలో విద్యార్థుల కోసం శాశ్వత ప్రాతిపదికన కొత్త భవనం కట్టాలి. ఇటీవల పాఠశాల భవనంలోకి పాములు కూడా వచ్చాయి. ధన్వాడలో డిగ్రీ కాలేజీ. నారాయణపేటలో మైనార్టీ గురుకుల పాఠశాల పెట్టాలి.

- చిట్టెం పర్ణికారెడ్డి, మక్తల్

వందశాతం రుణమాఫీ జరిగితే రాజీనామా చేస్తా

నన్ను ఎక్స్‌పెల్ చేస్తానని సీఎం పదేపదే అంటున్నారు. హుజూరాబాద్‌లోని 117 గ్రామంలో ఏ ఒక్క గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నేనే వెళ్లిపోతా. కల్వల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి.

- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్

రూ.4కోట్లిస్తే 580 ఇళ్లు సిద్ధమవుతాయి

నియోజకవర్గంలో 252 ఇళ్ల నిర్మాణ పనులు 80 శాతం మేర జరిగాయి. మరో 396ఇళ్లు పూర్తయినా పేదలకు ఇవ్వడం లేదు. రూ.4 కోట్లు కేటాయిస్తే నిర్మాణంలో ఉన్న 580 ఇళ్లు పూర్తవుతాయి. పూర్తయిన ఇళ్లను దసరాకు ఇస్తామన్నా ఇప్పటిదాకా ఇవ్వలేదు. తెలంగాణ వర్సిటీలో బాలికల కోసం అదనంగా హాస్టల్ కట్టాలి.

- ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ అర్బన్

కరకట్టలు కట్టాలి

గత గోదావరి వరదలకు భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగింది. ఆ సమయంలో ఇళ్లు, కరకట్టల నిర్మాణం కోసం రూ.1000 కోట్లు ఇస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించినా... ఆ నిధులు రాలేదు. వరదల నుంచి బూర్గంపాడు, పినపాకల రక్షణ కోసం కరకట్టలు నిర్మించాలి.

- పాయం వెంకటేశ్వర్లు, పినపాక

అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించాలి

నిర్మాణం పూర్తయిన అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను ప్రారంభించి, సర్వీసు రోడ్డు ఏర్పాట్లు చేయాలి. గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ గెలవలేదనేమో తెలియదు కానీ.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఒక్క పనిని మంజూరు చేయడం లేదు. ఇలాగైతే నగర ప్రతిష్ఠ ఏం కావాలి.

- కాలేరు వెంకటేశ్, అంబర్‌పేట

44 కాలనీల సమస్యలు పరిష్కరించాలి

బీఎన్‌రెడ్డి నగర్‌తోపాటు 44 కాలనీల్లోని భూసమస్యను పరిష్కరించాలి. గత ప్రభుత్వం ఎన్నికల ముందు జీవోనెం.118ను తెచ్చింది. రూ.200కు గజం చొప్పున భూములను క్రమబద్ధీకరించింది. 70 శాతం మందికి కన్వేయన్స్ డీడ్‌లు జారీ చేశారు. రెక్టిఫికేషన్‌కు అవకాశం ఇవ్వడం లేదు. తక్షణమే క్రమబద్ధీకరణ సమస్యను పరిష్కరించాలి.

- సుధీర్‌రెడ్డి, ఎల్బీనగర్

బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేరు

హైదరాబాద్‌లోని బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేరు. వైద్యులు లేకుంటే రోగులను ఎవరు చూస్తారు. కనీస మందులు కూడా అందుబాటులో లేవు. రక్త పరీక్షలు చేసే వారు లేరు.

- జాఫర్ హుస్సేన్, యాకుత్‌పురా

ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేయాలి

ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో నగదు రహిత వైద్యసేవలు ఆగిపోయాయి. తక్షణమే బిల్లులు విడుదల చేయాలి. ఆరోగ్యశ్రీ వైద్యసేవలు కొనసాగాలి.

- పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్

ఇందిరాపార్కు వద్ద పూర్వస్థితిని పునరుద్ధరించాలి

గత ప్రభుత్వం ఇందిరా పార్కు వద్ద నిరసనలు రద్దు చేస్తే హైకోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నాం. ప్రస్తుతం శాసనసభ జరుగుతుంటే ఇందిరాపార్కు వద్ద ధర్నాలకు అనుమతులు ఇవ్వడం లేదు. పూర్వ పరిస్థితిని పునరుద్ధరించాలి. ఓయూ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలపై నిషేధం విధిస్తూ జారీ చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి.

- కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత

బిల్లుకు అసెంబ్లీ ఉభయసభల ఆమోదం.. ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సభ్యులు

- వర్గీకరణ చేస్తామని చెప్పాం.. చేశాం
- కమిషన్ సూచించిన సిఫారసులన్నీ అమలు
- 2026 లెక్కల తర్వాత రిజర్వేషన్ల పెంపు
- అసెంబ్లీ చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి
- బిల్లుకు గవర్నర్ ఆమోదమే తరువాయి
- ఆపై వర్గీకరించిన రిజర్వేషన్ల అమలు
- ఇకపై వేసే ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్తింపు



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించిన ప్రభుత్వం.. ఆ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించింది. ఇందుకు సంబంధించి సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన 'తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు-2025'ను మంగళవారం అసెంబ్లీ ఉభయసభలు ఆమోదించాయి. దీనిపై శాసనసభ, శాసనమండలిలో చర్చించిన అనంతరం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభలో జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ప్రకటిస్తున్నందుకు గర్వంగా భావిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ పోరాటంలా.. ఎస్సీ వర్గీకరణ పోరాటం సైతం 30 ఏళ్లుగా సంక్లిష్టంగా మారుతూ వచ్చిందని, అనేక ఆటుపోట్లు, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని అన్నారు. ఈ సమస్యకు సభ పరిష్కారం చూపడం చరిత్రాత్మకమైన సందర్భమని, ఇది వ్యక్తిగతంగా తన మనసుకు దగ్గరగా ఉన్న అంశమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సోనియాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించినట్టుగా.. నేడు ఎస్సీ వర్గీకరణను ప్రకటించామన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించిన గంటలోపే.. తమ ప్రభుత్వం విధానాన్ని స్పష్టంగా ప్రకటించిందని గుర్తుచేశారు. ఇందుకు పార్టీలకతీతంగా మద్దతు పలికారంటూ ధన్యవాదాలు తెలిపారు.

దళితులకు పెద్దపీట వేసిన కాంగ్రెస్..

"జడ్పీటీసీ నుంచి సీఎం వరకు నాకు ప్రతి అడుగులో సంపూర్ణ మద్దతు పలికిన వర్గాలివి. శాశ్వతమైన పరిష్కారం చూపించాలన్న ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. వర్గీకరణ చేయాలి, చట్టం చేయాలని వైఎస్సార్ ఇదే సభలో తీర్మానం చేశారు. 2007లో ఉషా మెహ్రా కమిషన్‌ను నియమించగా.. 2008 మే నెలలో కేంద్రానికి నివేదిక అందించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్-341లో సవరణలు చేయడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని పార్లమెంటులో ఆమోదించవచ్చని ఉషా మెహ్రా కమిషన్ నివేదిక ఇచ్చింది. కానీ, వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. దళితులకు పెద్దపీట వేస్తూ వచ్చిన పార్టీ కాంగ్రెస్. అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా దళితులను నియమించిన పార్టీ. అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని 2018 శాసనసభ ఎన్నికల ప్రచారంలోనే రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. 2023 ఆగస్టు 26న చేవెళ్లలో జరిగిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో మల్లికార్జున ఖర్గే కూడా స్పష్టంగా చెప్పారు. వారందరి నిర్ణయాలు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈరోజు నిర్ణయం తీసుకున్నాం" అని సీఎం రేవంత్ అన్నారు.

ఢిల్లీకి వెళ్లి అభిప్రాయాలు స్పష్టంగా చెప్పాం..

1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించగా.. 1997లో ఇచ్చిన నివేదిక ఆధారంగా వర్గీకరణ చేస్తూ ఏబీసీడీ విభాగాల వారిగా జీవో 68, రోస్టర్ విధానం అమలుకు జీవో 69 ఇచ్చారని సీఎం గుర్తు చేశారు. 2000 ఏప్రిల్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ అమలు చేశారని, ఆ తర్వాత విషయం కోర్టులకు చేరిందని అన్నారు. "ఏపీ వర్సెస్ చెన్నయ్య కేసులో ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం 3:2 ప్రకారం తీర్పు ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని కోరుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2005 డిసెంబరు-10న రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. అయితే గతంలో పంజాబ్ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు సేకరించారు. దీనిపై ఏడుగురు సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు.. కాంగ్రెస్ ప్రభుత్వం తమ అభిప్రాయాలు స్పష్టంగా చెప్పింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక దామోదర రాజనర్సింహ నేతృత్వంలో ఎస్సీ ఎమ్మెల్యేలతో ఓ కమిటీని నియమించాం. వీరందరు ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు" అని ముఖ్యమంత్రి వివరించారు.



సుప్రీం తీర్పు ఇచ్చిన గంటలోనే చెప్పేశాం..

సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన గంటలోపే తెలంగాణలో వర్గీకరణ చేపడతామని ప్రకటించినట్లు సీఎం రేవంత్ గుర్తు చేశారు. "రాజకీయ ఉద్దేశంతో కాకుండా ఎంపీరికల్ డేటా ఆధారంగా చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. జనాభా, అక్షరాస్యత శాతం, అనుసరిస్తున్న వృత్తులు, ఉద్యోగాలు, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా వర్గీకరణ చేయాలని చెప్పింది. దీనికోసం ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాం. ఈ ఉపసంఘం ఆరుసార్లు సమావేశమైన అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వారి సూచనలతో జస్టిస్ షమీమ్ అక్తర్‌తో ఏకసభ్య కమిషన్ నియమించాం. ఆయన జిల్లాల్లో పర్యటించి మొత్తం 8681 దరఖాస్తులు స్వీకరించారు. అన్ని విషయాలను లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. నివేదికను ఫిబ్రవరి 3న మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించగా మరుసటిరోజే మంత్రివర్గం సమావేశమై కమిషన్ చేసిన సిఫారసులన్నింటినీ అమలు చేశాం" అని సీఎం వివరించారు.

15 శాతం ఎస్సీ రిజర్వేషన్ల విభజన ఇలా..

59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజించామని సీఎం వెల్లడించారు. "సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాలను గ్రూప్-1 కింద తీసుకుని వీరికి 1శాతం రిజర్వేషన్ కల్పించారు. మధ్యస్థంగా లబ్ధిపొందిన ఎస్సీ కులాలు 18 ఉండగా.. వీరికి 9శాతం రిజర్వేషన్ గ్రూప్-2 కింద కల్పించారు. గణనీయంగా లబ్ధి పొందిన వారిని గ్రూప్-3గా విభజించారు. ఇందులో 26 కులాలుండగా.. 5శాతం రిజర్వేషన్ కల్పించారు. ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగా ఉన్న 15శాతం రిజర్వేషన్లను ఇలా పంచడం జరిగింది. విద్య, ఉపాధితో పాటు, రాజకీయాల్లోనూ వీటిని పాటించాలని ఈరోజు నివేదిక తెచ్చాం. ఈ సందర్భంగా ఎస్సీ ఉద్యమంలో కన్నుమూసిన వారికి ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇస్తున్నా. ఎస్సీ ఉపకులాల కుటుంబాల్లో చదువుకున్న వారికి రాజీవ్ యువ వికాసం పథకంలో రూ.4 లక్షల వరకు అందిస్తాం. ఏ నిర్ణయమైనా 51 శాతం తీసుకుంటే సరిపోతుంది. కానీ, ఇక్కడ వందశాతం మద్దతు పలికారు. రిజర్వేషన్లను దామాషా ప్రకారం ఎస్సీలకు 15 నుంచి 18,శాతానికి పెంచాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కోరారు. 2026 జనాభా లెక్కలు పూర్తికాగానే ఎస్సీ ఉపకులాల రిజర్వేషన్లను దామాషా ప్రకారం పెంచే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది" అని సీఎం అన్నారు.

గవర్నర్ ఆమోదమే తరువాయి..

ఎస్సీలను వర్గీకరించాలన్న ఏళ్ల నాటి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపడంతో పాటు వర్గీకరణకు చట్టబద్ధత కూడా కల్పించింది. అసెంబ్లీ ఉభయ సభల్లో ఆమోదం పొందిన ఈ బిల్లు ఇక గవర్నర్ వద్దకు వెళ్లనుంది. రాజ్యాంగంలోని 200వ ఆర్టికల్ కింద గవర్నర్ దానికి ఆమోదం తెలిపిన తరువాత రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత రావడంతో పాటు ఆయా కులాలకు కేటాయించిన రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం కానుంది. దీంతో సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఎస్సీ వర్గీకరణ చేపట్టి, చట్టబద్ధత కల్పించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపిన అనంతరం.. ఇకపై ప్రభుత్వం ప్రకటించే ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లకు వర్గీకరణ ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లు ఆయా వర్గాలకు వర్తించనున్నాయి. కాగా ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎంలు చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. ఎస్సీల రిజర్వేషన్‌ల అమలుకు పాటుపడగా, మళ్లీ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీల వర్గీకరణ, రిజర్వేషన్ల అమలుకు కృషి చేసిన ఘనత దక్కించుకున్నారు.

వర్గీకరణ ఇలా..

రాష్ట్రంలో ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజిస్తూ జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఆయా వర్గాలు, జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించింది. దాని ప్రకారం గ్రూప్-1లో అత్యంత వెనుకబడిన 15 కులాలకు (3.288 శాతం జనాభా) 1శాతం రిజర్వేషన్ కేటాయించాలని సిఫారసు చేసింది. ఇక గ్రూప్-2లో మాదిగ, దాని ఉపకులాలుగా ఉన్న 18 కులాలకు (62.748 శాతం) 9శాతం, గ్రూప్-3లో మాల, దాని ఉపకులాలుగా ఉన్న (33.963 శాతం జనాభా) 26 కులాలకు కలిపి 5శాతం చొప్పున రిజర్వేషన్‌ను కేటాయించింది. గ్రూప్-1లో 1,71,625 మంది, గ్రూప్-2లో 32,74,377 మంది, గ్రూప్-3లో 17,71,1682 మంది జనాభా ఉన్నారని తెలిపింది. ఎస్సీల వర్గీకరణ కోసం కులాలు, రిజర్వేషన్‌లతో పాటు క్రీమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలంటూ ఏక సభ్య కమిషన్ మొత్తం 4 సిఫారసులను చేసింది.2011 జనాభా లెక్కల ఆధారంగానే కమిషన్ ఈ సిఫారసులు చేసింది. అయితే వీటిలో క్రీమీలేయర్ మినహా మిగిలిన మూడు సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది.

మాలల కంటే మాదిగ ఉద్యోగులే ఎక్కువ

- కులగణన మేరకు 18 శాతం రిజర్వేషన్లు.. బడ్జెట్‌లో నిధులను కేటాయించండి
- కాంట్రాక్టు పనులు, నామినేటెడ్ పోస్టుల్లో.. మాలలకు ప్రాధాన్యమివ్వాలి: వివేక్



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల్లో మాలల కంటే మాదిగలే ఎక్కువ ఉన్నారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మాట్లాడారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వారిలో మాలలే అధికంగా ఉన్నారంటూ అసత్య ప్రచారం జరుగుతోందని వివరించారు. 2016-24 మధ్యకాలంలో గణాంకాలపై వాస్తవాలను సేకరించినట్లు తెలిపారు. ఈ గణాంకాల మేరకు మాదిగల్లో 66,522 మందికి.. మాలల్లో 48,388 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు గుర్తుచేశారు. రెండు పడకల గదుల ఇళ్ల కేటాయింపుల్లోనూ 64,351 మంది మాదిగలు లబ్ధి పొందగా.. మాలల్లో ఆ సంఖ్య 41,439గా ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 10,776 మంది మాదిగలకు, 3,759 మంది మాలలకు లబ్ధి చేకూరిందన్నారు. కులగణన మేరకు ఎస్సీలకు 18% రిజర్వేషన్లు కల్పించాలని, బడ్జెట్‌లో కేటాయింపులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. మాల కార్పొరేషన్లు, నేతగాని సొసైటీలకు నిధులను కేటాయించాలన్నారు. రూ.10 కోట్లలోపు విలువైన కాంట్రాక్టు పనుల్లో మాలలకు 18 నుంచి 20% అవకాశం కల్పించాలని, 15% నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై మిగతా ప్రతినిధుల అభిప్రాయాలు ఈ కింది విధంగా ఉన్నాయి..

- ఎస్సీ వర్గీకరణ చరిత్రలో నిలిచిపోయే అంశం అని.. ఇంతటితో సరిపెట్టకుండా.. ఎస్సీల జీవితాలను మెరుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు.
- వర్గీకరణతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభించదని, ప్రతి ఇంటికి పథకాలను వర్తింపజేయాలని సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు.
- ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశానికే ఆదర్శమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం కూడా సెంట్రల్ సర్వీసెస్‌లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు.
- తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్.. సభలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టిన రోజు అసెంబ్లీకి హాజరుకాకపోవడం దారుణమని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు.
- ఉద్యమ సమయంలో కేసీఆర్ మాట ఇచ్చినట్లు.. 2014లోనే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేసి, పార్లమెంట్‌కు పంపారని జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు గుర్తుచేశారు.
- దశాబ్దాల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఆమోదించినందుకు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అన్ని రాజకీయ పార్టీల నేతలకు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ ధన్యవాదాలు తెలిపారు.

దళితుల దశాబ్దాల కల సాకారం

దశాబ్దాల కలను నెరవేర్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ

- ఎస్సీ వర్గీకరణ ఏ కులానికీ వ్యతిరేకం కాదు
- సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్
- సభలో మంత్రి దామోదర



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దళితుల దశాబ్దాల కలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. వర్గీకరణ ఏ కులానికీ వ్యతిరేకం కాదని, కేవలం సామాజిక న్యాయం మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ మొదటినుంచీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలే సీఎం రేవంత్‌రెడ్డి దార్శనికతకు తార్కాణమన్నారు. మంగళవారం శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్ స్వాతంత్ర్యం వచ్చిన 15 ఏళ్లకే మొదలైందని, దీనికోసం ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఉద్యమాలు జరిగి, ఎంతో మంది త్యాగాలు చేశారని తెలిపారు. 2025 ఫిబ్రవరి 4వ తేదీ (సోషల్ జస్టిస్ డే), మార్చి 18వ తేదీలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. గతంలో ఓసారి వర్గీకరణ చేసినా.. కోర్టు తీర్పులతో అది నిలిచిపోయిందని గుర్తు చేశారు. గతంలో కులగణనను చివరిగా 1931లో చేశారని, 1936లో షెడ్యూల్డ్ కులాల జాబితాను ప్రకటించారని పేర్కొన్నారు. దళితులకు విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పించగా, ఆర్థిక స్వావలంబన కోసం ఉద్యోగాలు, పాలనలో భాగస్వామ్యం కోసం చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, ఆ ఫలాలు ఎస్సీలకు వారి జనాభా ప్రాతిపదికన పంపిణీ కాలేదన్నారు. ఈ అంశమే ఆందోళనకు, అసంతృప్తికి కారణమైందని తెలిపారు. 1965లోనే ఎస్సీ వర్గీకరణపై బీఎన్ లోకూర్ కమిటీని అప్పటి ప్రభుత్వం నియమించిందన్నారు. 1975లోనే పంజాబ్ ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసిందని గుర్తు చేశారు.

2000లో వర్గీకరణ అమలు చేసినా..

1990లో ఉమ్మడి రాష్ట్రంలో వర్గీకరణ ఉద్యమం ఉధృతం కాగా, నాటి సర్కారు జస్టిస్ రామచంద్రరాజు నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఎస్సీలను 4 గ్రూపులుగా వర్గీకరించి, రిజర్వేషన్లు అమలు చేయాలని కమిషన్ సూచించిందని, ఆ మేరకు 2000 సంవత్సరంలో ఎస్సీలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు అమలు చేశారని పేర్కొన్నారు. అత్యంత వెనుకబడిన రెల్లి, దాని ఉపకులాలను గ్రూప్-ఎలో చేర్చి, వారికి కమిషన్ సూచనల ప్రకారం అదనపు ప్రయోజనం కల్పించారని వివరించారు. అయితే కోర్టు కేసులు, సుప్రీంకోర్టు తీర్పుతో 2004 నుంచి వర్గీకరణ ఆగిపోయిందన్నారు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వర్గీకరణకు అనుకూలంగా వాదించేందుకు ప్రభుత్వం పూనుకుందని అన్నారు. గతేడాది ఆగస్టు 1న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పునిచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చునని చెప్పిందని గుర్తు చేశారు. అయితే అక్షరాస్యత, వృత్తి, జనాభా, ఉద్యోగావకాశాలు, ఆర్థిక, సామాజిక పరిస్థితులను ప్రామాణికంగా తీసుకోవాలని ఆదేశించిందన్నారు. సుప్రీం తీర్పు వచ్చిన గంటలోనే.. వర్గీకరణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని తెలిపారు. అనంతరం వర్గీకరణ అమలు కోసం క్యాబినెట్ సబ్ కమిటీని నియామకం, కమిటీ సూచనతో హైకోర్టు రిటైర్డ్ జడ్జితో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు, జిల్లాల్లో కమిషన్ పర్యటించి, క్షేత్ర స్థాయిలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం వంటి పరిణామాలను మంత్రి వివరించారు.

ఏకసభ్య కమిషన్ సిఫారసు మేరకు..

ఏకసభ్య కమిషన్ 82 రోజుల్లో అధ్యయనం పూర్తి చేసి, 199 పేజీల నివేదికను ఈ ఏడాది ఫిబ్రవరి 3న ప్రభుత్వానికి సమర్పించిందని మంత్రి దామోదర తెలిపారు. 59 ఎస్సీ కులాలను 3 గ్రూపులుగా విభజించాల్సిందిగా సిఫారసు చేసిందన్నారు. మొదటి గ్రూపులో అత్యంత వెనుకబడిన 15 కులాలను చేర్చారని, వారి జనాభా 1,71,625 మంది అని చెప్పారు. వీరి జనాభా శాతానికి మించి 1శాతం రిజర్వేషన్ కేటాయించారన్నారు. రెండో గ్రూపులో 18 కులాలను చేర్చారని, వీరి జనాభా 32,74,377 మంది ఉండగా 9శాతం రిజర్వేషన్లు కేటాయించారని తెలిపారు. మూడో గ్రూపులో 26 కులాలను చేర్చి 5 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఇప్పుడు వర్గీకరణలో భాగస్వామిగా ఉండడం తనకు దక్కిన అదృష్టమని మంత్రి దామోదర అన్నారు. ఈ బిల్లుకు మద్దతివ్వాలని అన్ని పక్షాలను కోరారు. కాగా, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన అనంతరం ముగింపు చర్చలో మంత్రి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సహకరించిన అన్ని పక్షాలకు, శాసనసభ్యులందరికీ, సీఎం రేవంత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలుస్తుంది

- అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. రేవంత్‌కు ధన్యవాదాలు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభలో మంగళవారం ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. వర్గీకరణతో ఎవరికీ నష్టం లేదని, ఏ వర్గానికి వ్యతిరేకం కాదని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలను పంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. 2011 తరువాత కూడా ఎస్సీల జనాభా పెరిగిందని, దానిని కూడా పరిగణనలోకి తీసుకుంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. దాని ప్రకారం రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచాలన్నారు. వర్గీకరణలో కులాల కూర్పు విషయంలో పునరాలోచన చేయాలన్నారు. కాగా, ఏళ్ల తరబడి మాదిగలు అసమానతకు గురయ్యారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. వర్గీకరణతో అందరికీ న్యాయం జరుగుతుందని, మాదిగ, మాలలు అందరం కలిసుందామని పిలుపునిచ్చారు. వర్గీకరణ పోరాటంలో అమరులైన వారి ఆత్మకు ఇక శాంతి చేకూరుతుందని కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య అన్నారు. బిల్లు ఆమోదం పొందిన అనంతరం కాంగ్రెకు చెందిన మాదిగ ఎమ్మెల్యేలు శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. మరోవైపు మంత్రి దామోదర రాజనర్సింహ.. సభలో బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలను కలిసి వర్గీకరణ బిల్లుకు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వర్గీకరణ అమలయ్యాకే స్థానిక ఎన్నికలు జరపాలి: ప్రశాంత్‌రెడ్డి

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తీసుకొచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014 నవంబరు 29న అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తుచేశారు. ఇదే విషయంపై ప్రధాని మోదీని కూడా కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. అయినా కేంద్రం నాన్చివేత ధోరణితో వర్గీకరణకు ఇంతకాలం పట్టిందన్నారు.

సీపీఎం హర్షం..

శాసనసభలో ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లుల ఆమోదంపై సీపీఎం హర్షం వ్యక్తం చేసింది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

శిల్పకళా సౌందర్యం.. అద్భుతం!

- 'గుట్ట' ఆలయ సందర్శన అనిర్వచనీయం
- ప్రపంచ సుందరి క్రిస్టినా పిస్కోవా
- వైభవంగా యాద'గిరి' ప్రదక్షిణ

యాదగిరిగుట్ట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరి గుట్ట లక్ష్మీ నృసింహుడి ఆలయంలో శిల్ప కళా సౌందర్యం ఉట్టిపడుతోందని ప్రపంచ సుందరి-2024 క్రిస్టినా పిస్కోవా అన్నారు. మంగళ వారం హిందూ సంప్రదాయ రీతిలో అచ్చమైన చీర కట్టుతో వచ్చిన ఆమె.. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తిరువీ ధుల్లో అఖండ దీపారాధన చేశారు. ఆ తర్వాత వేద పండితులు ఆలయ ముఖ మండపంలో ఆశీర్వ చనం చేయగా ఈవో భాస్కర్‌రావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు. సనాతన హిందూ ధర్మం, ఆలయ విశిష్టత, సంప్రదాయా లను ఈవో ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందని, ఆలయ సందర్శన తనకు అనిర్వచనీయ మైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని అన్నారు. కాగా, స్వామి జన్మనక్షత్రం (స్వాతి) పుర స్కరించుకుని మంగళవారం గిరి ప్రదక్షిణ వైభ వంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చిన 18 వేల మంది భక్తులు ప్రదక్షిణలు నిర్వ హించారు. వేకువజామున 3 గంటల నుంచే కొం దరు భక్తులు గిరిప్రదక్షిణ మొదలుపెట్టగా, ప్రత్యేక వేషధారణలో కళాకారుల భజనలు, నృత్యాలు, కీర్త నలతో కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్లు సుమారు 45 నిమిషాల పాటు స్వామివారిని తలు చుకుంటూ భక్తులు ప్రదక్షిణ పూర్తి చేశారు. ఆలయ ముఖమండపంలో వేకువజామున అర్చకులు స్వా తి నక్షత్ర పూజల్లో భాగంగా 108 కలశాలు ఏర్పాటు చేసి పవిత్ర నదీ జలాలు, పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం నిర్వహించారు.



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు; ఆలయ ప్రాంగణంలో ప్రపంచ సుందరి క్రిస్టినా పిస్కోవా

విషం తప్ప విషయంలేని సీఎం రేవంత్

- పంటల ముప్పును చెప్పినా పట్టించుకోలేదు: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'సాగునీరు అందకపోతే తీవ్రస్థాయిలో పంట నష్టం వాటిల్లుతుందని ముంచుకొస్తున్న ముప్పు ను ముందే హెచ్చరించాం.. అయినా విషం తప్ప విషయంలేని సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదు' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరో పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టొద్దని మొత్తుకున్నా ఈ తెలివిలేని కాంగ్రెస్ సర్కారు తలకెక్కలేదని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. పచ్చని పంటలు ఎండిపోతున్నాయని వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రాథమిక నివే దిక రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. ఇది కాలం తెచ్చిన కరు వుకాదని, కాంగ్రెస్ కక్షగట్టి తెచ్చిన కరువు కాబట్టి రైతులను ఆదుకునే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదేనని హెచ్చరించారు. సర్కారు బాధ్యతను విస్మరిస్తే తెలంగాణ రైతాంగంతో కలిసి కాంగ్రెస్ సర్కార్ భరతం పడతామన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావుకు హైకోర్టులో స్వల్ప ఊరట

మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని, దానిపై దర్యాప్తుకు ఆదేశించాలని ఇటీవల హత్యకు గురైన నాగ వెల్లి రాజలింగమూర్తి గతంలో భూపాలపల్లి జిల్లా కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో వ్యక్తిగతంగా హాజరుకావా లని కేసీఆర్, హరీశ్‌రావు తదితరులకు జిల్లా కోర్టు నోటీసులు జారీ చేయగా, వాటిని కొట్టేయాలని కేసీఆర్, హరీశ్‌లు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేస్తూ తీర్పు వెలువరించింది. రాజలింగమూర్తి జిల్లా కోర్టులో దాఖలు చేసిన రివిజన్ పిటిషన్ విచారణార్హమే అని, కేసును మళ్లీ జిల్లా కోర్టుకే అప్పగిస్తూ, తాజాగా విచారణ చేపట్టాలని పేర్కొంది.

మేడిగడ్డపై డ్రోన్ ఎగరేసిన కేసులో తీర్పు రిజర్వు

మేడిగడ్డపై డ్రోన్ ఎగరేయడంపై నమోదైన కేసును కొట్టేయాలని మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. మేడిగడ్డ సందర్శనకు వెళ్లిన కేటీఆర్, ఇతర నాయకులు నిషేధిత ప్రా ంతంలో బ్యారే జీపై అనుమతి లేకుండా డ్రోన్ ఎగుర వేశారని మహదేవ్‌పూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా, దానిని కొట్టే యాలని కేటీఆర్ తది తరులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

రవిప్రకాశ్ పిటిషన్ కొట్టేసిన బాంబే హైకోర్టు

టీవీ-9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు బాంబే హైకోర్టులో ఎదురుదెబ్బ తగి లింది. థానే బోరివెళ్లి ప్రాజెక్టుకు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించడంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ అక్రమాలకు పాల్పడిందని రవిప్రకాశ్ దాఖలు చేసిన పిల్‌ను బాంబే హైకోర్టు కొట్టేసింది. కోర్టుకు దురుద్దేశం అంటగట్టే ఉద్దే శంతో రవిప్రకాశ్ ట్వీట్లు చేశారని, అంతేకాకుండా వాస్తవాలను దాచిపెట్టి దురుద్దేశంతో వ్యవహరించారని పేర్కొంది. ఈ పిల్ దురుద్దేశంతో దాఖలు చేసినందున మెరిట్‌పై విచారణ చేపట్టేందుకు పిటిషన్‌కు విచారణార్హత లేదని స్పష్టం చేసింది. కోర్టును తప్పుబట్టే విధంగా పోస్ట్ చేసిన ట్వీట్లను న్యాయవాదుల సలహా మేరకు ఐదురోజుల తర్వాత రవిప్రకాశ్ తొలగించా రని, పిటిషనర్‌కు వ్యతిరేకంగా కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టడానికి సైతం వెనుకాడబోమని తెలిపింది. మేఘా సంస్థకు రవిప్రకాశ్‌కు మధ్య పెండిం గ్‌లో ఉన్న వివాదాల(లిటిగేషన్)కు సంబంధించిన వివరాలు దాచిపెట్టారని, ఆయా కారణాల నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు పేర్కొంది.

దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా తిరుమలలో ఒక రోజు అన్నప్రసాద వితరణ

- టీటీడీకి రూ.44 లక్షలు అందజేసిన సీఎం కుటుంబీకులు

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నారా దేవాన్ష్ పుట్టిన రోజు సంద ర్భంగా ఈ నెల 21వ తేదీన (శుక్రవారం) తిరుమలలో ఒక రోజు అన్నప్రసాద వితరణ చేయనున్నారు దీనికయ్యే ఖర్చు రూ.44 లక్షలను ఇప్పటికే సీఎం చంద్రబాబు కుటుంబీకులు టీటీడీకి అందించారు. ఏటా దేవాన్ష్ పుట్టినరోజున తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఒకరోజు అన్నప్రసాద వి తరణకు అయ్యే ఖర్చును టీటీడీకి విరాళంగా అందజేసి భక్తులకు అన్నప్రసా దాలను వడ్డించడం చంద్రబాబు కుటుంబానికి ఆనవాయితీగా వస్తోంది.

చనిపోయిన కోళ్లు మంజీరలో

- దుర్గంధ భరితంగా మారిన జలాలు
- నీళ్లు తాగడానికి భయపడుతున్న ప్రజలు

పాపన్నపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు భారీ సంఖ్యలో చనిపోయిన కోళ్లను మంజీర నదిలో పడేశారు. జిల్లాలో వింత వ్యాధితో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. మరో పక్క బర్డ్ ఫ్లూ భయం వెంటాడుతోంది. మంజీరా జలాలు తాగునీటికి వినియోగిస్తున్న నేప థ్యంలో అందులో చనిపోయిన కోళ్లు దర్శనమివ్వడంతో జనం భయపడుతు న్నారు. అవి కుళ్లి జలాలు కలుషితమవుతున్నాయి. ఇటీవల విస్తరిస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధి వల్లే కోళ్ళు చనిపోయి ఉంటాయని భావిస్తున్నారు. దిగువన మెదక్ పట్టణానికి తాగునీరు అందించే ప్రాజెక్టు ఉంది. ఈ నీటి వల్ల చేపలు, పశు వులు మృత్యువాత పడే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కేసీఆర్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో నీటి ఎద్దడి

- దేవన్నపేట పంప్‌హౌస్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి ఉత్తమ్
- పనులు జరుగుతుండడంతో అధికారులతో సమీక్ష



హనుమకొండ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో నీటి ఎద్దడి ఏర్ప డిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమ ర్శించారు. దేవాదుల ఎత్తిపోతల పథ కంలో భాగంగా హనుమకొండలోని దేవ న్నపేటలో నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ పనులను మంగళవారం మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ పరిశీ లించారు. మంత్రులు మోటార్లు ప్రారం భించడానికి వచ్చినప్పటికీ అక్కడ పంప్ హౌస్ పనులు జరుగుతున్నందున అధి కారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దేవాదుల పంప్ హౌస్ పనుల వివ రాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, దీంతో రాష్ట్రంలో నీటి ఎద్దడి ఏర్పడిందని ఉత్తమ్ ఆరోపించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలు ఎండి పోకుండా ఉండేందుకు ఫేజ్-3లో మోటార్లను ఆన్‌చేసేందుకు వచ్చినట్లు తెలి పారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో బుధవారం జరగాల్సిన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. ఎంత ఆలస్యమైనా మోటార్లు ఆన్ చేసి వెళ్తామని చెప్పారు. 18 నెలల్లో పెండింగ్‌లో ఉన్న దేవాదుల పనులను పూర్తిచేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

మంత్రుల పర్యటన మార్పుతో హడావిడి

మొదట నిర్ణయించిన ప్రకారం మోటార్లు ఆన్‌చేసే కార్యక్రమం బుధ వారం జరగాల్సి ఉండగా, అసెంబ్లీలో బడ్జెట్ సమావేశం ఉన్నందున పర్యట నలో మార్పు చేశారు. మంత్రుల పర్యటన మారడంతో అధికారులు, పోలీసు సిబ్బంది ఏర్పాట్లు చేయడంలో కొంత ఇబ్బంది పడ్డారు. మరోవైపు పంప్‌హౌజ్ మరమ్మతు పనులు పూర్తవకుండా, ట్రయల్‌రన్ చేయకుండా మోటార్లు ఆన్‌చేసేందుకు మంత్రులు రావడం, పనుల పూర్తయ్యేదాకా వేచి చూస్తామనడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆస్ట్రియా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం మరమ్మతు పనులను కొనసాగిస్తుండటంతో పాటు సాంకేతిక సమస్య కారణంగా మంత్రులు ట్రయల్ రన్‌ను ప్రారంభించలేకపోయారు. తాము రాత్రి ఎంత ఆలస్యమైనా ఉండి మోటార్లను ఆన్‌చేసి వెళ్తామని స్పష్టం చేసిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వరంగల్ నిట్‌లో ఏర్పాటు చేసిన బస కేంద్రానికి వెళ్లారు.

3.15 లక్షల కోట్ల బడ్జెట్?

(మొదటిపేజీ తరువాయి)



చూసి అత్యుత్సాహానికి పోవద్దని, వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్‌ను రూపొందించుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి వి క్రమార్క సమాలోచనలు జరిపినట్లు తెలిసింది. సీఎం చేసిన సూచనల మేరకు బడ్జెట్‌కు తుది రూపు ఇచ్చారని.. ఈసారి బడ్జెట్ రూ.3.10 లక్షల కోట్ల నుంచి రూ.3.15 లక్షల కోట్ల మధ్య ఉండొ చ్చని సమాచారం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.2,91,159 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. కానీ, అందులో పెట్టుకున్న లక్ష్యాల మేరకు ఖర్చు చేయలేకపోతోంది. ఈసారి వ్యయం రూ.2.20 లక్షల కోట్ల వరకూ ఉండొచ్చని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇలాంటి అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, 7 లేదా 8 శాతం మేర నిధు లను పెంచి కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుందని సమాచారం.

ఏ శాఖకు ఎంతెంత?

రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ ఈసారి రూ.26 వేల కోట్లు కేటా యించాలని కోరింది. అడిగినంతా ఇవ్వకపోయినా.. పాలమూరు-రంగా రెడ్డి వంటి ప్రాధాన్య ప్రాజెక్టుల దృష్ట్యా సాగునీటి రంగానికి భారీగానే కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. అలాగే, వైద్య ఆరోగ్య శాఖకు ఈసారి రూ.12-13 వేల కోట్ల వరకు కేటాయించవచ్చని తెలి సింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖకు రూ.11,468 కోట్లను కేటాయించారు. ఈసారి తమకు రూ.9 వేల కోట్లు కేటాయిం చాలని హోంశాఖ కోరింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమి షనరేట్లకు రూ.2,500 కోట్లను ప్రతిపాదించినట్లు సమాచారం. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరోలకు అదనపు కేటా యింపులు అవసరమంటూ బడ్జెట్ కసరత్తు సందర్భంగా హోంశాఖ వి వరించింది. 2024-25లో పోలీసు శాఖకు రూ.8,659 కోట్లు కేటాయిం చారు. ఈసారి స్వల్పంగా పెరుగుదల ఉంటుందని పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. పోలీసు అకాడమీ, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, జైళ్లు, అగ్నిమాపక విభాగం, స్పెషల్ బెటాలియన్లు, ఎస్పీఎఫ్‌కు ఈసారి కూడా కేటాయింపులు పెద్దగా పెరగకపోవచ్చని తెలుస్తోంది. ఇక మహిళా శిశు, దివ్యాంగులు, సీనియర్ సిటిజ న్స్ శాఖకు కొత్త బడ్జెట్‌లో రూ.3,700 కోట్లు కేటాయించే అవకాశాలున్నాయి. ఇందులో అంగన్‌వాడీలలో చిన్న పిల్లల సంరక్షణకు రూ.100 కోట్ల వరకూ ప్రత్యేకంగా కేటాయించ నున్నారు. ఇవి కాక, మహిళా శిశు సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉండే మహిళా సహ కార సంస్థ, మహిళా కమిషన్‌కు కూడా కొంత మేర నిధులను కేటాయించనున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రూ.350 కోట్లు, రోడ్లు-భ వనాల శాఖకు రూ.6000-7000 కోట్ల వరకు, మిషన్ భగీరథకు రూ.6000 కోట్ల మేరకు నిధులు కేటాయించనున్నారని సమాచారం.

ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం

మెట్రో రైలు రెండో దశ, స్కిల్ యూనివర్సిటీ, రీజినల్ రింగు రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్), మూసీ రివర్ ఫ్రంట్ వంటి ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టు లకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి అత్యంత ప్రాధాన్యమివ్వనుంది. ఆర్‌ఆర్ ఆర్ ఉత్తర భాగం భూసేకరణకు పరిహారం చెల్లింపు కింద రూ.1,525 కోట్లను కేటాయించనున్నట్లు సమాచారం. మెట్రో రెండో దశ ప్రాజె క్టుకు ప్రభుత్వం ఇవ్వాల్సిన 30 శాతం మేర నిధుల్లో కొంత మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయించవచ్చని తెలిసింది. వ్యవసాయ రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించే 'ఇందిరా ఆత్మీయ భరోసా' పథకాన్ని ఈ ఫిబ్రవరి 26న ప్రభుత్వం ప్రారంభిం చింది. దీనికింద మొదటి దశలో 18,180 మంది లబ్ధిదారులకు రూ.6000 చొప్పున సొమ్మును అందజేసింది. మిగతా రూ.6000 చొప్పున ఇంకా అందించాల్సి ఉంది. కొత్త లబ్ధిదారులను కూడా పరిగ ణనలోకి తీసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో.. ఈ పథకానికి ఈసారి రూ.350 కోట్లను కేటాయిచనుందని సమాచారం. అలాగే.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిమిత్తం గృహనిర్మాణ శాఖకు ఈసారి రూ.8-9 వేల కోట్ల వరకు కేటాయించనున్నారని సమాచారం. నిరుద్యోగ యువత ఒక్కొక్కరికీ రూ.3 లక్షల లోపు ఆర్థిక సాయాన్ని అందించే 'రాజీవ్ యువ వికాసం' పథకానికి కొత్త బడ్జె ట్‌లో రూ.6000 కోట్లను కేటాయించనుంది.

అనాథ బాలికలే టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెల్ల గ్రామానికి చెందిన ముస్కు లత(38) అనాథ బాలిక లను వలపన్ని, వారితో వ్యభిచారం చేయించాలనే పథకంతో ఓ ముఠాను ఏర్పాటు చేసింది. శంభునిపేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్ సైలానీ బాబా, మహ్మద్ అల్తాఫ్, గంజాయి స్మగ్లర్ వదూద్‌ను తన ముఠాలో చేర్చుకుంది. అనాథలైన బడి పిల్లలను లక్ష్యంగా చేసుకుంది. ఈ క్రమంలో అఫ్నాన్ ప్రేమ పేరుతో ట్రాప్ చేసి ఓ అనాథ బాలికను పావుగా వాడుకోవడం ప్రారంభించింది. ఆ బాలిక సహకారంతో.. అనాథలుగా ఉన్న పాఠశాల విద్యార్థులను గుర్తించేది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్ లో తొమ్మిదో తరగతి చదివే ఓ బాలికను గుర్తించి, వలప న్నింది. ఆమెకు రెండుమూడు సార్లు గంజాయి ఇచ్చింది. ఈ నెల 11న లతతో వెళ్లిన ఆ బాలిక, ఎంతకీ తిరిగిరాకపోవ డంతో.. తల్లిదండ్రులు మీల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన పోలీ సులు.. అరెపల్లిలో ఆమెను గుర్తించారు. ఆమెతోపాటు.. లతతో ఉండే అనాథ బాలి కను అదుపులోకి తీసుకుని, విచారిస్తే.. కిలేడీ ముఠా డొంక కదిలింది. అంతేకాదు.. బాధిత బాలికపై సైలానీ బాబా అత్యాచారం చేసి, వీడియో తీశాడని, పిలిచిన ప్పుడు రాకుంటే.. ఆ దృశ్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించిన విషయం వెలుగులోకి వచ్చింది. నింది తుల వివరాలను సేకరించిన పోలీసులు.. మంగళవారం వారిని వలపన్ని పట్టుకున్నారు. లత, ఆమెకు సహకరించిన అనాథ బాలిక, ముఠా సభ్యులు– అఫ్నాన్, సైలానీ, అల్తాఫ్, గంజాయి విక్రేత వదూద్‌లను అరెస్టు చేశామని సీపీ చెప్పారు. నిందితు లపై పోక్సో, ఎన్‌డీపీఎస్, మానవ అక్రమ రవాణా నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించి నట్లు వివరించారు. వారి నుంచి 1.8 కిలోల గంజాయి, 4300 కండోమ్ ప్యాకెట్లు, రూ.75 వేల నగదు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అఫ్నాన్, సైలానీ, అల్తాఫ్, వదూద్ పాత నేరస్థులని, వారిపై కమిషనరేట్‌తోపాటు.. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఠాణాలో పోక్సో, ఎస్సీఎస్టీ అట్రా సిటీ కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

తల్లి, తోడబుట్టిన వాళ్లు చనిపోయారని.. తప్పుడు సర్టిఫికెట్లతో రూ.కోటి స్థలం కబ్జా

- చాదర్‌ఘాట్ పోలీసుల అదుపులో ముగ్గురు

చాదర్‌ఘాట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తల్లితో పాటు కుటుంబ సభ్యులంతా చనిపోయారని నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి రూ.కోటిన్నర విలువైన స్థలాన్ని కబ్జా చేసింది ఓ కిలేడీ. భూమి యజమాని పోలీసులను ఆశ్రయించడంతో.. దగా చేసిన వారు అరెస్టయ్యారు. చాదర్‌ఘాట్ పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్తినాపురంలో ఉంటున్న రాచమల్ల పుష్పమ్మ(80)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పుష్పమ్మ పేరిట మలక్‌పేటలో రూ.కోటికిపైగా విలువ చేసే 105 గజాల స్థలం ఉంది. ఈమె ముగ్గురు కుమారుల్లో ఒకరైన శ్రీనివాస్ అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకుని.. పుష్పమ్మ బావ కోడలైన రాచమల్ల రాణి.. పుష్పమ్మ స్థలాన్ని కాజే సేందుకు పథకం వేసింది. రూ.కోటికిపైగా విలువ ఉన్న స్థలానికి రూ.30 లక్షలు ఇస్తానని శ్రీని వాస్‌కు ఆశ చూపించింది. దీంతో శ్రీనివాస్.. తల్లి పుష్పమ్మతోపాటు తోడబుట్టిన వారంతా చని పోయారని తప్పుడు ధ్రువీకరణ పత్రాలను తయారు చేయించాడు. అందుకు రాణి సహకరిం చింది. అనంతరం ఆ స్థలాన్ని రాణి తన పేరిట గత మే లో రిజిస్ట్రేషన్ చేయించుకుంది. శ్రీనివా స్‌కు రూ.7లక్షలు ఇచ్చి మిగతా డబ్బులు ఎగ్గొట్టింది. పుష్పమ్మ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌తో పాటు రాణి, ఆమె భర్త రాచమల్ల సురేందర్, అతని అన్న కుమారుడు రాచమల్ల సందీప్‌పై కేసులు నమోదు చేశారు. సురేందర్ మినహా మిగతా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

టీజీ పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్ సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలిసెట్)- 2025 నోటిఫికేషన్ విడుదలయింది. 10వ తరగతి పూర్తి చేసిన/ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. బుధవారం నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. రిజిస్ట్రేషన్ రుసుం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250, ఇతరులకు రూ.500 గా నిర్ణయించారు. మే 13న పాలిసెట్ నిర్వహిస్తారు. మరిన్ని వివ రాల కోసం పాలిసెట్.ఎస్‌బీటీఈటీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను లేదా 8031404549 నంబరును సంప్రదించవచ్చు.

అకౌంటెంట్‌ను నిర్బంధించి.. దాడి

- సుచిర్ ఇండియా ఎండీ కిరణ్‌పై కేసు

బంజారాహిల్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆడిటింగ్‌లో తేడాలు వచ్చాయని కంపెనీలో పనిచేసే అకౌంటెంట్‌ను నిర్బం ధించి దాడి చేసిన సుచిర్ ఇండియా ఎండీపై కేసు నమోద యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రియాంక్ కొద్ది కాలంగా సుచిర్ ఇండియాకు చెందిన వరంగల్‌లోని రిసార్ట్స్‌లో అకౌం టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కంపెనీ ఆడిటింగ్ జరి గింది. ఇందులో రూ.5 లక్షలు తేడా వచ్చింది. ఈ విషయమై ప్రియాంక్‌ను సుచిర్ ఇండియా ఎండీ కిరణ్ బంజారాహిల్స్ లోని తన ఇంటికి పిలిపించి, డబ్బు ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. ప్రియాంక్ తనకు తెలియదని చెప్పడంతో కిరణ్ స్వయంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అతన్ని నిర్బం ధించి దాడి చేశారు. కిరణ్ బయటకు వెళ్లాక ప్రియాంక్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అతడిని విడిపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే తాను ప్రియాంక్‌ను నిర్బంధించలేదని, కొట్టలేదని అవ సరమైతే సీసీ కెమెరాలు పరిశీలించవచ్చని కిరణ్ చెబుతు న్నారు. ప్రియాంక్ చేసిన అనేక మోసాలకు సంబంధించిన ఆధారాలు ఆపరేషనల్ హెడ్ వద్ద ఉన్నాయని అన్నారు. ఆయన వచ్చే వరకు ప్రియాంక్‌ను తమ ఇంట్లోని కార్యాల యంలో కూర్చోబెట్టామని చెప్పారు. తన మోసాలు బయటకు వస్తాయనే ప్రియాంక్ పోలీసులకు ఫోన్ చేసి తప్పుడు కేసు పెట్టాడని కిరణ్ ఆరోపించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.